ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 127 పేజీలు: 10+4 వెల: 8.00

సద్దుమణిగిన కర్ణాటక వివాదం

అన్నామలై ఉద్యమానికి భారీగా మద్దతు

5లో

# 50శాతం పచ్చదనం మన లక్ష్యం



శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జీలకు నిర్వహిస్తున్న వర్క్‌షాపులో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి

### ఎన్నికల ప్రచారంలో చెప్పినవన్నీ చేస్తున్నాం

### అన్ని ఎన్నికల్లో 'కూటమి'గానే ముందుకు

### ఈ పర్యాయం ప్రతిచోట గెలవాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 6, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆరోగ్యవంతమైన సమాజనిర్మాణంలో ప్రజలు కీలక భాగస్వామ్యులు కావాలని సిఎం చంద్రబాబు అన్నారు. సైకిల్‌తో ఆరోగ్యం, పర్యావరణ హితంతో పాటు ఇంధన పొదుపుకూడా జరుగుతుందన్నారు. పర్యావరణ దినోత్సవం రోజున ప్రజల్లోకి మంచి సందేశం తీసుకెళ్లామని చెప్పారు. నాయకులుకూడా సైకిల్ తొక్కి, ప్రజలు ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకునేలా చేశారని సిఎం ప్రశంసించారు. శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం క్లస్టర్ ఇన్‌చార్జీలకు నిర్వహిస్తున్న వర్క్‌షాపుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌భవన్‌లో మీడియాతో కొద్దిసేపు ముఖ్యమంత్రి ముచ్చటించారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యమని చంద్రబాబు ప్రకటించారు. ఆ స్ఫూర్తితో పనిచేస్తే రాష్ట్రంలో వాతావరణ సమతుల్యత సాధించవచ్చని అన్నారు. శారీరక శ్రమ ఆరోగ్యానికి మంచిదన్నారు. తాము నిన్న విశాఖలో ఇదే విషయాన్ని పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్పష్టం చేసామన్నారు. సైకిల్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తుందన్నారు. ఇక వర్క్‌షాపులో రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు.

దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బిజెపితో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టిడిపితో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఎపి సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాండ్‌మైండ్‌తో ఆలోచించాలని సిఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని విమర్శించారు. వైసీపీ హయాంలో సిపిఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు.. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం >>2



సిఎం చంద్రబాబుతో రాజ్యసభ అభ్యర్థులు చింతకాయల విజయ్, సానా సతీశ్, భాష్యం రామకృష్ణ

# టిడిపి రాజ్యసభ అభ్యర్థులు వీరే

### భాష్యం రామకృష్ణ, సానా సతీశ్, చింతకాయల విజయ్ ఖరారు, రేపు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం

**విజయవాడ, జూన్6, ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల కసరత్తు కొలిక్కి వచ్చింది. భాష్యం రామకృష్ణ, సానా సతీశ్, చింతకాయల విజయ్ పేర్లు ఖరారయ్యాయి. సిఎం రాజ్యసభ అభ్యర్దుల ఎంపిక విషయంలో ఆచితూచి ఎంపిక చేసారు. ఆయా అభ్యర్థులకు అధినేత చంద్రబాబు నుంచి పిలుపువచ్చింది. టిడిపి రాజ్యసభ అభ్యర్థులపై అధికారిక ప్రకటన రాత్రి పొద్దుపోయిన తరువాత వెల్లడించారు, టిడిపి అభ్యర్దులంతా సోమవారం నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే కూటమి భాగస్వామి పక్షం జనసేన అభ్యర్ది లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేసారు.

# 'నైరుతి' వచ్చేసింది

### అనంతపురం, చిత్తూరు జిల్లాలను తాకిన రుతుపవనాలు

### 10వ తేదీకల్లా మిగిలిన ప్రాంతాలకు విస్తరణ

**విజయవాడ, జూన్6, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతుపవనాలు రాయలసీమ జిల్లాలను తాకాయి. ఎపిలోని అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలను రుతుపవనాలు తాకినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఐఎండి సమాచారం, ఆర్టీజిఎస్ అవేర్ పోర్టల్ విశ్లేషణ ప్రకారం శనివారం (జూన్ 6) >>2



# ఆర్టీసీ బస్సులో మంటలు

### జగ్గయ్యపేట నుండి విజయవాడ వెళ్తుండగా దుర్ఘటన

### కిటికీలనుంచి దూకేసిన ప్రయాణికులు

**విజయవాడ, జూన్6, ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి వద్ద ఈరోజు ఒక భారీ బస్సు ప్రమాదం తృటిలో తప్పింది. జగ్గయ్యపేట నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఎపిఎస్ ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఒక పెద్ద >>2





# బ్రహ్మనాయుడుకు రిమాండ్

### చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** నగర శివార్లలోని గండిపేట్ మండలంలో గల పదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు నకిలీ పత్రాలు, తప్పుడు జిఒలు సృష్టించిన కేసులో అరెస్టయిన వైసిపి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు రాజేంద్రనగర్ కోర్టు శనివారం రెండు వారాల రిమాండు విధించింది. అనంతరం ఆయనను నార్సింగి పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. గత నెల 23వ తేదీన వెలుగు చూసిన ఈ కేసులో మొదట ముగ్గురు నేరగాళ్ల అరెస్టవగా ఆ తరువాత మరో >>2

# వీఆర్వో ఆత్మహత్య

**కర్నూలు రూరల్, జూన్ 6, ప్రభాతవార్త:** కర్నూల్ మండల పరిధి వెంకయ్ పల్లె ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న. మహమ్మద్ హుస్సేన్ (48) శనివారం తెల్లవారుజామున తన స్వగృహం ముందు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య కాజా మున్నిస, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వివరాల్లోకెళితే... గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు ఆత్మహత్యకు పాల్పడినవీఆర్వో గత కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. విపరీతమైన నడుము నొప్పి, మోకాళ్ల నొప్పులతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

**కలకలం రేపిన సూసైడ్ నోట్**

మృతి చెందిన వీఆర్వో రాసిన సూసైడ్ లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా. పైఅధికారులు అయినటువంటి కర్నూల్ రూరల్ అర్బన్ తహసిల్దార్ రవికుమార్, ఎలక్షన్ డ్యూటీ డిప్యూటీ తాసిల్దార్ ధనుంజయ. తనకు పనిఒత్తిడి తగ్గించాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా.. పని ఒత్తిడితగ్గించలేదని అందువల్లనే తను చనిపోతున్నానని.. సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కర్నూల్ తాలూకా పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మాస్కోలో టీచర్లులేని స్కూలు

### స్కూలు-21ను సందర్శించి ప్రతినిధులతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్

### తోటి విద్యార్థులే అధ్యాపకులు, ప్రాజెక్టు ఆధారిత పాఠాలు



శనివారం మాస్కోలో స్కూల్ 21ని సందర్శించి అక్కడి ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 6, ప్రభాతవార్త ప్రతినిధి:** మాస్కోలో స్బేర్ ఆధ్వర్యంలో నడుస్తున్న విభిన్నమైన పాఠశాల స్కూల్ 21ను ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలమంత్రి నారా లోకేష్ సందర్శించారు. సాంప్రదాయ విద్యావిధానానికి భిన్నంగా అక్కడ అనుసరిస్తున్న విధానాలను నిర్వాహకులు, విద్యార్థుల ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్కూల్ 21 అనేది రష్యాలో స్బేర్‌బ్యాంక్ ప్రారంభించిన ఉచిత ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విద్యా కార్యక్రమం. ఇక్కడ విద్యార్థుల నుంచి ఎటువంటి ట్యూషన్ ఫీజు వసూలు చేయరు. ఇది ఇంటర్నేషనల్ 42 నెట్‌వర్క్‌లో సభ్యత్వం కలిగి, స్వతంత్రంగా పనిచేస్తుంది, ఫ్రెంచ్ కోడింగ్ స్కూల్ అయిన ఎకోల్ 42 రూపొందించిన వినూత్నమైన "భవిష్యత్ పాఠశాల" విద్యా పద్ధతులను అనుసరిస్తుంది.

**స్కూల్ 21 ప్రధాన ప్రత్యేకతలు..**

**సాంప్రదాయ విద్యావిధానం లేదు**

ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక ఉపన్యాసాలు, సంప్రదాయ గ్రేడ్‌లు ఉండవు. సహచర విద్యార్థుల ద్వారా అభ్యసనం, విద్యార్థులు పూర్తిగా గేమిఫైడ్, ప్రాజెక్ట్‌ఆధారిత సహకార పనుల ద్వారా నేర్చుకుంటారు, ఒకరి కోడ్‌ను మరొకరు మూల్యాంకనం చేసుకుంటారు.

స్బేర్‌బ్యాంక్ ఈ ప్రోగ్రామ్‌కు పూర్తిగా నిధులు సమకూరుస్తుంది, దీనివల్ల ఎంపికైన అభ్యర్థులు ఎటువంటి ఖర్చులేకుండా ఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చదవడానికి అవకాశం కలుగు >>2

### ఎపి పర్యాటకానికి మరో

# అరుదైన గౌరవం

**విజయవాడ, జూన్ 6, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి పర్యాటక రంగానికి మరో జాతీయ స్థాయి అరుదైన గౌరవం లభించింది. ఇండియా టుడే నేషనల్ సర్వేలో దేశంలోనే నంబర్1 రూట్‌గా విశాఖ అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం నిలిచింది. ఇండియన్ రూట్స్ ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో విస్టాడోమ్ రైలు అగ్రస్థానంలో ఉంది రాష్ట్రంలో పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవడంతో పాటు కొత్త అవకాశాలు సృష్టించుకోవడం, అభివృద్ధి వైపు అడుగులు వేయడమనే విధానాన్ని అనుసరిస్తోంది.

ఎపికి సహజంగా ఉన్న అనుకూల తల్ని ఆదాయ వనరులుగా మార్చుకోవటంపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే పెట్టుబడుల ఆకర్షణ, నూతన ప్రాంతాలకు ప్రాచుర్యం, మౌలిక వసతులపై దృష్టి సారించి అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. దీంతో ఇవి మంచి సత్ఫలితాల నిస్తున్నాయి. ఈ మేరకు జూన్ 15న గోవాలో ప్రతిష్టాత్మక 'ఇండియా టుడే టూరిజం సమ్మిట్ అండ్ అవార్డ్స 2026' ప్రదానోత్సవం జరుగనుంది.



శనివారం కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, ఎమ్మెల్యే ఉగ్ర నర్సింహారెడ్డి తదితరులు

# దేశ చిత్రపటంలో ఎపికి ప్రత్యేక గుర్తింపు

### ఐటి, టెక్నాలజీతో పాటు సీఫుడ్స్ ప్రాసెసింగ్‌లోను రాష్ట్రం టాప్

### కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవలకు మరింత సహకారం

### కనిగిరిలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్

**కనిగిరి, జూన్ 6, ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు దేశ ప్రజలందరికి ఆదర్శప్రాయంగా నిలవాలని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ అన్నారు. మార్కాపురం జిల్లా కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శనివారం ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన >>2

# ఉపాధి అవకాశాల 'సీమ'



శనివారం కడపలో 'రైజింగ్ రాయలసీమ' సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్

### పెట్టుబడులకు కేంద్రంగా రాయలసీమ అభివృద్ధి

### మౌలిక సదుపాయాలు పుష్కలం

### కాలుష్యరహిత వ్యవసాయంలో సీమ రైతుకు గుర్తింపు: మంత్రి టిజి భరత్

**కడప, కార్పొరేషన్, జూన్ 6 ప్రభాతవార్త:** రాయలసీమను కరువు, వలసల ప్రాంతంగా కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష ్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్ స్పష్టం చేశారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాయలసీమ ప్రాంత అభ్యున్నతి, పారిశ్రామిక వికాసం, పెట్టుబడుల ప్రోత్సాహం, నవకల్పనలపై చర్చించేందుకు సమర్థ్ రీసెర్చ్ అండ్ రిసర్జెన్స్ ఆధ్వర్యంలో 'రైజింగ్ రాయలసీమ ఇండస్ట్రీ, ఇన్నోవేషన్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్" సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖమంత్రి టిజి భరత్, ప్రభుత్వవిప్, >>2

# కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

### కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్, నిరసనలతో దద్దరిల్లిన జంతర్ మంతర్

2లో



శనివారం రాజ్యసభ ఎంపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న లింగమనేని రమేష్

# రాజ్యసభకు లింగమనేని నామినేషన్ దాఖలు

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ ఎంపి అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు శనివారం అమరావతి అసెంబ్లీ భవనంలో లింగమనేని రమేష్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి అందచేశారు. ఈ నామినేషన్ దాఖలు ప్రక్రియలో కూటమి పార్టీ నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు.

# ఆర్టీసీ బస్సులో మంటలు

>> ప్రాణనష్టం తప్పి, అందరూ సురక్షితంగా బయటపడ్డారు. బస్సు గొల్లపూడి ప్రాంతానికి చేరుకోగానే, ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడు. వెంటనే అలర్ట్ అయిన ఆయన బస్సును రోడ్డు పక్కన ఆపి ప్రయాణికులను కిందకు దిగిపోవాల్సిందిగా గట్టిగా కేకలు వేశాడు. బస్సు తలుపు వైపు మంటలు వ్యాపించే ప్రమాదం ఉండటంతో తీవ్ర ఆందోళనలో ఉన్న ప్రయాణికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సు కిటికీల గుండా బయటకు దూకేశారు. ఒకరికొకరు సాయం చేసుకుంటూ అందరూ క్షణాల వ్యవధిలో బస్సు నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని బస్సులో చెలరేగిన మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై ఆర్టీసీ, పోలీస్ అధికారులు స్పందిస్తూ... కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. బస్సులో మంటలు చెలరేగడానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏదైనా మెకానికల్ ఫెయిల్యూర్ లేదా షార్ట్ సర్క్యూట్ లాంటి సాంకేతిక సమస్యల వల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# 'నైరుతి' వచ్చేసింది

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ రాయలసీమ జిల్లాల్లోని కొన్నిప్రాంతాలు తాకినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. రానున్న 23 రోజులు రాష్ట్రంలో మరింత విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో కురిసే మొత్తం వర్షపాతం సాధారణ స్థాయి కంటే కొంత తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అయితే, స్థానిక వాతావరణ మార్పుల వల్ల కురిసే వర్షాలు ఈ లోటును కొంత మేరకు భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. కాకపోతే, ఈసారి రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అంటే కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసి, మరికొన్ని రోజుల పాటు వాతావరణం పొడిగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. రైతులు ఈ మార్పులను గమనించి, తదనుగుణంగా తమ పంట ప్రణాళికలను సిద్ధం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నైరుతి పవనాల తరుణం జూన్ నుంచి సెప్టెంబరు వరకు గమనిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని చాలా జిల్లాల్లో ముఖ్యంగా పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కర్నూలు, నంద్యాల, మార్కాపురం, అనంత పురము, వైఎస్ఆర్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు**

శనివారం కృష్ణా జిల్లా పెదపారుపూడి, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 43.9, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 43.4, అనకాపల్లి జిల్లా మాకవరపాలెం, నెల్లూరు జిల్లా గూడూరు, తిరుపతి జిల్లా ఓజిలిలో 43.2, మన్యం జిల్లా నవగాంలో 43.1, బాపట్ల జిల్లా కారంచేడు, విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలసలో 43డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డు అయిందని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# ఎఐతో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలు గుర్తించేలా మొబైల్ యాప్

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఎఐతో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలు గుర్తించేలా మొబైల్ యాప్ తయారు చేసినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. మొబైల్ ద్వారా శిశువు బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలత నమోదు చేయవచ్చని ఆయన అన్నారు. ఆశా యాప్‌తో 'శిశు మాపన్' యాప్ అనుసంధానం చెయ్యాలని సూచించారు. మంగళగిరి నియోజకవర్గంలోని ఆశాలు, ఎఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఫలితాలు చూసి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు అమలు చెయ్యాలని సూచించారు.

# అహర్నిశల శ్రమకు గుర్తింపు

## రాజ్యసభకు చింతకాయల విజయ్

**విశాఖపట్నం, జూన్ 6, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన ముగ్గురు అభ్యర్థుల్లో చింతకాయల విజయ్‌కు చోటు దక్కడం పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలకు కారణమైంది. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా నిస్వార్థంగా, అంకితభావంతో పనిచేస్తూ వచ్చిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్‌కు రాజ్యసభ సభ్యత్వం రూపంలో సముచిత గుర్తింపు లభించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయాల్లో పదవుల కోసంకాకుండా పార్టీ బలోపేతం కోసం పనిచేసేనాయకులు అరుదుగాకనిపించే ఈరోజుల్లో, చింతకాయల విజయ్ తన కృషి, విధేయత, క్రమశిక్షణతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ నుంచి సంస్థాగత వ్యవహారాల వరకు నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ విశ్వాసాన్ని సంపాదించారు. ముఖ్యంగా పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలోనూ వెనక్కి తగ్గకుండా, కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ జెండాను భుజాన వేసుకుని పనిచేసిన నాయకుడిగా విజయ్ గుర్తింపు పొందారు. అందుకే రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో ఆయన పేరు చోటు చేసుకోవడం సహజ పరిణామంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 50శాతం పచ్చదనం మన లక్ష్యం

>> నిర్వహించిన డిఎస్సీ 2025పై బురద జల్లారని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలాదుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డిఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని అసహనం వ్యక్తం చేసారు.

**డిఎస్సీపై ఆరోపణలకు ఆధారాలతో సహా కౌంటర్ ఇచ్చాం**

డిఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శృతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టిడిపికి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టిడిపికి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశం చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టిడిపి గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేష్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేష్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టిడిపికి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టిడిపి శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు.

# మాస్కోలో టీచర్లులేని స్కూలు

>> తుంది. క్యాంపస్‌లు నిరంతరం పనిచేస్తాయి, దీనివల్ల విద్యార్థులు తమ సొంత అధ్యయన వేగాన్ని, షెడ్యూల్‌లను నిర్వహించుకోవచ్చు. స్కూల్ 21లో ప్రవేశం కోసం ఎంపిక ప్రక్రియ వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. గత విద్యా ప్రతిభ, డిగ్రీలు లేదా ముందస్తు కోడింగ్ పరిజ్ఞానాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోరు. సాధారణ నమోదుకు ముందు దరఖాస్తుదారులు ఆన్‌లైన్ కాగ్నిటివ్ పరీక్షను పూర్తి చేయాలి. దాని తర్వాత, సమస్య పరిష్కార నైపుణ్యాలను, అనుకూలతలను అంచనా వేయడానికి 'పిసిన్' (స్విమ్మింగ్ పూల్) అని పిలువబడే, అనేక వారాల పాటు జరిగే ఒక ఇంటెన్సివ్ ఆన్‌సైట్ ఎంపిక శిబిరంలో పాల్గొనాలి. అక్కడ వారు ఇచ్చిన టాస్క్ లపై ప్రత్యక్షంగా ప్రదర్శించిన తెలివితేటలను బట్టి ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

**స్బేర్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్..**

మాస్కోలోని స్బేర్ సిటీని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. స్బేర్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ ఆల్బర్ట్ ఎఫిమోవ్ స్బేర్ సిటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఎవ్జెనియ్ చులానోవ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇలియా పుల్నర్ మంత్రి లోకేష్ బృందానికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వ్యాధినిర్ధారణ, ఇతర ఆవిష్కరణలతో కూడిన స్బేర్ బ్యాంక్ ఏటిఎంను పరిశీలించి, పనితీరును అడిగి తెలుసుకున్నారు. తర్వాత స్బేర్ సిటీ ప్రతినిధులు అక్కడి ఆర్‌డి, క్వాంటం టెక్నాలజీ సెంటర్, ఎఐ ఆధారిత సేవలు, డిజిటల్ హెల్త్ కేర్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్, డిజిటల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అత్యంత విశ్వసనీయమైన ఎంటర్‌ప్రైజ్ హార్డ్‌వేర్ అప్‌టైమ్‌ను నిర్ధారించడం, అంతర్గత సాఫ్ట్‌వేర్ ఎకోసిస్టమ్‌లను అమలు చేయడం, స్థానికీకరించిన కార్పోరేట్ టెక్ ఆధునీకరణను ముందుకు నడపడంపై తాము దృష్టిసారించినట్లు వారు తెలిపారు. ఆటోమేటెడ్ మౌలిక సదుపాయాలు, స్మార్ట్ పరికరాల నెట్‌వర్క్‌లు, విస్తృతమైన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ గ్రిడ్‌ల అధికలోడ్ డిమాండ్‌లను నిర్వహించగల వినూత్న విద్యుత్ వ్యవస్థలను అమలు చేయడం తమ లక్ష్యమని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిష్కృతమైన స్బేర్ సిటీ భవిష్యత్ టెక్నాలజీకి వారధిగా నిలుస్తుందని మంత్రి లోకేష్ కొనియాడారు.

# ఉపాధి అవకాశాల 'సీమ'

>> నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, సమర్థ కన్వీనర్ శ్రీధర్ హాజరయ్యారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్‌లు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ప్రాంతంగా అవతరించేందుకు అవసరమైన అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. నీటి భద్రత, ఇంధన భద్రత, ఆర్థిక వనరులు, పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై ఆయన చర్చిస్తూ... ప్రతి వ్యక్తికి తన ప్రాంతం పట్ల అభిమానం ఉండాలని, రాయలసీమ అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, మేధావులు, ప్రజలు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా "రైజింగ్ రాయలసీమ వంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలకు నాయకత్వం వహించే మేధోసంపత్తి, యువశక్తి రాయలసీమకు ఉన్న గొప్ప సంపద అని మంత్రి అన్నారు. కాలుష్యరహిత వ్యవసాయం, నాణ్యమైన ఉద్యాన పంటల ఉత్పత్తిలో రాయలసీమ రైతులు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందారని కొనియాడారు. అలాగే ఈ ప్రాంత చారిత్రక, సాంస్కృతిక వైభవం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ చారిత్రక, ఆధ్యాత్మిక, సహజ వనరులతో సమృద్ధిగా ఉన్న కడప జిల్లా రాయలసీమ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారే సామర్థ్యం కలిగి ఉందని అన్నారు. కడప జిల్లా చరిత్ర, ఆధ్యాత్మిక వారసత్వం, సహజ వనరులు, వ్యవసాయ సంపదను ప్రస్తావించిన మాధవ్.. దేవుని కడప, పుష్పగిరి పీఠం, గండి, అత్తిరాల, నందలూరు వంటి క్షేత్రాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. అలాగే గండికోట, సిద్ధవటం కోట వంటి చారిత్రక కట్టడాలు జిల్లాకు వైభవాన్ని చాటుతున్నాయని అన్నారు. జిల్లాలో యురేనియం, మంగంపేట బైరైటీస్, సున్నపురాయి, గ్రానైట్ వంటి ఖనిజ సంపద పుష్కలంగా ఉందని, ఇవి పారిశ్రామికాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని చెప్పారు. అరటి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, పసుపు, మిర్చి, వేరుశనగ వంటి పంటల ఆధారంగా ఆహార శుద్ధి పరిశ్రమలు, ఫుడ్ పార్కులు, కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో దేవుని కడప, గండికోట, సిద్ధవటం, పుష్పగిరి ప్రాంతాలను కలిపి ప్రత్యేక ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పర్యాటక రంగంలో భారీగా ఉపాధిఅవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి కడప అనుకూల ప్రాంతమని, పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. అలాగే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో యువతను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల ద్వారా రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాల అభి వృద్ధికి కట్టుబడి ఉందని మాధవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బి. జయరామిరెడ్డి, డాక్టర్ ఎస్. సిద్ది రాజు, డాక్టర్ వై. కేశవ రెడ్డి, డాక్టర్ బులుసు శ్రీనివాస్, డాక్టర్ బులుసు శ్రీనివాస్, డాక్టర్ ఎస్. లింగమూరి పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

07-06-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
సప్తమి రా. 3.23
ధనిష్ఠ ఉ. 7.54
వర్జ్యం : మ. 3.28 -సా. 5.08
దు.సా. 4.49-సా. 5.41
శుభసమయం : ఉ. 7.30-8.00
రాహుకాలం - సా. 4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులకు మీ వంతు సహాయం అందిస్తారు. చిన్న పనికీ పెద్దపనికీ ఒకే విధంగా శ్రమ చేయవలసి ఉంటుంది.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కొత్త ఒప్పందాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం జాగ్రత్త.

**మిథునం:** జీవిత భాగస్వామితో విభేదాలు రాకుండా తగు జాగ్రత్తలు పాటించడం చెప్పదగినది. నూతన విద్యావకాశాలు.

**కర్కాటకం:** ఆరోగ్య సమస్యలు తీరుస్తాయి. అప్రయత్నంగా అవకాశాలు లాభిస్తాయి. స్థిరాస్థి వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి.

**సింహం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. కష్టానికి ఫలితం దక్కుతుంది. విద్యావకాశాలు లాభిస్తాయి.

**కన్య :** సహోదర, సహోదరీ వర్గంతో మాట పట్టింపులు రాకుండా జాగ్రత్తలు పాటించండి. ఋణాలు తీరుస్తారు.

**తుల :** నిష్కారణ వైరాలు పొంచి ఉన్నాయి. జాగ్రత్త వహించండి. ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** పనులలో తొందరపాటు వద్దు. రాజకీయరంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** గతంలో మీకు సహాయం చేసిన వారికి ఇప్పుడు మీకు సహాయం చేయవలసి వస్తుంది. విద్యావకాశాలు పొందుతారు.

**మకరం:** ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఓర్పు, నేర్పులలో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** వివాదాస్పద అంశాలు, పుకార్లు ప్రాధాన్యతను సంతరించుకొనకుండా జాగ్రత్తలు వహించండి. వ్యాపారంఅభివృద్ధి.

**మీనం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ధర్మేంద్రను తొలగించండి

## కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్

## నిరసనలతో దద్దరిల్లిన జంతర్ మంతర్

**న్యూఢిల్లీ, జూన్ 6:** జాతీయ స్థాయి పోటీపరీక్షల్లో వెల్లువెత్తిన అక్రమాలు, అవినీతి, లీకేజిలను కట్టడిచేయాలని, నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్‌రాజీనామాచేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కొత్తగా ఆవిర్భవించిన కాక్రోజ్ జనతాపార్టీ సీజేపీకి అనూహ్యమద్దతు లభించింది. దేశ రాజధానిలోని జంతర్ మంతర్‌వద్ద శనివారం జరిగిన ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలనుంచి భారీ ఎత్తున యువత తరలివచ్చారు. నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు కేంద్రానిదే బాధ్యత అని, వెంటనే ఆశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను పదవినుంచి తప్పించాలని డిమాండ్‌చేస్తూ జైభీమ్ అంటూ జంతర్‌మంతర్‌వద్ద నినాదాలతో హోరెత్తించారు. విద్యార్థులు, యువత డిమాండ్లను పరిష్కరించాల్సిందిపోయి తమ సంస్థ సోషల్‌మీడియా కార్యకలాపాలపై కేంద్రం నిఘా పెట్టడంపై అభిజీత్ దిప్కే మండిపడ్డారు. సోషల్‌మీడియాసాయంతో మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ఙు రాజీనామాచేయాలని డిమాండ్‌చేస్తూ ఉద్యమం నెలరోజుల నుంచి చేస్తున్నామని, చర్యలు తీసుకోడానికి బదులు మా సోషల్‌మీడియా ఖాతాలను హ్యాక్‌చేయడం, మాపోస్టులు డిలీట్‌చేయించడంవంటి వాటిపై శ్రద్ధపెడుతున్నారని ఆరోపించారు.

మా సోషల్‌మీడియా పోస్టులు డిలీట్ చేయగలరేమోకానీ క్షేత్రస్థాయి పోరాటం కట్టడిచేయలేరని కేంద్రాన్ని దిప్కే హెచ్చరించారు. శనివారం జరిగిన తొలిప్రదర్శన విజయవంతం కావడంతో కాక్రోచ్‌జనతాపార్టీ తన తదుపరి పోరాటానికి ప్రణాళిక సిద్ధంచేసింది. జూన్ 23న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ఎత్తున మరో నిరసన ప్రదర్శన, సభను నిర్వహిస్తామని ప్రకటించింది. ఇదిలా ఉంటే సీజెపి నిరసనకు లడక్ ప్రజాహక్కుల నాయకుడు సోనమ్ వాంగ్‌ఛుక్‌కూడా మద్దతు ప్రకటించారు. మంత్రి ప్రధాన్ తన రాజీనామాచేయనిపక్షంలో తాను కూడా నేరుగా నిరసనలో భాగస్వామినవుతానని అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిలదీయడమే నిరసన ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.



శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజలనుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

# బ్రహ్మనాయుడుకు రిమాండ్

>> ఇద్దరు పట్టుబడడం తెలిసిందే.

ఈ కేసులో అసలు నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడు అజ్ఞాతంలో వెళ్లి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దీనిని డిస్మిస్ చేయడం విదితమే. దీని తరువాత ఆయన కోసం సైబరాబాద్ పోలీసులు ఎపిలోని పలుచోట్ల గాలించి చివరకు తమిళనాడు కాంచీపురంలో తలదాచుకున్నచోట శుక్రవారం నాడు అరెస్టు చేశారు. అనంతరం అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారంట్‌పై శనివారం ఉదయం హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. అనంతరం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆయనను అధికారులు మూడు గంటలకు పైగా విచారించారు. గండిపేట్ మండలంలోని సర్వే నంబర్ 18లో గల పదెకరాల సర్కారు భూమిని కాజేసేందుకు జరిగిన కుట్రలో బ్రహ్మనాయుడుతో పాటు వున్న ముఖ్యుల గురించి ఆయనను ప్రశ్నించారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో కడపతో పాటు రాయలసీమకు చెందిన కొందరు వైసిపి నాయకుల పాత్ర వుందని అనుమానిస్తున్న పోలీసులు దీనిపైనా బ్రహ్మనాయుడును ప్రశ్నించారు. బ్రహ్మనాయుడును విచారించిన తరువాత నేరుగా ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులో ఈ కేసును విచారిస్తున్న నార్సింగి పోలీసులు సాయంత్రం ఐదు గంటల సమయంలో హాజరు పరిచారు. అనంతరం ఈ కేసును విచారించిన న్యాయమూర్తి బ్రహ్మనాయుడుకు రెండు వారాల రిమాండు విధించారు. దీని తరువాత ఆయనను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

కాగా గండిపేట్‌లో సర్కారు భూమి కాజేసేందుకు జరిగిన కుట్రలో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు సూత్రధారిగా పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండు రిపోర్టులో వెల్లడించారు. తనకు తెలిసిన న్యాయవాదులు, రియల్టర్ల సహాయంతో బ్రహ్మనాయుడు తప్పుడు పత్రాలతో పాటు నకిలీ జిఒలు సృష్టించారని, ఇందుకోసం తన అనుచరులకు ఎనిమిది కోట్ల రూపాయలను చెల్లించారని పోలీసులు తెలిపారు. అనంతరం ఐదు వందల కోట్ల రూపాయలకు పైగా విలువచేసే ఈ భూమి తనదంటూ బోర్డులు పాతేందుకు యత్నించి, ఏకంగా మరో వ్యక్తికి అమ్మేందుకు సిద్ధమయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరికొందరు అరెస్టు కావాల్సి వుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం బ్రహ్మనాయుడును కస్టడీకి కోరేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఆయనను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పో లీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని తెలిపింది,

# ఎపికి ప్రత్యేక గుర్తింపు

>> బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. కనిగిరి ప్రజలంతా ఐక్యంగా ముందుకొచ్చి అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అంబేద్కర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యాహక్కులు, రాజ్యాంగ పరిరక్షణకు జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. దేశంలో అనేక రాజకీయ పార్టీలు అంబేద్కర్ పేరును వినియోగిస్తున్నప్పటికీ, ఆయన ఆశయాలను పూర్తి స్థాయిలో ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో దళితులకు తగిన న్యాయం జరగలేదని, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఏ వర్గానికి అన్యాయం జరగకుండా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, దేశ చిత్రపటంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సన్నిహిత మిత్రుడని గుర్తు చేశారు. ఐటీ, టెక్నాలజీ రంగాలతో పాటు మెగా సీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖల నుంచి అభివృద్ధి కార్యక్రమాలను కనిగిరి ప్రాంతానికి తీసుకురావడంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని కేంద్ర మంత్రి ప్రశంసించారు. కనిగిరి ప్రాంతానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కృషి వల్ల కనిగిరి ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలం ప్రతి ఒక్కరి నరనరాల్లో ఉండాలని అన్నారు. అంబేద్కర్ విగ్రహాలు సాధారణంగా పట్టణాల శివార్లలో ఉంటాయని, అయితే కనిగిరి పట్టణ నడిబొడ్డున విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో అన్ని వర్గాల ప్రజలు కలిసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైసిపి పాలనలో దళితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ విద్య ద్వారానే అసమానతలను తొలగించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, కార్పొరేట్ స్థాయి విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటు ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ ప్రభావిత, వెనుకబడిన ప్రాంతమని పేర్కొన్నారు. నీటి కొరత కారణంగా ఉద్యాన పంటల సాగు ఎక్కువగా జరుగుతోందన్నారు. కనిగిరి అభివృద్ధికి ఫుడ్ ప్రాసెసింగ్ మెగా క్లస్టర్, కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవల విస్తరణ అత్యవసరమని కేంద్ర మంత్రిని కోరారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. సభాధ్యక్షుడిగా వ్యవహరించిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని, యువత రాజ్యాంగ విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలను ఇతర తదితర ప్రముఖులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, అంబేద్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి కార్యాలయం నుంచి పామూరు బస్టాండ్ మీదుగా ఒంగోలు బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జైభీమ్ నినాదాలతో కనిగిరి పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బీఎన్ విజయ్ కుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మీ, గూడూరి ఎరిక్షన్‌బాబు, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, జిల్లా కలెక్టర్ విజయ సునీత, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకే తొలి ప్రాధాన్యత

## మార్కాపురం జిల్లా పోలీసులకు హోం మంత్రి అనిత ఆదేశం

**మార్కాపురం జిల్లా, జూన్ 6 (ప్రభాతవార్త):** మహిళలు, బాలికల భద్రత మరియు రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పోలీసు అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా పోలీసు అధికారులతో కనిగిరిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా భౌగోళిక పరిస్థితులు, పోలీసు పరిపాలనా విభజన, శాంతిభద్రతలు, నేర నియంత్రణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించిన మంత్రి, మహిళలపై జరుగుతున్న నేరాల్లో 17 శాతం తగ్గుదల సాధించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణలో సమర్థవంతమైన చర్యలు చేపట్టిన జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు పనితీరును అభినందించారు. మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు చేపట్టాలని, పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి న్యాయం అందించాలని సూచించారు. ఫింగర్ ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర నియంత్రణలో మరింత విస్తృతంగా వినియోగించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని, సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేసి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రత, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

# యుపిక్స్ కేసులో ఆఖరి చార్జిషీటు దాఖలు

## మొత్తం 22మందిపై కేసు నమోదు

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** చలనచిత్రాల్లో యానిమేషన్ పేరుతో విజయవాడ కేంద్రంగా జరిగిన మోసం కేసులో పోలీసులు 22 మంది నిందితులతో ఆఖరి ఛార్జిషీట్ దాఖలు చేసారు. విజయవాడలోని సత్య నారాయణపురంలో 2014లో యుపిక్స్ పేరుతో యాని మేషన్ కంపెనీని కిరణ్ (ఏ1) ఏర్పాటు చేశాడు. హాలీవుడ్ సినిమాలకు గ్రాఫిక్స్ చేస్తున్నామని నమ్మించారు. ఏడా దిలోనే 100 నుంచి 125 శాతం రాబడులు వస్తాయని అందరినీ నమ్మించాడు. సంస్థలో మిట్టపల్లి రాజేంద్ర బాబు, కొత్తూరి వేణుగోపాలరావు, మిట్టపల్లి రాజీవ్ కృష్ణ కలసి ఎక్కువ వడ్డీ ఇస్తామని డిపాజిటర్లకు ఆశచూపిం చారు. ఇలా పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారు. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల చెందిన 350 మంది యుపిక్స్‌లో పెట్టుబడులు పెట్టారు. రూ. లక్ష నుంచి రూ.కోట్ల వరకూ పెట్టారు. పెద్ద మొత్తంలో వచ్చిన సొమ్ము ను పంచుకున్న తర్వాత నిర్వాహకులు చెల్లింపులు చేయ లేక చేతులెత్తేశారు. బాధితులు సగటున రూ. 10 లక్షల నుంచి రూ.10కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు.ఆ మొత్తాలకు యూపిక్స్ గ్రూప్ పేరుతో ఒప్పందాలు కూడా రాసిచ్చాడు. మూడు జిల్లాల పరిధిలో దాదాపు రూ. 450 కోట్ల మేర వసూలు చేశాడు.

మీ సొమ్మును యానిమేషన్, థీమ్ పార్క్ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెడుతున్నట్లు దీని వల్ల మెచ్యూరిటీ నాటికి రెండు, మూడు రెట్లు లాభాలు వస్తాయని ఆశ చూపిం చారు. కొన్ని నెలల పాటు రం ఛనుగా సొమ్మును డిపాజిటర్లకు చెల్లించాడు. ఆతర్వాత నుంచి చెల్లింపులు ఆగిపోయాయి. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రధాన నిందితుడు సాకులు చెప్పి కాలం వెల్ల బుచ్చాడు. చివరకు కార్యాలయానికి తాళాలు వేసి అజ్ఞా తంలోకి వెళ్లాడు. వ్యాపారులు, సామాన్యులు, ఉద్యోగులు పెట్టుబడి పెట్టి మోసపోయిన వారి జాబితాలో ఉన్నారు. ఛార్జిషీట్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి దర్యాప్తు అధి. కారి అయిన నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్ ఎంఎస్‌జే కోర్టు లో దాఖలు చేశారు. విజయవాడ నగరంలోని సత్యనారా యణపురం స్టేషన్‌లో బీఎన్ఎస్ 318 (4), 316 (2) సెక్షన్ల కింద శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యా దుల మేరకు కేసులు నమోదు అయ్యాయి.

గత ఏడాది ఏప్రిల్‌లో నమోదైన ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముగించి చివరి ఛార్జిషీట్‌ను ఇన్‌ఛార్జి న్యాయస్థానమైన ఏసీబీ కోర్టులో దాఖలు చేసినట్లు విచారణ బృందం స్పష్టం చేసింది.ఈ కేసులో మొత్తం మొత్తం 22 మందిని నిం దితులుగా చేర్చారు. 92 మందిని సాక్షులుగా చూపారు. అధిక వడ్డీల ఆశ చూపి పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయలు కాజేసిన యుపిక్స్ కుంభకోణం కేసులో తుదిఛార్జ్ షీట్‌ను పోలీసులు దాఖలు చేశారు.

# సుప్రీం చీఫ్‌జస్టిస్‌కు లండన్‌లో అవమానం!

**న్యూఢిల్లీ, జూన్ 6:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు లండన్‌లో చేదు అనుభవం ఎదురైంది. బిర్క్‌బెక్ కాలేజీలో ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. జూన్ 4వ తేదీన ఈ ఘటన జరిగింది. అయితే భారతీయ హై కమిషన్ ఈ ఘటనను ఖండించింది. లండన్ కాలేజీలో ప్రసంగం చేస్తున్న సమయంలో జరిగిన క్వశ్చన్ అండ్ ఆన్సర్ సెషన్‌లో కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ లెక్చర్‌కు హాజరైన కొందరు చీఫ్ జస్టిస్‌ను ప్రశ్నలతో నిలదీశారు. భారత్‌లో భావప్రకటన స్వేచ్ఛ లేదని ఆరోపించారు. నిరుద్యోగులను బొద్దింకలతో పోల్చడాన్ని ప్రశ్నిస్తూ కామెంట్లు చేశారు. అయితే ఆ ప్రశ్నోత్తరాల ఈవెంట్‌ను నిర్వాహకులు తక్షణమే రద్దు చేశారు. ఇది టాపిక్‌లో లేని అంశమని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఇంటర్నేషనల్ లా అన్న అంశంపై ప్రసంగిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రేక్షకుల ప్రవర్తన అసభ్యకరంగా ఉన్నట్లు భారతీయ హై కమిషన్ తన స్టేట్మెంట్‌లో పేర్కొన్నది. మర్యాదపూర్వకంగా జరగాల్సిన ఈవెంట్‌లో ప్రేక్షకుల ప్రవర్తన ఆమోదయోగ్యంగా ఉందని, అసమర్థనీయంగా ఉన్నట్లు తన ప్రకటనలో హై కమిషన్ చెప్పింది. భిన్నాభిప్రాయాలను చాలా హుందాగా, మర్యాద పూర్వకంగా వ్యక్తం చేయాల్సి ఉంటుందని హై కమిషన్ అభిప్రాయపడింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగాన్ని అడ్డుకున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## రేపు చేప ప్రసాదం పంపిణి

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 6, ప్రభాతవార్త:** ప్రతియేటా మాదిరిగానే మృగశిర కార్తెను పురస్కరిం చుకుని బత్తిని సోదరులు పంపిణి చేసే చేప ప్రసాదం ఈనెల 8వతేదిన రాత్రి 9గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణి ఏర్పాట్లను మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాజ్యసభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, మత్స్యశాఖ చైర్మన్ మెట్టుసాయికుమార్, వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృగశిర కార్తె సంద ర్భంగా చేప ప్రసాదం స్వీకరించేందుకు దేశ నలుమూలల నుంచి ఉబ్బసం వ్యాధిగ్రస్తులతో పాటు సహాయ కులు తరలిరావడం జరుగు తుందన్నారు. ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా ప్రభుత్వం తరపున ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో కలిసి పని చేయాలని ఆదేశించారు.



# శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్, ఏపి హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ కుటుంబంతో తిరుమలకు వచ్చారు. శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గృహనిర్మాణశాఖ గోడౌన్‌లో ఇనుము మాయం

## ప్రొద్దుటూరులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**ప్రొద్దుటూరు, జూన్ 6, ప్రభాతవార్త:** ప్రొద్దుటూరు గృహ నిర్మాణ శాఖ గోడౌన్‌లో నిల్వ ఉంచిన ఐరన్ గల్లంతైన ఘటన కలకలం రేపుతోంది. రాష్ట్ర గృహనిర్మాణ శాఖకు అందిన ఫిర్యాదుల మేరకు విజయవాడకు చెందిన విజి లెన్స్ అధికారులు శనివారం ప్రొద్దుటూరులోని హౌసింగ్ గోడౌన్లను తనిఖీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హ యాంలో జగనన్న ఇళ్ల పథకం కింద ప్రొద్దుటూరు నియో జకవర్గంలో సుమారు 24 వేల మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో దాదాపు 15 వేల మందికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మం జూరు చేసి, అవసరమైన ఐరన్, సిమెంట్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని సరఫరా చేసింది. అయితే గోడౌన్లలో నిల్వ ఉంచిన ఐరన్‌లో భారీ మొత్తంలో కొరత ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రహౌసింగ్ శాఖ ఆదేశాల మేరకు విజిలెన్స్ డిఇ చంద్రశేఖర్ రాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం, రాజంపేట ఇఇ మురళీకృష్ణ తనిఖీల్లో పాల్గొన్నారు. గోడౌన్లలోని నిల్వలు, రికార్డులను పరిశీలించిన అధికా రులు ప్రాథమిక వివరాలను సేకరించారు. ఈ సం దర్భంగా విజిలెన్స్ డిఇ చంద్రశేఖర్ రాజు మాటా ్లడుతూ గత ఏడాది ఆగస్టులో, సెప్టెంబరులో జిల్లా పీడీ తనిఖీ చేసిన సమయంలో గోడౌన్లలో ఐరన్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన తనిఖీల్లో ఐరన్ కనిపించలేదన్నారు. మొత్తం 270.88 టన్నుల ఐరన్ నిల్వ ఉండాల్సి ఉండగా కేవలం 2.25 టన్నులు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని, విజిలెన్స్ 268.63 టన్నుల ఐరన్ గల్లంతైనట్లు వెల్లడించారు. జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం మాట్లాడుతూ మార్కెట్ యార్డు పరిధిలోని రూరల్ హౌసింగ్ గోడౌన్‌లో సుమారు 268 టన్నుల ఐరన్ మాయమైనట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ వ్యవహా రంపై బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా, రూ.1.70 కోట్లకు పైగా విలువైన ఐరన్ మాయమైన ఘటనపై రాష్ట్ర హౌసింగ్ ఎండీ ప్రత్యేక విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ ఎస్ఈ కృష్ణయ్య ఆధ్వర్యంలో విచారణ బృందం ఏర్పాటైంది.

# ఉద్యోగుల సంక్షేమ నిధి రాష్ట్రస్థాయి కమిటీని వెంటనే నియమించాలి

## ఎపి ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్ డిమాండ్



కె.ఆర్.సూర్యనారాయణ

**విజయవాడ, జూన్ 6, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి (ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఫండ్)" స్టేట్ లెవెల్ కమిటీని వెంటనే ప్రభుత్వం నియమించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఎం.రమేష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర విభజన నాటి నుండి అనగా 2014 నుండి నేటి వరకు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సం క్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీని ప్రభుత్వాలు నియ మించలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విభజన నాటికి మూ లధనం (కార్పస్ ఫండ్)లో ఏపీకి రావాల్సిన 58శాతం వాటా వచ్చిందో లేదో, ఆ నాటికి మంజూరు చేయబడిన అప్పులు, వాటి చెల్లింపులు, నేటి స్థితి ఆ వివరాలేవీ నాటి నుండి నేటటి వరకు ప్రభుత్వం వెల్లడించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి రూల్స్ 1980 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులతో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీని ప్రతి క్యాలెండర్ సంవత్సరానికి నియమించాల్సి ఉందని, సదరు కమిటీ ద్వారా మాత్రమే ఫండ్ మేనేజ్‌మెంట్ జరగాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా మూ లధనంపై వడ్డీతో పాటు, ప్రభుత్వం ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంట్ మూలధనం ఖాతాకి జమచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మేనేజింగ్ కమిటీ నిబంధనల ప్రకారం ఉద్యోగుల పిల్లలు పెద్ద చదువుల నిమిత్తం, అనా రోగ్య పరిస్థితుల్లో రాష్ట్ర స్థాయిలో రూ.50 వేలు, జిల్లా స్థా యిలో రూ.5వేలు అర్హతలను బట్టి సదరు రాష్ట్ర కమిటీ ద్వారా మం జూరు కావాల్సి ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రాష్ట్ర విభజనకు ముందు 2013లో ఏర్పాటు చేసిన కమిటీ తరువాత నేటి వరకు కమిటీ ఏర్పాటు చేయలేదని, సమావేశం నిర్వహించలేదని పేర్కొ న్నారు. సదరు ఫండ్ మేనేజ్‌మెంట్ ఎవరు నిర్వహి స్తున్నారో, ఎలా నిర్వహిస్తున్నారో, అప్పులు ఏమి మం జూరు చేశారో, బాకీలు ఎంత వసూలు చేశారో తదితర విషయాలేవీ బహిర్గతం కాలేదు. ఇది ఉద్యోగుల సొమ్ము. ఏటా ఉద్యోగుల జీతం లోంచి చందాలు వసూలు చేస్తు న్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ఏపిఎన్జీవోస్ అసోసియేషన్, ఏపి జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపి పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్, ఏపి వెహికల్స్ డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్, ఏపి స్టేట్ టీచర్స్ యూనియన్ లాంటి కొన్ని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం విశ్రాంత గృహాలు కట్టుకోవడానికి అంటూ ఉద్యోగుల సొమ్ములో నుంచి 6శాతం వడ్డీతో 5ఏళ్ల కాల వ్యవధిలో తిరిగి చెల్లించే షరతు మీద మంజూరు చేసిన మొత్తం సదరు సంఘాలు నేటికీ చెల్లించలేదని, చెల్లించకపోగా, ఉద్యోగుల జీతాల్లో నుంచి మినహాయించుకోమంటూ వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే, ఆ మేరకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉమ్మడి రాష్ట్రంలోని హైకోర్టు చెల్లదని కొట్టివేయడం జరి గిందన్నారు.

సదరు బాకీలను వారికి లోను మంజూరు చేసినప్పుడు చేసిన షరతులతో వారి నుంచే వసూలు చేయాలని తీర్పు ఇచ్చినా, నేటికి వసూలు చేయకపో వడంతో సదరు బాకీలు వడ్డీతో కలుపుకొని ఐదున్నర కోట్ల రూపాయలకు చేరాయని తెలిపారు. ఈ విషయాలన్నీ దాచిపెట్టి ప్రభుత్వం సదరు సంఘాలు, పుష్కరకాలంగా ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీ నియమించకుండా, సమావేశం నిర్వహించకుండా మౌనం వహిస్తూ సదరు సంక్షేమ నిధికి చట్టబద్ధమైన హక్కు దారులైన ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా విషయాల్లో ప్రభుత్వం అలసత్వం వహిస్తే ఉద్యోగుల సొమ్ముకు వాటిల్లిన నష్టాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే సదరు అధికారులను బాధ్యులుగా చేస్తూ న్యాయ పోరాటం చేయడానికి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సిద్ధంగా ఉందని హెచ్చ రించారు.

## దేవాన్ష్ ఘాట్‌పై మంత్రి లోకేష్ తీవ్ర అసహనం

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో 2027లోజరగనున్న గోదావరి పుష్కరాల కోసం ఏర్పాటు చేస్తున్న ఓ ఘాట్‌కు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మనవడు నారా దేవాన్ష్ పేరు పెట్టడం వివాస్పదంగా మారింది. ఈ విషయంపై ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రం అసహనం వ్యక్తం చేసారు. ఇది చాలా హాస్యాస్పదమని వ్యాఖ్యా నిస్తూ, ఆ పేరును వెంటనే తొలగించాలని అధి కారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇలాంటివి తగవని ఆయన స్పష్టం చేశారు. తూర్పుగో దావరి జిల్లా, సీతానగరం మండలం మునికూ డలిలో గోదావరి పుష్కరాల కోసం ఘాట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ఘాట్‌కు దేవాన్ష్ ఘాట్ అని పేరు పెట్టారు.ఈ ఘాట్ వద్ద దేవాన్ష్ పేరుతో ఉన్న బోర్డు ఫొటోలు, వీడి యోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రభుత్వ కార్యక్రమానికి సీఎం కుటుంబ సభ్యుడి పేరు పెట్టడంపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదం మంత్రి నారా లోకేశ్ దృష్టికివెళ్లడంతో ఆయన తక్షణమే స్పందిం చారు.ఏ ఘాట్‌కు కూడా దేవాన్ష్ పేరు పెట్ట కూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం: మంత్రి సవిత




**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవ సాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్. సవిత తెలిపారు. ప్రస్తుతం సేంద్రీయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, రైతులకు అధిక లాభాలు కూడా వస్తున్నాయని అన్నారు. తాడేపల్లిలోని ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్నిమంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. ప్రకృతి సాగుతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ దిగుబడి పెరగొచ్చునేమో కాని, వాటి వినియోగంతో క్యాన్సర్, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లోనూ చైతన్య పెరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ లో అధిక డిమాండ్ ఉందని, వాటి వల్ల రైతులకు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, రసాయన ఎరువులు, పురుగుల మందులులేని సాగును సీఎం చంద్రబాబు ప్రో త్సహిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ సాగు చేస్తున్న ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర నిర్వాహకులను, రైతులను మంత్రి సవిత అభినందించారు.

**సైకిల్ పై వచ్చి... చలివేంద్రం దగ్గర మజ్జిగ తాగి**

అంతకుముందు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అయిదు కిలో మీటర్ల దూరంలో ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి మంత్రి సవిత సైకిల్ పై వెళ్లారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. సేంద్రీయ పద్ధ తులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సేంద్రీయ ఎరువుల తయారీని కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ క్షేత్రంలో సాగవుతున్న ఉత్పత్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాలను కూడా మంత్రి సందర్శించారు. ఆయా ఉత్పత్తులు ధరలు అడిగి తెలుసుకుని, మంత్రి సవిత కూడా కొనుగోలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జామ పండను రుచి చూశారు. తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ నే వినియో గించారు. మార్గమధ్యంలో పాతూరు రోడ్డు వద్ద ఉన్న చలివేంద్రం వద్ద ఆగి, మజ్జిగ తాగి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు సామిరెడ్డి, కూటమి నాయకులు రాజశేఖర్, కొమ్మారెడ్డి కిరణ్ సహా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు: రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు

**విజయవాడ, జూన్6 ,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరాచకాలు, అవినీతి, విధ్వంసకర విధా నాలకు ప్రజలు ముగింపు పలికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చారిత్రక సందర్భానికి రెండేళ్లు పూర్తయ్యాయని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా పారదర్శక పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం అనే మూడు ముఖ్య లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పాల నలో రాష్ట్రం ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక రంగాల్లో వెనుకబడిందని, ప్రజాస్వామ్య విలువలు దెబ్బ తిన్నాయని విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పునర్నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక కీలక నిర్ణయాలు తీసు కుందని తెలిపారు.

మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి ప్రధాన బలం అని పేర్కొం టూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిం చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. "స్వర్ణాం ధ్రప్రదేశ్" లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

# పన్నెండేళ్ల తెలంగాణలో ప్రజల బతుకులు మారలే

## మీట్ ది ప్రెస్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 12 ఏండ్లల్లో రాష్ట్రంలో ప్రజల బ్రతు కులు ఏమీ మారలేదని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్య దర్శి జాన్ వెస్లీ అన్నారు. సమాజంలో దోపిడీ ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజంపై అధ్యయనం పెరుగుతుందన్నారు. మత విద్వేష రాజకీయాలు ఎల్లకాలం సాగవని, బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నా యన్నారు. శనివారం హైదరాబాద్‌లో ప్రెస్‌క్లబ్ హైద రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో జాన్‌వెస్లీ మాట్లాడారు. ప్రజల గుండె చప్పుడు కమ్యూనిజమనీ, సమాజంలో దోపిడీ ఉన్నంత కాలం అది ఉంటుందన్నారు. ప్రపంచంలో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగే కొద్దీ కమ్యూనిజాన్ని, మార్క్స్ రాసిన దాస్ కాపిటల్ గ్రంథాన్ని అధ్యయనం చేసేవారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. సీపీఐ(ఎం) గ్రామ స్థాయి నుంచి బలాన్ని పెంచుకునే పనిలో ఉందనీ, మూడు నెలల పాటు గ్రామాలు, బస్తీల్లో ప్రజలను కలిసే కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. మత, ప్రాంత, కుల, డబ్బు, ప్రలోబాలతో చట్టసభల్లో తమకు సీట్లు తగ్గిన మాట వాస్తవమేననీ, వాటి పట్ల ప్రజల్లో ఉన్న భ్రమలు క్రమంగా తొలగిపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ఆధారి తంగా ఏర్పడిన 12 ఏండ్ల తెలంగాణలో ప్రజల ఆకాం క్షలు నెరవేరలేదన్నారు.

# తిరుమల సమాచారం



## ముక్కోటి దేవతలూ విచ్చేయండి

### వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆరంభం

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని రుక్మిణి-సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణ మహోత్సవంతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.10గంటల నుండి 8.45 గంటల మధ్య కర్కాటక లగ్నంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయి ద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ గరుడ చిత్రంతో అలంకరించిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉద యం 4గంటల నుండి ధ్వజప్రతిష్ఠ, రక్షాబంధనం, భేరీతాడనం, నవసంధి, బలిహారణం తదితర శాస్త్రోక్త క్రతువులు నిర్వహించారు. అనంతరం తిరుమాడ వీధుల్లో నిర్వహించిన ఉత్సవంలో రుక్మిణి-సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. నాలుగు మాడవీధుల్లో జరిగిన ఈ మహోత్సవ ఊరేగింపు ద్వారా స్వామివారు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షి ంచి, అష్టాదశ గణా లు, ముక్కోటి దేవతలను ఉత్సవాలకు ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో భాగం గా శనివారం రాత్రి 7గంటల నుండి 9 గంటల వరకు వేణుగోపాల స్వామి పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. జూన్ 14న ఉదయం చక్ర స్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ముగుస్తాయి.

**9న స్వామివారి కల్యాణోత్సవం:** 750 రూపాయలు చెల్లించి గృహస్తులు (ఇద్దరు) ఈ సేవలో పాల్గొనవచ్చు. పాల్గొనే భక్తులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, అప్పం ప్రసాదంగా అందజేయనున్నారు.బ్రహ్మోత్సవాల అనంతరం జూన్ 15న మధ్యాహ్నం 1.30 గంటల నుండి 4గంటల వరకు స్వామివారికి పుష్పయాగం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ ప్రధాన అర్చకులు ( గోపాలాచార్యులు, కంకణ బట్టార్ మురళీకృష్ణ స్వామి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.చెంగల్‌రాయులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



## భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం

### టెండర్లు ఖరారు చేసిన టిటిడి

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** గణనీయంగా తరలివస్తున్న భక్తులతో తిరు మలలో ఆలయం వెలుపల ఐదారు కిలోమీటర్లు వరకు క్యూలైన్లు విస్తరిస్తు న్నాయి. వైకుంఠమ్ కంపార్టుమెంట్లు నిండిపోయి నారాయణగిరి ఉద్యానవనాల క్యూషెడ్లు పూర్తయితే సామాన్యభక్తులు గోగర్భమ్ డ్యామ్ వద్ద నుండి క్యూలైన్లు విస్తరిస్తాయి. అక్కడ ఎండకు,వానకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సామాన్యభక్తుల కోసం టిటిడి పలు నిర్ణయాలు తీసు కుంది. తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బాటగం గమ్మసర్కిల్ నుండి గోగర్భం సర్కిల్ వరకు శాశ్వత క్యూలైన్ ఏర్పాటుకు ఇప్ప టికే టిటిడి బోర్డు ప్రతిపాదించింది. ఇక్కడ క్యూలైన్ ఏర్పాటుతోపాటు స్టీల్ ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లు ఖరారు చేసింది. దీనికి 12కోట్ల రూపాయలు ఖర్చవుతుందని టిటిడి అధికారులు అం చనా వేశారు. సాంకేతిక అనుమతులు మంజూరు చేసింది. దీనికి అనుగుణంగా టెండర్లు ఆహ్వానించగా నాలుగుసంస్థలు ముందుకు వచ్చాయి.8,25కోట్ల రూ పాయలతో పనులు పూర్తి చేసేందుకు తక్కువ ధరకు టెండర్లు దాఖలు చేసింది.

## ప్రపంచంలో శాంతి నెలకొనాలి: మంత్రి భరత్

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఇరాన్‌తోబాటు ప్రపంచవ్యాప్తంగా నెల కొన్న సమస్యలు త్వరగా పరిష్కారమై ,ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఏడు కొండలస్వామిని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి టిజి భరత్ తెలిపారు. రాష్ట్రం,దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అన్ని విధాలా దేశం రాష్ట్రం ముందుకు నడవాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోందని అన్నారు. కుటుంబసభ్యులతో కలసి శనివారం ఉదయం తిరుమలకు వచ్చిన మంత్రి భరత్ విఐపి బ్రేక్‌లో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధి కారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రవాసాంధ్రుల దర్శనాల్లో మార్పులు

### 90రోజుల లోపు ఇష్టమొచ్చిన రోజు శ్రీవారి దర్శనం

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం విధానాల్లో ప్రవాసాంధ్రులైన భక్తులకు ఊరటకలిగించేలా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయం తీసుకుంది. ఇదివరకు ప్రవాసాంధ్రులు తమ సొంత ఊరికిగానీ, తమ సొంత ప్రాంతాలకు వస్తే అలాంటివాళ్ళు 30రోజుల్లోపు తమ ఇష్టమైన రోజు ఎప్పుడైనా తిరుమలకు వచ్చి సుపథం మార్గంద్వారా 300 రూ పాయలు టిక్కెట్ కొనుగోలుచేసి ఏడుకొండలస్వామిని దర్శించుకునే వెసలు బాటు అమలులో ఉంది. ఇప్పుడు పాస్ట్‌పోర్టుపై స్టాంప్ పడిన 90 రోజుల్లోపు ఎన్ఆర్ఐ కోటాలో దర్శనం చేసుకోవచ్చంటూ టిటిడి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకుగాను ప్రవాసాంధ్రులు అసలైన వీసా,పాస్‌పోర్టు చూపి జిరాక్స్ కాఫీలు సమర్పిస్తే స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు. అప్పటివిధానం వల్ల చాలావరకు 30రోజుల్లోనే తిరుమలకు రాలేని పరిస్థితులు ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రవా సాంధ్రుల నుండి వచ్చిన విజ్ఞప్తులతో రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిటిడి బోర్డు, అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ మేరకు 30రోజుల దర్శనాల గడువును ఏకంగా 90రోజులకు (మూడునెలలోపే)పెంచారు. దీనివల్ల ఎన్ఆర్ఐభక్తులు తిరుమలకు వస్తే ప్రశాంతంగా దర్శనం చేసుకునే వీలుం టుంది. ఇప్పుడు ఆ గడువును 90రోజులకు పెంపుదలచేయడంతో ఎన్ఆర్ఐ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

पंजाब नैशनल बैंक పంజాబ్ నేషనల్ బ్యాంకు
...విశ్వాసానికి మరో పేరు!
జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004.
నిద్రాణమైన / నిష్క్రియాత్మక ఖాతాలు మూసివేయుటకు బహిరంగ ప్రకటన
కొన్ని ఖాతాలలో గత 3 సంవత్సరాలుగా వినియోగదారు ప్రేరేపిత ఆపరేషన్ లేదని మరియు ఈ ఖాతాలలో బ్యాలన్స్ లేదని మా దృష్టికి వచ్చింది. ఈ ఖాతాలు దుర్వినియోగం కాకుండా చూసుకోవడానికి మరియు స్వాభావిక నష్టాలను నివారించడానికీ, బ్యాంక్ అటువంటి ఖాతాలను మూసివేయాలని నిర్ణయించింది.
అందువల్ల 31-03-2026 నాటికి 3 సంవత్సరాలకు పైగా కస్టమర్ ప్రేరేపిత లావాదేవీలు లేదా ఆపరేషన్ లేని మరియు బాలన్స్ లేని ఖాతాల ఖాతాదారులకు సంబంధిత శాఖలలో తాజా KYC డాక్యుమెంట్లను దాఖలు చేయుట ద్వారా వారి ఖాతాలను తిరిగి యాక్టివేట్ చేసుకోవాలని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. అలా చేయుటలో విఫలమైతే అటువంటి ఖాతాలు ఒక నెల లేదా ఆ తరువాత ఎటువంటి నోటీసు లేకుండా మూసివేయబడతాయి.
అటువంటి ఖాతాదారులందరూ 15-07-2026న లేదా ఆలోగా ముందుగా సంబంధిత శాఖలలో KYC డాక్యుమెంట్లను దాఖలు చేయుట ద్వారా అటువంటి ఖాతాలను తిరిగి యాక్టివేట్ చేసుకోవాలని కోరడమైనది, తద్వారా వారు బ్యాంకుతో నిరంతరాయ బ్యాంకింగ్ సేవలను పొందవచ్చు. యాక్టివేట్ చేసుకోవడంలో విఫలమైతే ఎటువంటి తదుపరి నోటీసులు లేకుండా ఈ ఖాతాలు 16-07-2026న లేదా ఆ తరువాత మూసివేయబడతాయి.
ఏదేని విచారణ/సహాయం అవసరమైతే మీ శాఖను సంప్రదించవలసిందిగా మీరు కోరబడుతున్నారు.
అధీకృత సంతకందారు

# ఖరీఫ్‌కు ఎల్‌నినో ముప్పు

ఖరీఫ్ (వానాకాలం సాగు) సీజను ప్రారంభమైంది. అయితే ఈసారి ఖరీఫ్‌పై ఎల్‌నినో ముప్పు పొంచి ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆందోళనవ్యక్తమవుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ఖరీఫ్ సీజనుపై రైతులు దృష్టిసారించారు. దేశంలోని మొత్తం వర్షపాతంలో రుతుపవనాల వాటా 80శాతం, ఖరీఫ్‌పంటల విత్తనాలు మొదటి వర్షంపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఈ ఖరీఫ్ సీజనులో వర్షాభావ పరిస్థితులకు ఎక్కువ అవకాశం ఉండటంతో ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రత్యేకించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రుతుపవనాలు బలహీనపడి, వర్షపాతం తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, ఆకస్మికంగా వర్షాలు పడడం, వరదలు, కరవు ఇలా భిన్నవాతావరణ పరిస్థితులు చూడకతప్పేలా లేదు. ఇదే సమయంలో కొందరు శాస్త్రవేత్తల అంచనా ప్రకారం పసిఫిక్ మహాసముద్రం నుంచి భారత భూభాగం సముద్రతీరానికి వచ్చేసమయానికి ఎల్‌నినో చాలావరకు బలహీనపడుతుంది. ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్ వంటి దేశాల్లో ఉన్నంత ప్రభావం భారత్‌లో ఉండకపోవచ్చు అనేది ఓ విశ్లేషణ. అలాఅని పూర్తిగా భారత్‌పై ప్రభావం ఉండదు అనుకోడానికీ లేదు. అందుకే కొందరు వ్యవసాయ శాస్త్రవేత్తలు పలుసూచనలు చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో రైతులు వరి పంటసాగు తగ్గించుకోవాలన్నది వాళ్ల ముఖ్యమైనసలహా. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి, సేంద్రియ విధానాల్లో అధిక దిగుబడి వచ్చే పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు పండించాలని సూచిస్తున్నారు. మరోపక్క తగినంత రుణాలను బ్యాంకులు మంజూరుచేయకపోవడం వంటికారణాలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత్యంతరం లేక పలువురు రైతులు ముఖ్యంగా కౌలు రైతులు ఆత్మహత్యలను నమ్ముకుంటున్నారు.

సిహెచ్.వి.వి.రఘుబాబు

ఎన్నో కష్టాలు, మరెన్నో నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతలకు ఈ ఖరీఫ్ సీజలో పెద్ద ముప్పును ఎదుర్కోవాల్సి న పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఖరీఫ్ మొదలైంది. ఎల్‌నినో ప్రభావమూ కనిపిస్తోంది. అయితే ఈసారి రైతులకు, వ్యవసాయ రంగానికి వాతావరణ శాఖ ఒక పెద్ద హెచ్చరిక జారీ చేసింది. ఈ ఏడాది వర్షాకాలంపై ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండే అవకాశం ఉందని, సెప్టెంబరు, అక్టోబరు వరకు వర్షాభావ పరిస్థితులు ఎదురుకావచ్చని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, సాగునీటిని పొదుపుగా వాడుకోకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర గడ్డు పరిస్థితులు తప్పవని కేంద్రం హెచ్చరించడంతో రాష్ట్రప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఎక్కువ నీరు అవసరమయ్యే వరివంటి పంటల సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే వర్షాధార పంటలను ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రణాళిక, రైతులకు అందే రాయితీలు, పంటల మార్పిడి వ్యూహాలు ఇవన్నీ ఇప్పుడు కీలకం కానున్నాయి. కేంద్ర వ్యవసాయ శాఖ ఇప్పటికే రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర జిల్లా స్థాయిలోనే అత్యవసర సాగు ప్రణాళికలను సిద్ధం చేయాలి. ఇవి కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో అమలు కావాలి. కరవును తట్టుకునేలా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే ధ్రువీకృత విత్తనాలను రైతులకు సకాలంలో అందించాలి. రిజర్వాయర్లలోని నీటిని అత్యంత జాగ్రత్తగా, పొదుపుగా వాడుకునేలా చర్యలు చేపట్టాలి. ఈ మేరకు ఆదేశాలు సైతం జారీ చేసింది. వరి సాగుకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బోర్ బావుల కింద, కాలువల కింద వరి వేసే భూములను గుర్తించి, అక్కడ తక్కువ పెట్టుబడి, తక్కువ కాలపరిమితి గల పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను వేయించాలని రాష్ట్రాలకు సూచించింది. ఎల్‌నినో అనేది ప్రకృతి విసిరిన సవాల్. వర్షాలు తక్కువగా ఉన్నప్పుడు సాంప్రదాయకంగా వేసే వరి పంట వైపు వెళ్తే పెట్టుబడి నష్టపోవడమే కాకుండా, నీరందక పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. అందుకే కేంద్రం ముందుచూపుతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును తెరపైకి తెచ్చింది. ఉచిత విత్తనాలు, సబ్సిడీలు, పండించిన పంటను ప్రభుత్వమే కొంటుందనే హామీఉండడం వల్ల రైతులు ఈ ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటల వైపు రాష్ట్రాలు అడుగులు వేయడం ఉత్తమం. తెలంగాణలో ఎల్‌నినో ముప్పు తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. దీని ప్రభావంతో



నైరుతి రుతుపవనాలకు తీవ్ర ఆటంకం ఏర్పడి, వర్షాభావ పరిస్థితులు, సుదీర్ఘమైన వర్షరహిత రోజులు, ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగే అవకాశం ఉంది. ప్రధాన ఈ ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా చూపనుంది. జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురిసే అవకాశం 80 వరకు ఉందనేది అంచనా. ఫలితంగా వర్షాల లోపం వల్ల భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసినా, ఆ తర్వాత ఉష్ణోగ్రతలు పెరిగి సుదీర్ఘగ్యాప్ ఉండే అవకాశం ఉంది. దీనివల్ల వరి వంటి నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. ముందు జాగ్రత్తలు చేపట్టింది. వర్షాలు తగ్గితే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, తాగునీటి సరఫరా నిర్వహణ, నీటి పొదుపు చర్యలపై అధికారులు ముందస్తు వ్యూహాలు సిద్ధంచేస్తున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ అధికారులు వరిపంటకు బదులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను వేయాలని రైతులకు సూచిస్తున్నారు. అలాగే ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాల్వలు, చెరువులు, కుంటలు తదితర చిన్న నీటి వనరుల్లో నీటిని వృథా చేయకుండా, ఆచితూచి వాడుకోవాలనిఅధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా కోటి 34లక్షల 66వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసింది. తగ్గట్టుగా ప్రభుత్వరంగ ఏజెన్సీల ద్వారా 38.21లక్షల క్వింటాళ్ల విత్త నాలు అందుబాటులో ఉంచింది. ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తిని 52లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. నాసిరకం విత్తనాల బెడద అరి కట్టేందుకు ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ బృందాలు సోదాలు, దాడులు విస్తృతం చేస్తున్నాయి. మార్క్‌ఫెడ్, ప్రభుత్వ, ప్రైవేటు కంపె నీల గోదాముల్లో రసాయన ఎరువులు నిల్వలు అందుబాటు లో ఉంచింది. కరవును తట్టుకుని నిలబడే, తక్కువ నీరు అవసరమయ్యే విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఎక్కువ నీరు వృథా కాకుండా బిందు సేద్యం వైపు మళ్లించాలనీ భావిస్తోంది. పంటమార్పిడిపైనా ఇప్పటికే అధ్యయనాలు మొదలయ్యాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో15జిల్లాల్లో బోర్ల కింద సాగయ్యే 86,000 ఎకరాలను గుర్తించి, అక్కడ వరికి ప్రత్యామ్నాయంగా నూనెగింజలు, మినుము వంటి పంటలను ప్రోత్సహిస్తున్నారు. నంద్యాల జిల్లాలో 34,000 ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 31,335ఎకరాలను గుర్తించారు. ఇక్కడ మినుము సాగుకు ప్రాధాన్యతను ఇస్తారు. కాలువలకింద నీటిలభ్యత తగ్గనుండడంతో 11 జిల్లాల పరిధిలోని 1.54 లక్షల ఎకరాల్లో పప్పుధాన్యాలు, నూనెగింజల పంట లను సాగు చేయనున్నారు. ఇందుకోసం నంద్యాల జిల్లాలో 54,655 ఎకరాలు, పల్నాడు జిల్లాలో 26,000 ఎకరాలు, ఏలూరు జిల్లాలో 26,600 ఎకరాలను గుర్తించారు. రాష్ట్రంలోని 9 జిల్లాల పరిధిలో సుమారు 15,375ఎకరాల్లో రైతులను పొగాకు సాగు నుంచి లాభ దాయకమైన పప్పుధాన్యాలు, నూనెగింజల సాగువైపు మళ్లించాలని లక్ష్యంగా పెట్టు కున్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా ప్రభుత్వం భారీగా సబ్సిడీలను ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా వరికోత ల తర్వాత సాగు చేపట్టడానికి, చేలగట్లపై పండించేందుకు 59,840ఎకరాల్లో విత్తన కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి 100 రాయితీ ఇవ్వనుంది. సుమారు లక్ష ఎకరాలకు కంది, మిను ము, శనగ విత్తనాలను 50రాయితీ పై పంపిణీ చేయాలని ప్రణాళికను సిద్ధంచేశారు. పల్స్ మిషన్ ద్వారా రైతులు పం డించిన కందులు, మినుములను 100 సేకరిస్తామని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నూనెగింజల కొరతను అధిగమిం చడానికి, విలువ ఆధారిత క్లస్టర్ల పరిధిలో నూనెగింజలపంటల సాగుకు ప్రణాళిక సిద్ధమైంది. 59,375 ఎకరాల్లో వేరుశనగ, 7,500 ఎకరాల్లో నువ్వులు, 2,500 ఎకరాల్లో సోయాబీన్స్, 2,500ఎకరాల్లో ఆముదం వంటి పంటలకు విత్తనాలను 100శాతం రాయితీపై రైతులకు అందిస్తారు. అంతేకాకుండా, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని సాధించడం ఎలా అనే అంశంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది రుతుపవనాలపై ఆధారపడే ఖరీఫ్ సాగుపై ఈ ఎల్నినో

---

పశ్చిమ బెంగాల్

# దీదీ! ఏదీ దారి!

ఎ.వి.వి ప్రసాద్

గోరు చుట్టుపై రోకటి పోటు అంటే ఇదే. నెల రోజుల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కలిగిన ఘోర పరాభవం నుంచి తేరుకునే లోగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ హఠాత్తుగా మరో సంక్షోభంలోకి జారిపోయారు. వరుసగా నాలుగోసారి ముఖ్యమంత్రి కావాలనుకొన్నారు. దేశంలోని ముఖ్యమంత్రులలో సరికొత్త రికార్డు సృష్టించాలనుకొన్నారు. గతంలో రెండుసార్లు ప్రధాని పదవిపై కూడా కన్ను వేసినా, అప్పటి మరో ఇద్దరు సిఎంలు మాయావతి, జయలలిత గట్టి పోటీ ఇవ్వడంతో వెనక్కి తగ్గారు. ఆ తర్వాత రాష్ట్రనాయకత్వంపై మాత్రమే దృష్టి నిలిపి వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రి పదవి అధిష్టించి నాలుగోసారి ఘోరంగా విఫలమయ్యారు. చివరికి అసెంబ్లీలోకి కూడా అడుగు పెట్టలేని దుస్థితి. ఆటలో ఓడిన ప్రత్యర్థిని వేటాడడం తేలిక. అన్నివైపుల నుంచి రెక్కలు కత్తిరిస్తే ఇక ఏ పక్షి అయినా ఎగిరే ప్రయత్నమైనా చేయదు కదా! పార్టీ లోని సీనియర్ నేతలంతా వరుసగా జారుకొనడంతో ఇప్పుడామె దాదాపు ఒంటరిగా నిలబడ్డారనే చెప్పాలి. దాని వెనుక కనిపించే ప్రధాన కారణం అభిషేక్ బెనర్జీ వ్యవహార తీరు. మమత మేనల్లుడుగా ఆయన తృణమూల్ పార్టీలో విశేషమైన పాత్రనే పోషిస్తున్నారు. ఎంత సీని యర్ నేతలైనా ఆయన చెప్పినట్లు వినవలసిందే. మమత రాజకీయ వారసునిగా ప్రచారంలో ఉన్న అభిషేక్ నిరంకుశ వైఖరి వల్లే తృణమూల్ ఇంతటి సంక్షోభాన్ని ఎదర్కొనవలసి వచ్చింద న్నది బహిరంగ రహస్యమే. మమత మేనల్లుడి స్థాయి నుంచి పార్టీ కేంద్ర బిందువుగా మార డమే గాక తన చేతిలో ఆమె కీలుబొమ్మ అనే ప్రచారం కూడా అభిషేక్ ఈమధ్య చేస్తున్నారని వినిపిస్తోంది. 28 సంవత్సరాలుగా తిరుగులేని ఆధిక్యతతో సాగుతున్న తృణమూల్ ఒక్కసారిగా తీవ్రమైన అంతర్గత సంక్షోభంలో కూరుకుపోవ డంతో ప్రత్యర్థులకు మరింత పట్టు చిక్కినట్ట యింది. తాజా ఎన్నికల్లో 80 సీట్లు మాత్రమే రాగా ఆ ఎమ్మెల్యేలలో 58 మంది తిరుగుబాటు పక్షాన నిలిచారు. మరో 20 మంది ఎంపీలు కూడా అదే బాట పట్టినట్లు తెలుస్తోంది. రెబెల్ వర్గం అసెంబ్లీలో తామే అసలైన ప్రతిపక్షంగా గుర్తింపు పొందడం రోకటి పోటు బాధను మరింత పెంచుతోంది. తిరుగుబాటు గ్రూపులో విభేదాలు పొడచూపాయనీ, దానితో పార్టీపై తిరిగి పట్టుసాధించేందుకు మమత ప్రయత్నాలు ముమ్మరం చేశారనీ అంటున్నారు. అయితే ఆమెకు ఇక ఆ అవకాశం లేదనే అంతా భావిస్తున్నారు. అభిషేక్ బెనర్జీ పట్ల పార్టీలో వెల్లువెత్తిన వ్యతిరేకతపై నీళ్ల చిలకరించినట్లుగా ఆయన ప్రాధాన్యత తగ్గించడానికి మమత ఉపక్రమించడం తాజా పరిణామం. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అభిషేక్ ప్రాధాన్యత తగ్గించడానికి మమత మరో ఇద్దరు ఎంపీలను జాయింట్ నేషనల్ సెక్రటరీలుగా నియమించడం సంక్షోభాన్ని కొత్త మలుపు తిప్పుతోంది.



మమతా బెనర్జీ

ఆ ఇద్దరిలో ఒకరిని తమ వైపు తిప్పుకొనడానికి రెబెల్ వర్గం ప్రయత్నిస్తు న్నదనే ప్రచారం కూడా జరుగుతోంది. మమతకు కీలక మద్దతుదారులైన కొందరు నేతలు కూడా క్రమంగా జారుకోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పదిరోజుల క్రితం తృణమూల్ శాసన సభాపక్ష నేతగా శోభన్ దేబ్ ఛటోపాధ్యాయను నియమిస్తున్నట్లుగా మమత చేసిన ప్రకటనతో ఒక్కసారిగా సంక్షోభం తొంగి చూసింది. ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలు ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం, తర్వాత వారిద్దరినీ మమత సస్పెండ్ చేయడం తో సంక్షోభం మరి కాస్త ముదిరింది. తర్వాత రెండు రోజుల్లోనే అసమ్మతి వర్గం సంఖ్య ఊహించనంతగా పెరిగింది. గత రెండు వారా లలో కనీసం 100 మంది కౌన్సిలర్లు కూడా రాజీనామా చేయడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. తృణమూల్‌లో ఈ హఠాత్పరిణామాలేమిటి? అంటూ అందరు ముక్కున వేలు వేసుకొంటున్నారు. గతంలో మహారాష్ట్ర లోని శివ సేనలో షిండే, ఎన్సీపీలో అజిత్ పవార్ ఇటు వంటి ప్రయోగాలే చేశారు. ఇది మరో ప్రయోగం. లోక్‌సభలో బిజెపి, కాంగ్రెస్ తర్వాత పెద్ద పార్టీ తృణమూల్ కాంగ్రెస్ కావడంవల్ల తాజా పరిణామాలతో రాజకీయ సమీకరణాలు మార వచ్చని కూడా భావిస్తున్నారు. మమతా బెనర్జీ గతవారం పార్టీ ముఖ్య నేతలతో రెండు సార్లు సమావేశాలు జరపగా ఒకసారి 8 మంది, రెండోసారి నలుగురు మాత్రమే హాజరు కావడాన్ని బట్టి పార్టీ పరిస్థితి ఎంత క్షీణించిందో అర్థమవుతోంది. ఇంతకాలం ముస్లిం ఓట్లపై ఎక్కువగా ఆధారపడిన మమత ఇప్పుడు ఆ మద్దతును కూడా పోగొట్టుకొంటోంది. ముర్షిదా బాద్ జిల్లాలో తృణమూల్ తరఫున గెలిచిన 8 మంది మైనారిటీ ఎమ్మెల్యేలు ఇప్పుడు తిరుగు బాటు వర్గంలోనే కనిపిస్తున్నారు. పార్టీలో సీనియర్ నేత అయిన జావేద్ ఖాన్ కూడా గత శుక్రవారం మమత సమావేశానికిగాక రితబ్రత సమావేశానికి హాజరు కావడాన్ని బట్టి మరికొందరు నేతల దారి కూడా మారవచ్చని తెలుస్తోంది. తృణమూల్‌లోని 80మంది ఎమ్మెల్యేలలో 34 మంది ముస్లింలే. ఇప్పుడు వారిలో 24మంది తిరుగుబాటు వర్గం లోనే ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పరిణామాన్నిటిని చూస్తుంటే తృణమూల్‌లో చివరికి మమత, అభిషేక్ మాత్రమే మిగలవచ్చనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మూడున్నర దశాబ్దాల లెఫ్ట్ కంచు కోటలు పగులగొట్టిన మమత తన కోటను రక్షించుకోలేని పరిస్థితికి వచ్చారంటే అంతకంటే విచారకరం ఏముంటుంది! ఈ బెడద నుంచి బయటపడడానికి మమత ఏదైనా పటి ష్టమైన వ్యూహం రూపొందిస్తారో, లేక నిశ్శబ్దం గా

---

క్యూబా

# ఆంక్షల చట్రంలో క్యూబా!

గన్ని మోహన్

మొన్న వెనిజులా, ఇప్పటికీ ఇరాన్ కథ ముగుస్తుందనుకుంటే మళ్లీ లాటిన్ అమెరికా దేశం కరిబియన్ ద్వీపకల్పం క్యూబాపై అమెరికా కన్నుపడింది. ఈద్వీపాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకుంటామని చెపుతూ వస్తున్న అమెరికా విస్తరణ కాంక్షకు అసలు కారణం ఏమిటి? ఎందుకు క్యూబాపై పగబట్టిందనేందుకు 30ఏళ్లనాటి సంఘటనను తెరపైకి తెచ్చి అప్పటికి అధ్యక్షుడు, రక్షణమంత్రి సైనిక అధికారులపై కేసులు నమోదు చేయడం వంటివేనని చెప్పాలి. వెనిజులా అధ్యక్షుని తరహాలోనే నిర్బంధించి తీసుకురావాలని భావించినా ఇతర దేశాలనుంచి ఎదురయ్యే తిరుగుబాటును చూసే ట్రంప్ వెనకడుగు వేసారు. 30ఏళ్ల క్రితం అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో రెండు విమానాలను కూల్చివేయడం అందులో అమెరికన్ పౌరులు మరణించడమే ఈ ఆగ్రహానికి కారణమని తెలుస్తోంది. అమెరికాలోని మయామి క్యూబా ప్రవాసుల సమూహానికి చెందిన ఈ రెండు చిన్న విమానాలు క్యూబా ఫైటర్ జెట్స్ కూల్చివేసాయి. అప్పట్లో అధ్యక్షుడుగా ఉన్న ఫిడెల్ క్యాస్ట్రో రక్షణ మంత్రిగా ఉన్న రౌల్ క్యాస్ట్రోలపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అమెరికా కూడా అన్నిరకాల ఆంక్షలను అమలు చేసింది. ఇప్పటికీ అదేరీతిలో ఆంక్షలు అమలు చేస్తున్న ట్రంప్ సర్కారు క్యూబాకు వెనిజులా నుంచి వచ్చే ఇంధన సరఫరాను నిలిపివేసింది. ఆహార సంక్షోభం ఎదుర్కొంటున్నది. దీనితో ప్రస్తుత క్యూబా ప్రభుత్వంపై ప్రజల నుంచే నిరసన వచ్చేటట్లు చేస్తున్న ట్రంప్ సర్కారు ఎట్టిపరిస్థితుల్లోనూ క్యూబా స్వాధీనంవైపే అన్ని వ్యూహాలను అమలుచేస్తోంది. 2021లోనే క్యూబా అధ్యక్ష బాధ్యతలు, కమ్యూనిస్టు నాయకత్వం నుంచి తప్పుకున్నప్పటికీ అమెరికా వెంటాడుతూనే వస్తోంది. రౌల్ క్యాస్ట్రోపై ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. వెనిజులా మద్దతు కోల్పోయిన తర్వాత క్యూబా తీవ్ర సంక్షోభంలో కూరుకుని పోయింది. ఇంధన, ఆర్థిక, ఆహార సమస్యలు ఎదుర్కొంటున్నదనే చెప్పాలి. ఒకప్పుడుక్యూబాకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచిన సోవియట్ కూలిపోయిన తర్వాత మరింత సంక్షోభం ఎదుర్కొన్నది. ఆ సమయంలోనే ఈ దాడి జరిగింది. నిజానికి 1996 ఫిబ్రవరి 24వ తేదీ మూడు విమానాలు బయలుదేరాయి. వాటిని అనుమానించిన క్యాస్ట్రో సర్కారు వాటిపై దాడిచేయడంతో రెండు విమానాలు కూలిపోయాయి. మూడో విమానం మాత్రం తప్పించుకోగలిగింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి క్యూబా ఈ దాడికి తెగబడిందని అప్పట్లో ప్రపంచ దేశాలు, ఐక్య రాజ్య సమితి సైతం తప్పుపట్టాయి. ఈ దాడికి ఫిడేల్‌క్యాస్ట్రో బాధ్యుడు కాగా ఆనాటి రక్షణ మంత్రి రౌల్‌క్యాస్ట్రో ఈ ప్లాన్ అమలుచేసినట్లు అమెరికా ఇప్పటికీ ఆరోపిస్తూనే ఉంది. అమెరికాతో సంబంధాలు మెరుగు పడకుండా అడ్డుకోడానికే ఫిడేల్‌క్యాస్ట్రో ఈ దాడి చేయించారని అప్పట్లో బలంగా వినిపించింది.



రౌల్ క్యాస్ట్రో

అమెరికాతో బంధం బలపడిందంటే క్యూబాలో రాజకీయ ఆర్థిక సంస్కరణలకు దారితీస్తుందని క్యాస్ట్రో అనుమానించారని అందుకే ఈ దాడితో పూర్తిగా సంబంధాలు కూడా తెగిపోయాయని క్యూబాప్రజలు భావించారు. ఈసంఘటనను తీవ్రంగా పరిగణించిన అమెరికా మాత్రం ఆర్థిక ఆంక్షలను కఠినతరం చేయడంతో తమపై అమెరికా దౌత్యపరమైన దాడిచేసిందని క్యూబా ఆరోపించింది. నాటిప్రమాదంలో బాధితులకు పరిహారం చెల్లించేందుకు క్యూబా నిరాకరించడంతో అమెరికాలో స్తంభింప చేసిన క్యూబా ప్రభుత్వానికి చెందిన 93మిలియన్ డాలర్ల ఆస్తుల నుంచి మృతుల కుటుంబాలకు అమెరికా పరిహారం చెల్లించింది. ఈసంఘటన జరిగి 30 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు క్యూబా స్వాధీనానికి అమెరికాకు ఇదొక బ్రహ్మాస్త్రంగా కూడా దొరికినట్లయింది. ద్వీపకల్ప దేశం అయిన క్యూబా జనాభా పరంగా కూడా తక్కువే. 10.5 మిలియన్లకు మించిలేరు. కేవలం పర్యాటకం, గనుల నుంచి లభించే నికెల్ ఇతరవిలువైన ఖనిజాల ఎగుమతుల ద్వారా క్యూబా ఖజానా నింపుకుంటున్నది. కేవలం1.10లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యం మాత్రమే ఉన్న ఈద్వీపం స్వాధీనానికి ప్రధాన కారణం అక్కడ తన రక్షణరంగ స్థావరం ఏర్పాటుచేసుకోవాలని అమెరికా భావించడమే. ఇది చాలదన్నట్లు తాజాగాక్యూబా అధ్యక్షుడుమిగ్యూల్ డియాజ్ కేనల్, ఆయన సతీమణి మరో ముగ్గురు ప్రముఖులపై ఆర్థిక ఆంక్షలు తీవ్రంచేసింది. రౌల్ క్యాస్ట్రో తనయుడు అలెజాంద్రో క్యాస్ట్రో ఎస్పిన్, ఆయన భార్య విల్మా ఎస్పిన్ వీరి తనయుడు రౌల్ అలెజాంద్రో క్యాస్ట్రో కాలిస్‌లనున కూడా ఈఆంక్షల జాబితాలోకి చేర్చింది. అలాగే అమెరికాలో వీరికి ఉన్న ఆస్తులు, బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయాలని కూడా ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీచేసారు. క్యూబాపై చర్యలు తప్పవని, డీల్‌కు రాకుండా స్వాధీనమే ఇక అంటూ ట్రంప్ మరోపక్క చేస్తున్న హెచ్చరికలను ఆదేశ అగ్రనాయకత్వం కూడా సుతరాము లెక్కచేయడం లేదు. దీనితో వెనిజులా తరహా సైనిక చర్య క్యూబాపై అమెరికా ప్రయోగించబోతుందన్నది ఆ దేశ ప్రజలు గ్రహించారు. ప్రజల సంక్షేమాన్ని వదిలిమంకుపట్టు వద్దంటూ మిగ్యూ ల్ డియాజ్ కేనల్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. అమెరికాకు కావాల్సింది కూడా అదే. ప్రజల నుంచే నిరసన పెల్లుబుకడం ద్వారా కేనల్ ప్రభుత్వాన్ని కూలదోయడం ఆపై తన నియంత్రణలోని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి క్యూబాపై పట్టు ఆధిపత్యం పెంచుకోవాలని అమెరికా చూస్తోంది. ఇందులో భాగంగానే రౌల్‌క్యాస్ట్రో మరికొందరిపై ఛార్జిషీటు దాఖలు చేసి క్రిమినల్ అభియోగాలు నమోదు చేయడమని తెలుస్తోంది. మొత్తంగా చూస్తుంటే ట్రంప్ సమీప భవిష్యత్తులో క్యూబాను కూడా తన దారికి తెచ్చుకుంటారనే భావన అటు క్యూబన్లలోను ఇటుఅమెరికా వ్యతిరేక దేశాల్లో కూడా వ్యక్తం అవుతోంది. సంక్షోభంలో ఉన్న క్యూబా ఇప్పుడు మధ్యేమార్గం అన్వేషించుకోవాల్సి న పరిస్థితులు అలుముకున్నాయని చెప్పకతప్పదు. ●

---

# ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో భారత్‌కు తప్పని కష్టాలు

సుంకవల్లి సత్తిరాజు

ప్రపంచాన్ని మింగేస్తున్న ఆర్థిక మాంద్యం ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నది. ఇరాన్, అమెరికా యుద్ధం వలన ఏర్పడిన ఇంధన సంక్షోభం వలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమైపోతున్నాయి. ఒకరి అహం, ఇంకొకరి ద్వేషం, మరొకరి పగ, ప్రతీకారం యుద్ధానికి సంబంధం లేని ప్రజలకు నరకం చవి చూపిస్తున్నాయి. యుద్ధంలో ఎలాగైనా గెలిచి తీరాలని, లేకపోతే అగ్రరాజ్యమనే హోదాకు భంగం వాటిల్లుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భావిస్తుండగా, ఖమేనీని అంతం చేసిన అమెరికాను ప్రపంచం దృష్టిలో చులకన చేయాలని ఇరాన్ వాంఛిస్తున్నది. అమెరికా ప్రజల్లోను, రిపబ్లికన్ పార్టీలోను ట్రంప్ పట్ల వ్యతిరేకత పెరుగుతుండగా, మరో వైపు మధ్యంతర ఎన్నికల భూతం ట్రంప్‌ను భయపెడుతున్నది. అనవసరంగా యుద్ధాన్ని ప్రారంభించి తప్పు చేసినట్టు ట్రంప్ లోలోపల మధన పడుతున్నా, ఈ విషయం ఒప్పుకోవడానికి ఆయనకు అహం అడ్డువస్తున్నది. ఏదో విధంగా ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకుని, తానే యుద్ధంలో పైచేయి సాధించానని చెప్పుకోవడానికి ట్రంప్ నానా ఇబ్బందులు పడుతున్నాడు. ఇదే సందర్భంలో అమెరికాను ఓడించానని చెప్పుకోవడానికి ఇరాన్ కుతూహలపడుతున్నది. సందట్లో సడేమియా అన్నట్టుగా, ఇజ్రాయిల్, గాజా పైన, లెబనాన్ పైనా తన దాడులను కొనసాగిస్తున్నది. అమెరికా, ఇరాన్ సంఘర్షణలో ఈ విషయం ప్రపంచానికి పెద్దగా తెలియడం లేదు. లెబనాన్ పై ఇజ్రాయిల్ తన దాడులను ఆపాలన్నది ఇరాన్ అమెరికాకు విధిస్తున్న షరతుల్లో ఒకటి. అయితే అమెరికా ఈ విషయానికి పెద్దగా ప్రాధాన్యత నివ్వడం లేదు. ఇరాన్ వద్దనున్న యురేనియం నిల్వలను నిర్వీర్యం చేయాలనే పట్టుదలతో అమెరికా భీష్మించుకు కూర్చున్నది. శాంతియుత ప్రయోజనాలకోసమే యురేనియం శుద్ధి చేస్తున్నామని ఇరాన్ పేర్కొంటున్నా, అణ్వాయుధాల తయారీ కోసమే ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం చేపట్టిందని అమెరికా వాదన. గతంలో కూడా ఇరాక్ పైన, సద్దాం హుస్సేన్ పైన జీవరసాయన ఆయుధాలు తయారు చేస్తున్నరనే నెపంతో, అణ్వస్త్రాల తనిఖీ మిషతో అమెరికా ఇరాక్‌పై ఆరోపణలు చేసి, ఇరాక్‌ను విధ్వంసం చేసింది. సద్దాం హుస్సేన్‌కు ఉరిశిక్ష వేయించి, ఆయనను భౌతికంగా దూరం చేసిన అమెరికా ప్రస్తుతం ఇరాన్ విషయంలోను ఇదే ధోరణితో యుద్ధానికి తల పడింది. ఇరాన్ యురేనియం శుద్ధికార్యక్రమం చేపట్టిందని, ఇది అణ్వాయుధాల తయారీ కోసమేనని ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నది. ఇరాన్ అమెరికాల మధ్య కాల్పుల విరమణ ప్రక్రియ నాటకీయంగామారింది. అమెరికా క్షిపణులు, ఇరాన్ డ్రోన్లదాడులతో పశ్చిమాసి యా రణరంగంగా మారింది. గల్ఫ్‌దేశాలన్నీ భయం గుప్పెట్లో బిక్కుబిక్కు మంటున్నాయి. భారత దేశంతో పాటు అనేక దేశాలు వంట గ్యాస్, పెట్రోల్, డీసెల్ కొరతతో సతమత మవుతున్నాయి. భారత దేశంలో స్వల్ప వ్యవధిలోనే 4 సార్లు పెట్రోల్, డీసెల్ ధరలు పెరిగాయి. రాబోవు రోజుల్లో ఇంధన ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. వంటగ్యాస్‌కు కొరత లేకపోవ డంతో గ్యాస్ కనెక్షన్ లేకపోయినా ఇప్పటివరకు ఎవరూ ఇబ్బంది పడలేదు. అయితే అమెరికా ఇరాన్ మధ్య జరుగు తున్న యుద్ధం కారణంగా భారత్‌లో కూడా ఎల్పీజీ కొరత ఏర్పడింది. వాణిజ్య, గృహ సంబంధిత గ్యాస్ ధరలు ఇప్ప టికే పెరిగాయి. కమర్షియల్ గ్యాస్‌ధరలు భారీగా పెరగడం తో అంతిమంగా సామాన్య వినియోగదారులపై భారీగా భారంపెరిగింది. ఇంధన కొరతవలన నిత్యావసర వస్తువుల తోపాటు వ్యవసాయరంగం మీద కూడా పెనుభారం పడింది. సామాన్య ప్రజలు పెరిగిన ధరలను మోయలేకపోతున్నారు. ఇంధన సంక్షోభంతో పలువురు ఉపాధి కోల్పోతున్నారు. ఇతరదేశాలతో పోల్చిచూస్తే భారత్ కొంతవరకు ఆర్థికంగా సుస్థిరంగానే ఉందని చెప్పవచ్చు. ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధ విరమణకు సంబంధించి, రాజీకుదరకపోతే,




యుద్ధంఇలాగే కొనసాగితే భారత్‌కూడా సమీప భవిష్యత్తులో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కోక తప్పదు. ప్రపంచం ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభం సమసిపోవాలంటే యుద్ధ విరమణ చర్యలు వేగ వంతం చేయాలి. స్ట్రయిట్ ఆఫ్ హార్ముజ్‌ను ఎలాంటి షర తులు లేకుండా ఇరాన్ పునఃప్రారంభించాలి. హార్ముజ్‌గుండా పయనించే నౌకలపై టోల్ విధించి, తద్వారా ధ్వంసమైన ఇరాన్‌ను పునర్నిర్మాణ దిశగా నడిపించాలనే ఇరాన్ ప్రతిపాదనకు అమెరికా అంగీకరించబోదు. అంతర్జాతీయ చట్టాల ననుసరించి స్వేచ్ఛగానౌకలు హార్ముజ్ గుండా ప్రయాణం చేయాలి. హార్ముజ్‌పై ఇరాన్ తన అధికారాన్ని చెలాయిస్తున్నది. తమ అనుమతి లేకుండా స్ట్రయిట్ ఆఫ్‌హార్ముజ్ గుండా ఎలాంటి నౌకలు ప్రయాణించినా, పేల్చి వేస్తామని, అమెరికా ఈ విషయంలో వెనక్కి తగ్గకపోతే హార్ముజ్ జల సంధి క్రింద అమర్చిన సీమైన్స్‌తో తగిన బుద్ధి చెబుతామని ఇరాన్‌కుచెందిన ఐఆర్జీసీ చేసిన ప్రకటనతో అమెరికా నావికా దళం ఇందుకు ప్రతిగా ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధించి, ప్రపంచాన్ని తీవ్ర ఇంధన సంక్షోభంలో ముంచె త్తింది. గల్ఫ్‌దేశాల్లో చమురు నిల్వలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే చమురు వెలికితీతను ఆపక తప్పదు. చమురు తవ్వకాలను నిలిపి వేస్తే, తిరిగి ప్రారంభించడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతా యి. గల్ఫ్‌లో చమురు నిల్వలు పెరిగిపోతుంటే, చాలా దేశాలు చుక్క చమురు దొరక్క అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇదొక విచిత్రమైన వైపరీత్యం. యుద్ధకాంక్ష వలన తలకెక్కిన పైత్యానికి అమెరికా ఇరాన్‌ల మధ్యశాంతి ఒప్పందమే ఏకైక పరిష్కారం. యుద్ధాన్ని విరమించకపోతే ఇప్పటికే తీవ్ర ఆర్థికసంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచం అల్లకల్లోలంగా మారే అవకాశముంది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ప్రారంభమై 3నెలలు దాటి నాల్గవనెలలోకి ప్రవేశించినా ఇంకా పరిస్థితిలో మార్పురాలేదు. అమెరికా ఆశించినట్టుగా ఇరాన్‌లో రెజీమ్ మార్పు జరగలేదు. యుద్ధం వలన గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు దెబ్బతిన్నాయి. అమెరికా యుద్ధ విమానాలు, క్షిపణులు ధ్వంసమయ్యాయి. యుద్ధంవలన అమెరికాకు 25బిలియన్ డాలర్ల నష్టం వాటి ల్లినట్టు సమాచారం. అయితే ఈనష్టం 100బిలియన్ డాలర్ల కు పైగా ఉండవచ్చని అంచనా. ఏదిఏమైనప్పటికీ ఆర్థికంగా పతనమైన అమెరికాకు ఈ యుద్ధం మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగామారింది. డాలర్‌వ్యవస్థ మాత్రమేఅమెరికాను కాపాడుతున్నది. చమురుతోపాటు ఇతర వాణిజ్య ఒప్పందాలు డాలర్‌తో కాకుండా ఆయా దేశాల కరెన్సీతో జరిగితే అమెరికా ఆర్థికంగా అధోగతిపాలై ఉండేది. ఇరాన్ షరతులను అమెరికా అంగీకరించలేదు. అమెరికా చెప్పినట్టు ఇరాన్‌నడుచుకోలేదు. ఇలాంటి సందిగ్ధత నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో హార్ముజ్ జలసంధి ద్వారా స్వేచ్ఛవాణిజ్యం జరిగేలా ఇరాన్ అంగీకరించాలి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేయకుండాచూడాలి. ఇరాన్‌కు చెందిన యురేనియం నిల్వలను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో నిర్వీర్యం చేయాలి. గాజాలోను, లెబనాన్‌పైన ఇజ్రాయిల్ తనదాడులకు స్వస్తి చెప్పాలి. ఈనిబంధనలను అంగీకరించేలా అమెరికా, ఇరాన్ దేశాలను ఐక్యరాజ్యసమితి, ఇతరదేశాలు ప్రయత్నం చేయాలి. ఇతరదేశాల్లో మాదిరిగానే అమెరికాలో కూడా ద్రవ్యోల్బణం పెరిగింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. విలాసవంతమైన జీవితాన్నిగడిపే అమెరికా పౌరులకు యుద్ధం శరాఘాతంలా తగిలింది. ఈ కారణంగానే ట్రంప్‌పై అమెరికా ప్రజల్లో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. యుద్ధం తలకుమించిన భారంగా మారిన నేపథ్యంలో ఇరాన్ షరతులను అంగీకరించలేక, రిపబ్లికన్ల వత్తిడిని అధిగమించలేక ట్రంప్ ఉక్కిరిబిక్కిరి కావడం చూస్తున్నాం. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో అమెరికా కూడా అన్ని విషయాలను పక్కనబెట్టి, ఇరాన్ యురేనియం నిల్వలను తమకు అప్పగిస్తేచాలని అమెరికా కోరుకుంటున్నది. తద్వారా యుద్ధంలో తామే గెలిచామని చెప్పుకోవడానికి అవకాశం దొరుకుతుంది. అప్పుడే ట్రంప్ అహం సంతృప్తి

# సద్దుమణిగిన కర్ణాటక వివాదం

## న రామలింగారెడ్డిని బుజ్జగించిన సిఎం డికె - రాజీనామా నిర్ణయం విరమించిన మంత్రి



**బెంగళూరు, జూన్ 6:** కర్ణాటక ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ తర్వాత చెలరేగిన అసమ్మతి సెగలు సద్దుమణిగాయి. శాఖల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సీనియర్ నేత రామలింగారెడ్డి కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగి ఆయనతో జరిపిన సుదీర్ఘ చర్చలు ఫలించడంతో సమస్యకు తాత్కాలికంగా తెరపడింది. శుక్రవారం రాత్రి రాజీనామా ప్రకటనతో కలకలం రేపిన రామలింగారెడ్డిని బుజ్జగించేందుకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. జయనగర్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో అర్ధరాత్రి దాటాక రామలింగారెడ్డితో ఆయన భేటీ అయ్యారు. పార్టీకి చెందిన మరికొందరు సీనియర్ నేతల సమక్షంలో జరిగిన ఈ మంతనాల తర్వాత వివాదం సద్దుమణిగినట్లు డీకే శివకుమార్ ప్రకటించారు. శాఖల కేటాయింపునకు సంబంధించి తలెత్తిన కొన్ని సమస్యలపై కూర్చుని మాట్లాడుకున్నాం. ప్రస్తుతం వివాదం పరిష్కారమైందని ఆయన మీడియాకు స్పష్టంచేశారు. తనకు కేటాయించిన నీటిపారుదల శాఖపైనే రామలింగారెడ్డి ప్రధానంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు డీకే తెలిపారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలనే దానిపై స్పష్టమైన అవగాహనకు వచ్చామని పేర్కొన్నారు. రామలింగారెడ్డి, నేను 1980ల నుంచి మంచి స్నేహితులం. పార్టీలోని సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తున్నాం. చిన్నచిన్న అభిప్రాయభేదాలను త్వరలోనే పరిష్కరించుకుంటామని డీకే భరోసా ఇచ్చారు. రామలింగారెడ్డి వివాదం ముగిసినప్పటికీ, కర్ణాటక మంత్రివర్గంలో అసంతృప్తి పూర్తిగా సమసిపోలేదని తెలుస్తోంది. మరో సీనియర్ మంత్రి కేహెచ్ మునియప్ప కూడా శాఖల కేటాయింపుపై తన సీనియారిటీకి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదంటూ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఇంకా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఒకవైపు రామలింగారెడ్డిని శాంతింపజేసినా, మరోవైపు మునియప్ప వంటి సీనియర్ నేతల్లోని అసంతృప్తిని కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



# పశ్చిమాసియా సంక్షోభంపై ప్రధాని మోడీ చర్చలు

## సులభశైలి జీవనం, వాణిజ్యంపై ఆర్థిక సలహామండలి సూచనలు కోరిన ప్రధాని

**న్యూఢిల్లీ,జూన్ 6:** ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. సులభతర జీవనశైలి, సులభశైలి వాణిజ్య నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల నిపుణులనుంచి సలహాలు, అభిప్రాయాలు స్వీకరించారు. భారత్ ఆర్థికవృద్ధికి ఊతం ఇచ్చే అనేక అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. సభ్యులు కూడా పశ్చిమాసియా అనిశ్చితి భారత్‌పై ప్రభావం అన్న అంశానికి సంబంధించి తమతమ అధ్యయననివేదికలను మోడీకి వివరించారు. పశ్చిమాసియాపైనేకాకుండా భారత్, ప్రపంచదేశాలపై ఈప్రభావం అత్యధికంగా ఉంటుందన్నది నిపుణుల వాదన. భారత్ దీర్ఘకాలిక అభివృద్ధిప్రాధాన్యతాంశాలపైనే మోడీ ముఖ్యంగా సమావేశంలోప్రస్తావించారు. ప్రధాని ఆర్థిక సలహా మండలిలో ముగ్గురు శాశ్వత సభ్యులు కాగా 11 మంది తాత్కాలిక సభ్యులు ఉంటారు. ప్రధానికి స్థూల ఆర్థికవ్యవస్థ స్థితిగతులు, ఆర్థికపరమైన అంశాలపై ప్రధాని మోడీకి ఈ కమిటీ సలహాలు,సూచనలుచేస్తుంది.

# ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు.. ఒకరి మృతి

**తిరువనంతపురం, జూన్ 6:** నైరుతి రుతుపవనాల రాకతో కేరళలో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. అనేక జిల్లాల్లో ఇండ్లు ధ్వంసం కాగా, రోడ్లు నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా ఒకరు మరణించారు. రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ మేరకు మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసర్‌గాడ్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే, పతనంతిట్ట, కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిశూర్, పాలక్కాడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రెడ్ అలర్ట్ ప్రకారం రాబోయే 24 గంటల్లో ఆయా జిల్లాల్లో 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఆరెంజ్ అలర్ట్ ప్రకారం 11 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల రోడ్లు నీట మునిగాయి. చాలా చోట్ల ఇండ్లు, ఇతర ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో చాలా జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. ఒక తాత్కాలిక షెడ్‌పై చెట్టు పడటంతో అందులో నిద్రిస్తున్న 29 ఏళ్ల యువకుడు మరణించాడు. ఈ ఘటన త్రిశూర్ జిల్లాలోని మనలూర్ వద్ద జరిగింది. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరుసగా వర్షాల నేపథ్యంలో కేరళలోని పర్యాటక ప్రాంతాల్లో అధికారులు పలు ఆంక్షలు విధించారు. పర్వత ప్రాంతాల్లోకి ట్రెకింగ్ నిషేధించారు. పర్యాటకులు కొండప్రాంతాల్ని వీడిరావాలని, రాత్రి ప్రయాణాలు మానుకోవాలని సూచించారు. వయనాడ్, కోజికోడ్, కాసర్‌గాడ్ ప్రాంతాల్లో పలు ఆంక్షలు కొనసాగుతున్నాయి. నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయని, అందువల్ల గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడులో వర్షాలు కురుస్తున్నట్లు ఐఎండీ తెలిపింది.



# అన్నామలై ఉద్యమానికి భారీ మద్దతు

**24 గంటల్లోనే 14 మంది భాగస్వామ్యం**

**చెన్నై, జూన్ 6:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై బీజేపీకి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. బిజెపి ఆయన రాజీనామాకు ఆమోదం తెలిపిందే. వెంటనే ఆయన "వియ్ ది లీడర్స్" పేరుతో నూతన రాజకీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రారంభించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే సుమారు 14 లక్షల మంది ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావడం గమనార్హం. గత కొంతకాలంగా పార్టీ రాష్ట్ర వ్యూహాల విషయంలో అధిష్ఠానంతో విభేదిస్తున్న అన్నామలై, చివరకు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. తన రాజీనామా లేఖను బీ జే పీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు పంపగా, ఆయన ఆమోదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల తనకు అమితమైన గౌరవం ఉందని, అయితే పార్టీని మరింత ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నామలై తన లేఖలో పేర్కొన్నారు. సింగంగా గుర్తింపు పొందిన ఆయన, 2020లో సివిల్ సర్వీసెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. రాజకీయల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే, 37 ఏళ్ల వయసులో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించారు. వియ్ ది లీడర్స్ ఉద్యమం ద్వారా తమిళనాడులో వారసత్వ, వ్యక్తిపూజ రాజకీయాలకు స్వస్తి పలికి, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని ప్రకటించారు. విద్య, ఆరోగ్యం, యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని తెలిపారు. దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల స్ఫూర్తితో ఈ ఉద్యమాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. అన్నామలైకి మద్దతుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్‌తో సహా పలువురు కీలక నేతలు కూడా బీజేపీని వీడారు. ఈ నూతన ఉద్యమం రానున్న లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా ఆవిర్భవించే అవకాశం ఉందని చెన్నైలో రాజకీయనేతలు పేర్కొంటున్నారు.

# ఇరాన్ రాడార్ కేంద్రాలపై అమెరికా దాడి

**వాషింగ్టన్, జూన్ 6:** అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అగ్రరాజ్యం.. ఇరాన్‌కు చెందిన తీరప్రాంత నిఘా రాడార్ కేంద్రాలే లక్ష్యంగా దాడులు నిర్వహించింది. హార్ముజ్‌లో నౌకల రవాణాకు ఇరాన్ డ్రోన్ దాడులు ముప్పుగా మారాయని యుఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పేర్కొంది. అందుకే తక్షణమే స్పందించాల్సి వచ్చిందని తెలిపింది. టెహ్రాన్‌కు చెందిన నాలుగు డ్రోన్‌లను కూల్చివేశామని వెల్లడించింది. దీని తర్వాత గోరుఖ్, ఖేష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. మరిన్ని దాడుల నుంచి రక్షించుకోవడానికే ఈ చర్యలు చేపట్టినట్లు సెంటకామ్ తెలిపింది. ఇరాన్ దురాక్రమణల నుంచి రక్షించుకునేందుకు తమ ప్రతిస్పందనలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ సంఘర్షణను ముగించేందుకు ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగున్నప్పటికీ.. దాడులు మాత్రం ఆగడం లేదు. కువైట్ లక్ష్యంగా దాడులు.. కువైట్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్‌లతో విరుచుకుపడింది. తమ గగనతలంపైకి దూసుకొచ్చే క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ తెలిపింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆపై బహ్రెయిన్‌లో కూడా సైరన్‌లు మోగడంతో బలగాలు అప్రమత్తయ్యాయి.



# ఓడిపోయి బాధలో ఉంటే.. లేచి నిల్చుని చప్పట్లు కొట్టమన్నారు..

## మమత మేనల్లుడిపై టిఎంసి రెబల్ నేత రితబ్రత ఆరోపణలు

**కోల్‌కతా, జూన్6:** మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై టిఎంసి రెబల్ నేత రితబ్రత బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అభిషేక్ వల్లే పార్టీలో అంతర్గత తిరుగుబాటు జరిగిందని ఆరోపించారు. మమతా బెనర్జీని తాము గౌరవిస్తున్నామని, అయితే తమపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ పెత్తనాన్ని మాత్రం అంగీకరించబోమని స్పష్టం చేశారు. పార్టీ కోసం ఏమీ చేయకపోయినా దీదీ ఆయనకు ఉన్నత స్థానాన్ని కట్టబెట్టారని విమర్శించారు. బెంగాల్ ఎన్నికల్లో టిఎంసి ఓటమి అనంతరం మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలో సమావేశం నిర్వహించారని రితబ్రత పేర్కొన్నారు. పార్టీ కోసం అభిషేక్ చేసిన కృషికిగాను నిలబడి చప్పట్లు కొట్టాలని సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలకు మమత సూచించారని రితబ్రత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో ఉన్న తమను ఈ చర్య మరింత బాధించిందని అన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేల చేత సంతకాలు తీసుకున్నారని హాజరు కాని వారి పేర్లను అధికారిక రికార్డుల్లో రాసుకున్నారని ఆరోపించారు.


టిఎంసిలో అవినీతి బాగా పెరిగిపోయిందని దానిని ప్రక్షాళించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ప్రస్తుతం 61 మంది ఎమ్మెల్యేలు తమతో ఉన్నారని, రాబోయే రోజుల్లో మరికొంతమంది తమతో పాటు కలిసే అవకాశం ఉందన్నారు.కాగా టిఎంసి పార్టీలోని చాలా మంది నాయకులు అభిషేక్ బెనర్జీ పనితీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.

శుభేందు అధికారి సహా పలు నేతలు పార్టీని వీడి వెళ్లడానికి కూడా అభిషేక్ వైఖరే కారణమన్న ఆరోపణలూ ఉన్నాయి. మమత కష్టపడి క్షేత్రస్థాయి నుంచి పార్టీని నిర్మిస్తే అభిషేక్ తృణమూల్‌ను ఐపాక్ లాంటి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టారని పలువురు నేతలు బహిరంగంగానే విమర్శలు చేశారు.

పార్టీ ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఆయనేనని నిందిస్తున్నారు.

ఈ నేపథ్యంలో మేనల్లుడి విషయంలో దీదీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

# ఎడారిలో ఘోరం.. నీరు దొరకక 49 మంది మృత్యువాత



**నియామెయి, జూన్ 6:** పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడాదిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తోపాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజులపాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడి నుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు.

విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టం లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలస వెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేకమంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తు చేసుకున్నారు.

# సమితిలో మళ్లీ జమ్ముకాశ్మీర్ ప్రస్తావన తెచ్చిన పాక్



**న్యూయార్కు, జూన్ 6:** పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా ఐక్యరాజ్యసమితి లో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని తీవ్రంగా స్పందించారు. జమ్ముకశ్మీర్‌కేంద్రపాలిత ప్రాంత భాగం భారత్‌లో అంతర్భాగమని, ఎప్పటికీ విడదీయలేనిదని అన్నారు. దీనికి విరుద్ధంగా చేసే వాదనలకు చారిత్రక ఆధారాలు లేవని చెప్పారు. పాకిస్థాన్ చేస్తున్న నిరాధార వాదనలు ఈ వాస్తవాన్ని మార్చలేవని అన్నారు.

ఐక్యరాజ్యసమితి వేదికలను పాకిస్థాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు.



# ఆస్ట్రేలియాలోలక్షకు పైగా బొద్దింకలు స్వాధీనం!

**న్యూసౌత్‌వేల్స్, జూన్ 6:** ఆస్ట్రేలియాలో నిర్వహించిన ఒక భారీ ఆపరేషన్‌లో లక్షకు పైగా అక్రమ బొద్దింకలను స్వాధీనం చేసుకున్నారు. దేశంలోకి దిగుమతి చేసుకోవడం లేదా పెంచడంపై నిషేధం ఉన్న ఈ బొద్దింకలను ఒకే బ్రీడర్ నుంచి పట్టుకోవడం సంచలనం సృష్టిస్తోంది. దేశ చరిత్రలో వెన్నెముక లేని జీవులకు సంబంధించి ఇదే అతిపెద్ద ఆపరేషన్ అధికారులు వెల్లడించారు. న్యూసౌత్ వేల్స్ రాష్ట్రంలోని బాథర్స్ నగరంలో మే నెలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక కమర్షియల్ బ్రీడర్ వద్ద జరిపిన సోదాల్లో మడగాస్కర్ హిస్సింగ్, దూబియా జాతులకు చెందిన లక్షకు పైగా బొద్దింకలను గుర్తించినట్లు ఆస్ట్రేలియా పర్యావరణ విభాగం తెలిపింది. వీటి విలువ సుమారు రెండులక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1.35 కోట్లు) ఉంటుందని అంచనా. ఈ మడగాస్కర్ బొద్దింకలు ప్రపంచంలోనే అతిపెద్ద జాతులలో ఒకటి. ఇవి 5 నుంచి 8 సెంటీమీటర్ల పొడవు ఉంటాయి. సాధారణ ఆస్ట్రేలియన్ బొద్దింకల కన్నా ఇవి చాలా పెద్దవి. స్థానికంగా పాములను పట్టే స్టెఫానీ లెస్సర్ మాట్లాడుతూ, పెంపుడు సరీసృపాలకు తక్కువ ఖర్చుతో కూడిన ఆహారం అందించేందుకు ఈ పెద్ద బొద్దింకలను అమ్ముతున్నారని అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాలో కఠినమైన బయోసెక్యూరిటీ నిబంధనలు అమల్లో ఉన్నాయి. దేశీయ వృక్ష, జంతుజాలాన్ని కాపాడేందుకు ఇలాంటి విదేశీ జీవులను పెంచడం, అమ్మడం చట్టవిరుద్ధం. విదేశీ బొద్దింకలు పర్యావరణానికి ప్రమాదకరం కావచ్చని, స్థానిక జీవవైవిధ్యానికి హాని కలిగించడంతో పాటు వ్యాధులను వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## సంక్షిప్తంగా..

### ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న లారీ: 9 మంది మృతి




**చండీగఢ్, జూన్ 6:** మరణించిన వృద్ధురాలి అంత్యక్రియలకు హాజరైన 28 మంది ట్రాక్టర్ ట్రాలీలో తిరుగుప్రయాణమయ్యారు. ఆ ట్రాక్టర్ ట్రాలీని ఒక లారీ ఢీకొట్టగా 9 మంది మరణించారు. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో ఈ దుర్ఘటన జరిగింది. జలాలాబాద్‌కు చెందిన ఒక వృద్ధురాలు మరణించడంతో ఆమె కుటుంబసభ్యులు, బంధువులతో సహా సుమారు 28 మంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ట్రాక్టర్ ట్రాలీలో తిరుగుపయనమయ్యారు. కాగా, శనివారం తెల్లవారుజామున ఫిరోజ్‌పూర్-ఫాజిల్కా రహదారిపై ఆ ట్రాక్టర్ ట్రాలీని ఒక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పురుషులు, ఒక మహిళసహా నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. చికిత్స పొందుతూ మరో ఐదుగురు చనిపోయారు. మరోవైపు గాయపడిన మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడిన కొందరిని మెరుగైన చికిత్స కోసం ఫరీద్‌కోట్‌లోని ప్రత్యేక వైద్య కేంద్రానికి తరలించారు.

### చెస్ ప్లేయర్ ప్రజ్ఞానందకు ప్రధాని మోడీ అభినందనలు



**న్యూఢిల్లీ, జూన్ 6:** ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నీ టైటిల్‌ను గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా 20 ఏళ్ల ప్రజ్ఞానంద ఘనత సాధించడంపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. అతడి ప్రతిభకు ఇదో కీలక మైలురాయి అంటూ ప్రశంసించారు. ప్రజ్ఞానంద భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ సైతం యువ గ్రాండ్ మాస్టర్‌ను అభినందించారు. ఈ అద్భుతమైన విజయం అతని అసాధారణ ప్రతిభకు, అచంచలమైన అంకితభావానికి, ఏళ్ల తరబడి చేసిన కృషికి నిదర్శనమన్నారు. ప్రపంచ వేదికపై అత్యుత్తమమైన ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేశాడని ప్రశంసించారు.

### వంటమనిషి నిర్లక్ష్యం వల్లే ఢిల్లీ హోటల్లో అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ, జూన్6:** దేశ రాజధాని ఢిల్లీలో స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 21 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే హోటల్‌లో పనిచేస్తున్న కుక్ కేశవ్‌నేగిని తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే హోటల్‌లో పనిచేస్తున్న కుక్ కేశవ్‌నేగిని తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. వంట మనిషి నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదం సంభవించిందని తెలుస్తోంది. వంటగదిలో ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయగానే అది పేలిపోయిందని కుక్ మీడియాతో పేర్కొన్నారు. ఆ తర్వాత హోటల్ మెయిన్ పవర్‌ను ఆఫ్ చేసి తనను తాను రక్షించుకునేందుకు బయటకు పరుగులు తీసినట్లు వెల్లడించాడు.


### లాలూప్రసాద్‌యాదవ్ భద్రత కుదింపు!



**పాట్నా,జూన్ 6:** బీహార్ రాజకీయాల్లో ఒక్కసారిగా తీవ్ర సంచలనం చోటుచేసుకుంది. ఆర్జేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య, మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవిలకు ఇన్నాళ్లూ ఉన్న అత్యున్నత జడ్‌ప్లస్ కేటగిరీ భద్రతను బీజేపీ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీని స్థానంలో బీహార్ స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బందిని కేటాయించింది. లాలూ కుటుంబం ఈ నిర్ణయాన్ని తీవ్రంగా నిరసించింది. తమ నివాసానికి వచ్చిన కొత్త భద్రతా సిబ్బందిని వారు లోపలికి రానివ్వకుండా వెనక్కి పంపేశారు. భద్రత ఉపసంహరణతో పాట్నాలోని లాలూ యాదవ్ నివాసం (10, సర్క్యులర్ రోడ్) వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆర్జేడీ నేతలు, కార్యకర్తలు చేతుల్లో కర్రలు పట్టుకుని లాలూ నివాసానికి స్వయంగా కాపలా కాస్తున్నారు.

# అమెరికా ఉన్నతాధికారులపై ఇజ్రాయెల్ నిఘా!

## పెంటగాన్ అంతర్గత సర్క్యులర్ జారీ



**న్యూయార్కు, జూన్ 6:** అమెరికా రక్షణ విభాగం నిఘా సంస్థ అంతర్గతంగా ఒక హెచ్చరిక నోటీసును జారీ చేసింది. ఇజ్రాయెల్ తమ దేశ ఉన్నతాధికారులపై నిఘా వేసిందన్నది దాని సారాంశం. పశ్చిమాసియా వివాదాలపై అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం తీసుకునే అంతర్గత నిర్ణయాలను దొంగిలించడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందని పెంటగాన్ అనుమానిస్తోంది. ఈక్రమంలో ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లే యూఎస్ అధికారులకు నిబంధనలను కఠినతరం చేశారు. ఉన్నత స్థాయి చర్చల కోసం వెళ్లేవాళ్లు సాధారణ ఫోన్లకు బదులుగా బర్నర్ ఫోన్లు, తాత్కాలిక కంప్యూటర్లను మాత్రమే వాడనున్నారు. హోటల్ గదుల్లో ఎలాంటి సున్నితమైన విషయాలను మాట్లాడొద్దని సూచించారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు సమాచారాన్ని సేకరించడంలో చాలా దూకుడుగా వ్యవహరిస్తాయని ఇప్పటికే పేరుంది. అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఇరాన్ యుద్ధంపై వస్తున్న విభేదాలే ఈ తాజా వివాదానికి కారణం. ఇటీవల ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత ట్రంప్ దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నారు. కానీ ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు చేయాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పట్టుబడుతున్నారు. ఇటీవల వీరిద్దరి మధ్య జరిగిన ఓ ఫోన్ సంభాషణలో ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, నెతన్యాహును పిచ్చివాడు అని సంబోధించారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ గూఢచర్య ఆరోపణలను వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం తోసిపుచ్చింది. తమపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వివరించింది. ఇజ్రాయెల్ ఎప్పుడూ అమెరికా ప్రభుత్వ అధికారులపై నిఘా పెట్టదని, తమ శత్రువులపై మాత్రమే నిఘా ఉంచుతుందని పేర్కొంది. అటు వైట్ హౌస్ కూడా ఈ వార్తలను అధికారికంగా ఖండించింది. అయినప్పటికీ ఇరుదేశాల మధ్య అంతర్గతంగా నమ్మకం దెబ్బ తినే ప్రమాదం ఉందంటున్నారు.




## మత్తుపదార్థాల రహిత జిల్లాగా తిరుపతి

### గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక దండయాత్ర

**తిరుపతి,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లోనే తిరుపతిజిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనుమానిత వ్యక్తులకు డ్రగ్స్ టెస్టులు నిర్వహించి, మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా గంజాయి ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి.

తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఈగల్ సెల్ సిబ్బంది పాల్గొని తిరుపతి నగరంలోని ఇందిరా మైదానంలో డ్రగ్స్‌పై 'దండయాత్ర' కార్యక్రమంలో భాగంగా మెగా డ్రగ్స్ టెస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులు (సస్పెక్ట్స్) నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులను ఇందిరా మైదానానికి పిలిపించి ప్రత్యేక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. వారి ప్రవర్తన, జీవన విధానం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి చట్టబద్ధమైన జీవితం గడపాలని, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు, కుటుంబ సంక్షేమం, జీవనోపాధి వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

డ్రగ్స్ టెస్టుల్లో పాజిటివ్‌గా గుర్తించిన వ్యక్తులకు చట్టపరమైన చర్యలతో పాటు కౌన్సిలింగ్ అందించి, వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972 (ఈగల్), 112కు సమాచారం అందించాలని

## స్వామి ఆశీస్సులతో విజయ్ సిఎం అయ్యారు

### తమిళనాడు సిఎం తల్లి శోభా చంద్రశేఖర్

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి కృప, ఆశీస్సులతోనే తన కుమారుడు విజయ్ తమిళనాడు సిఎం అయ్యారని, ఇదీ స్వామివారిపై ఉన్న విశ్వాసమని విజయ్ తల్లి శోభాచంద్రశేఖర్ తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో తిరుమలకు వచ్చి ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నాననన్నారు. ఆరోజే తనకుమారుడు విజయ్ రాజకీయప్రస్థానం విజయవంతం కావాలని స్వామి వారిని ప్రార్థించినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ దేవుని ఆశీస్సులతోనే తన కుమారుడు సిఎంగా బాధ్యతలు చేపట్టాడని ఆనందం వ్యక్తం చేశారు. శ్రీవారికి కృతజ్ఞతలు తెలియజేసి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. తమిళనాడు సిఎం తల్లి శోభా చంద్రశేఖర్ తనఅనుచరులతో కలసి శనివారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆమె శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతంపలికి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సేద్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ,జూన్ 6, ప్రభాతవార్తప్రతినిధి:** దూర విద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశించదల్చిన వారు ఈనెల 31వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మణి ఓ ప్రకటనలో కోరారు. జూన్ 2026 నుంచి ప్రారంభం కానున్న ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సులైన సేంద్రియ వ్యవసాయం, మిద్దెతోటలు, పుట్టగొడుగుల పెంపకం వంటి విభాగాల్లో 8వారాల పాటు నిర్వహించే ఈ సర్టి ఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందగోరే వారు రూ. 1500 చొప్పున ఫీజు చెల్లించి జూన్ 20తేదీ లోగా వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కోర్సుల పూర్తి వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్సైట్‌ద్వారా లేదా 9441355595, 7036689346, 8096085560 నెంబర్లలో ఉదయం 9నుంచి సాయంత్రం 7గంటల మధ్య ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు.



## దక్షిణ కొరియా ప్రతినిధులతో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల భేటీ

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి మరో ముందడుగు పడింది. ప్రముఖ దక్షిణ కొరియా ఫంక్షనల్ ఫుట్‌వేర్ సంస్థ షూ ఆల్స్ ప్రతినిధులతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రెండోసారి సమావేశమై కీలక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల విస్తరణ, పాదరక్షల ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై సవివరంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రివర్యులు సంస్థ ప్రతినిధులకు వివరించారు. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ పాదరక్షల సంస్థ షూఆల్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తే, అవసరమైన అన్ని అనుమతులు, మౌలిక వసతులు మరియు ప్రభుత్వ సహకారాన్ని వేగవంతంగా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడులు రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా, పారిశ్రామికాభివృద్ధికి, ఎగుమతుల వృద్ధికి మరియు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కీలకంగా దోహదపడతాయని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.



## గంజాయి తరలిస్తున్న ముఠా పట్టివేత

**నెల్లూరు, జూన్ 6, ప్రభాతవార్త-క్రైమ్:** నెల్లూరు నగరంలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, శనివారం తెల్లవారు జామున 5 నుండి 7 గంటల వరకు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా అటుగా వచ్చిన ఏపీఎస్ఆర్టీసీ బస్సును (నెం.ఏపి05జడ్5308) తనిఖీ చేయగా, అందులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీనితో వెంటనే స్పందించిన పోలీసులు, నిందితులు అనీష్ కుమార్, అమిత్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 8.798 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా, నిందితులు రాజమండ్రిలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేశామని, దీనిని తిరుపతికి తరలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నామని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో సమర్థవంతంగా పనిచేసి నిందితులను పట్టుకున్న ఎస్సై పి.రమేష్ బాబు, జేకేవీఎన్ మురళి కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఎం. కృష్ణయ్య, కానిస్టేబుల్స్ ఎస్కె రఫీ, ఎస్కె అజీజ్ బాషలను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఫైలేరియా సమస్యకు సమష్టి కృషితో చెక్

### రూ.6.18కోట్లతో పెదపెంకి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు, రోడ్లు

### అభివృద్ధిపనులపై డిప్యూటీ సిఎం పవన్ సమీక్ష

**విజయవాడ జూన్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓ చిన్న గ్రామంలో నెలకొన్న సామాజిక అంతరాల వల్ల, యావత్ గ్రామమంతా భయానక ఫైలేరియా (బోద) వ్యాధి బారినపడిన వైనం 2018లోనే నా దృష్టికి వచ్చింది. గ్రామంలోని మురుగునీరు బయటకు పారకపోవడంతో అక్కడ ప్రమాదకర వ్యాధి వ్యాపించిందని తెలుసుకొని విస్తుపోయానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. అప్పట్లోనే దీనిపై మాట్లాడాను. అయితే అధికారంలోకి వచ్చాక ఈ సమస్య మీద ప్రత్యేక దృష్టి సారించడంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించే మార్గాలని కనుగొన్నామ్మని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. యంత్రాంగం సమష్టిగా పని చేస్తే ప్రజలకు సంబంధించిన ఏ సమస్యను అయినా సానుకూలంగా, సావధానంగా ఎలా పరిష్కరించవచ్చో పార్వతీపురం మన్యం జిల్లా, పెదపెంకి గ్రామంలో చేపట్టిన సమగ్ర అభివృద్ధి ద్వారా నిరూపించామని చెప్పారు. గ్రామం మొత్తం మీద 197ఫైలేరియా (బోద) కేసులు నమోదై, జాతీయస్థాయికి వెళ్లిన సమస్యను ఓ ప్రణాళిక ప్రకారం యంత్రాంగం అధిగమించిన విధానం సర్వదా అభినందనీయమన్నారు. మొదట అభివృద్ధిని వ్యతిరేకించిన గ్రామస్థులే ఇప్పుడు ఫలితాలను చూసి ప్రభుత్వాన్ని, అధికారులను మెచ్చుకోవడం సాధారణ విషయం కాదు అన్నారు. మన్యం జిల్లా, పెదపెంకిలో భారీగా నమోదు అయిన ఫైలేరియా కేసులు, కూటమి ప్రభుత్వంలో ఆ గ్రామంపై పెట్టిన ప్రత్యేక శ్రద్ధ, సాగుతున్న పనులపై జిల్లా అధికారులతో పవన్ కళ్యాణ్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ సామాజిక అంతరాల వల్ల పెదపెంకి గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లోని మురుగు నీరు బయటకు వెళ్లకుండా ఒకే దగ్గర నిల్వ ఉండిపోయింది. ఫలితంగా క్యూలెక్స్ దోమలు అధికమై గ్రామంలోని వారంతా వ్యాధి బారినపడ్డారు. మురుగు నీరు ఒకే దగ్గర ఉండిపోవడంతో దోమలు పెరిగాయి. ఫలితంగా ఎక్కడా లేనట్లుగా ఒకే ఊరిలో అధికంగా కేసులు నమోదు అయ్యాయి. ఇది ఆరోగ్య హెచ్చరిక అయింది. పెదపెంకి గ్రామంలో వందకు పైగా ఫైలేరియా కేసులు నమోదవటం, తరచూ ప్రజలు ప్రమాదకర జ్వరాల బారిన పడుతుండటంతో పవన్ అక్కడి సమస్యలపై దృష్టి పెట్టారు. గ్రామంలో పారిశుధ్యం సరిగా లేకపోవటమే అన్ని సమస్యలకు మూలమని అధికరారులు గుర్తించారు. గ్రామంలో కొన్నిచోట్ల కాలువలు అక్రమణలకు గురయ్యాయి. అక్కడి ప్రజలతో మాట్లాడి అక్రమణలు తొలగించి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు అధికారులు పవన్‌కు వివరించారు. గ్రామస్థుల నుంచి మొదట్లో ప్రతిఘటన ఎదురైనా వారిని ఎలాగోలా ఒప్పించి ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సామాజిక సమస్యలు ఉన్నప్పటికి వాటిని అధిగమించి పనులు ముందుకు తీసుకెళ్లి అధికారులను డి.సిఎం అభినందించారు. ఈనెల 24న పెదపెంకి గ్రామానికి వచ్చి మ్యాజిక్ డ్రెయిన్ల ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తానని తెలిపారు.

## వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

### పోటెత్తిన భక్తులు

### రాబడి రూ.10,98,270లు

**రాపూరు (నెల్లూరు), జూన్ 6, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన ఐదవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకొని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, గిరిజనవాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ. 10,98,270 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.1,86,000లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయంద్వారా రూ. 27,750లు, నిత్య కళ్యాణం ద్వారా రూ, 52,500 రూపాయిలు,100 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,80,100లు,దేవస్థానం వసతిద్వారా రూ.39,300లు, తలనీలాలు 3.350 మంది సమర్పించగా తద్వారా రూ. 1,34,000లు,లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.3,36,105లు,పులిహోరా విక్రయం ద్వారా రూ.40,590లు,వాహనాల పూజల ద్వారా రూ.1,925లుచొప్పునమొత్తం రూ.10, 98, 270రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

## వెనిజులా వైస్ ప్రెసిడెంట్ డెల్సీ రోడ్రిగ్జ్‌కు ఘన స్వాగతం

**శ్రీ సత్య సాయి జిల్లా, జూన్ 6, ప్రభాతవార్త ప్రతినిధి** వెని జులా దేశ వైస్ ప్రెసిడెంట్, తాత్కాలిక ప్రధాని డెల్సీ రోడ్రిగ్జ్ శనివారం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి శ్రీ సత్య సాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా పరిపాలనా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పి అంకిత, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మెనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఇతర ఉన్నతాధికారులు వెనిజులా వైస్ ప్రెసిడెంట్‌కు పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆమెను పుష్పగుచ్ఛలు, శాలువతో సన్మానించి సత్కరించారు. సత్య సాయి బాబా చిత్రపటంతోపాటు ధర్మవరం పట్టుచీరను ప్రత్యేకంగా బహూకరించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కుమారుడు వియన్, కుమార్తె వన్స్ లు వెనిజుల తాత్కాలిక ప్రధానిని కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వఅధికారులు తదితరులు పాల్గొన్నారు.




వెనిజులా తాత్కాలిక ప్రధాని డెల్సీ రోడ్రిగ్స్‌కు పట్టుచీర బహూకరిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

## వైద్యులు అంకితభావంతో సేవలందించాలి

### ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 6వ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పిలుపు

### 188 మంది ఎంబిబిఎస్ విద్యార్థులకు పట్టాల ప్రదానం

**విశాఖపట్నం, జూన్ 6 ప్రభాతవార్త:** వైద్య విద్య అనేది డిగ్రీతో ముగిసే ప్రక్రియ కాదని, జీవితాంతం నేర్చుకుంటూ సమాజానికి అంకిత భావంతో సేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. భీమునిపట్నం మండలం సంగివలసలోని ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎన్ఆర్ఐఎంఎస్)లో శుక్రవారం నిర్వహించిన 6వ ఎంబీబీఎస్ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 188 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దేశంలో జీవనశైలి వ్యాధులు, అంటువ్యాధులు కాని వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లపై వైద్యులు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆరోగ్య సేవల అంతరాలను తగ్గించేందుకు డిజిటల్ హెల్త్ కార్యక్రమాలు, ఆధునిక వైద్య సాంకేతికతలు దోహదపడతాయని పేర్కొన్నారు. రోబోటిక్ సర్జరీ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని, యువ వైద్యులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వైద్య విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తల్లిదండ్రులు, అధ్యాపకులు అర్థం చేసుకుని వారికి అండగా నిలవాలని సూచించారు. ఎన్ఆర్ఐ విద్యాసంస్థల చైర్మన్ పి. సుధారెడ్డి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలోని అనిల్ నీరుకొండ ఆసుపత్రి అత్యాధునిక సౌకర్యాలతో ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, యాజమాన్య సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



పట్టాలు పొందిన విద్యార్థులతో గవర్నర్ నజీర్, తదితరులు

## ఘనంగా ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు ప్రారంభం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 6,ప్రభాతవార్త:** ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రారంభమయ్యాయి. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం జి.జి.యులో జరిగిన సభలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ కె.వి.వి. సత్యనారాయణ రాజు (చైతన్య రాజు), ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మన మాతృ భాషను మనమే కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను అనుసరిస్తారని, అందువల్ల మాతృభాష పరిరక్షణలో తల్లిదండ్రులు ముందుండాలని సూచించారు. తెలుగు భాష మాధుర్యాన్ని, గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం గత మూడు సంవత్సరాలుగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నామని, అమలాపురంలో జరిగిన మూడవ మహాసభలో తీసుకున్న తీర్మానాలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. అలాగే జి.జి.యులో ఇంజనీరింగ్ విద్యలో తెలుగును ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.

తెలుగు భాష మన సాంస్కృతికి సాంప్రదాయాలకు జాతి ఆత్మకు ప్రతీక అని ఆయన అన్నారు. భాష బ్రతికితేనే సంస్కృతి బ్రతుకుతుందని సాహిత్యం కళల వల్లే సమాజం చైతన్యవంతం అవుతుందని తెలుగు సాహిత్య చైతన్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పే ఈ మహాసభలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చైతన్య రాజు అన్నారు. తెలుగు భాషా గౌరవాలను ప్రపంచ స్థాయిలో నిలబెట్టడం ప్రతి తెలుగు వారి బాధ్యత అని ఆయన అన్నారు. శ్రీశ్రీ కళా వేదిక సీఈవో కత్తి మండ ప్రతాప్, మాట్లాడుతూ ప్రాచీన కవులు, కళాకారుల సాహిత్యాన్ని యువతరానికి అందించడం సాహిత్య సంస్థల బాధ్యత అని తెలిపారు. ఈ రెండు రోజుల మహాసభలు తెలుగు చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలుస్తాయని పేర్కొన్నారు. కమాండెంట్, కొండా నరసింహా రావు, మాజీ ఎమ్మెల్సీ, ఆదిరెడ్డి అప్పారావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. శ్రీనివాస రావు, గన్ని కృష్ణ, వెంకట్ ఆళ్ల, చప్పిడి రాజశేఖర్, ఎర్రప్రగడ రామకృష్ణ, జి.ఈశ్వర భూషణం, టీ.పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కొండా నరసింహారావు దంపతులు శంఖానాదంతో సభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే పలువురు రచయితల పుస్తకాలను విడుదల చేశారు. గిరిజన నృత్యం, కూచిపూడి, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు అమెరికా నుంచి కూడా ప్రతినిధులు పాల్గొన్నారు.





మద్యం బాటిళ్ళను తీసుకెళ్తున్న స్థానికులు

## వ్యాన్ బోల్తా

### రోడ్డు పాలైన రూ.12 లక్షల మద్యం

### బాటిళ్లను పట్టుకుపోయిన ప్రజలు

**శ్రీరంగరాజపురం, జూన్ 6 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండల పరిధిలో చిత్తూరు-పుత్తూరు రహదారిలో బసివిరెడ్డిపల్లి షికారీ కాలనీ వద్ద శుక్రవారం రాత్రి మద్యం తీసుకెళ్తున్న వ్యాను బోల్తా పడింది. ఒక్కసారిగా అదుపు తప్పి మద్యం వాహనం బోల్తా పడటంతో వాహనంలో వున్న మద్యం బాక్సులు రోడ్డు మీద పడ్డాయి. మద్యం బాక్కులు రోడ్డుపై పడటంతో ఒక్కసారిగా ప్రజలు మద్యం బాటిళ్ళ కోసం ఎగబడ్డారు. దొరిగిన మద్యం బాటిళ్ళను దొరికి నట్లు తీసుకెళ్ళి పోయారు. ఈ ఘటనలో సుమారు రూ.12 లక్షలు విలువైన మద్యం సరుకు నష్టం జరిగిందని ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ వెల్లడించారు. పుతలపట్టు మండలం బండపల్లి వద్ద వున్న మద్యం డిపో నుండి కార్వేటినగరం మండలం కొల్లాగుంట గ్రామం వద్ద వున్న మద్యం షాపుకు మద్య తీసుకెళ్తూ వాహనం ఎస్ఆర్ పురం మండల పరిధిలో బసివిరెడ్డిపల్లి షికారీ కాలనీకి సమీపంలో బోల్తా పడింది. వాహనం బోల్తా పడటంతో వాహనంలో వున్న మద్యం మొత్తం నేలపాలైంది. మద్యం బాక్కులు ఒక్కసారిగా రోడ్డుపై పడటంతో కొన్ని బాక్కులు చినిగిపోయాయి. చినిగిపోయిన బాక్సుల నుండి మద్యం బాటిళ్ళు కన్పించడంతో అప్పటి వరకు ఎదో వాహనం బోల్తా పడిందని పట్టించుకోలని స్థానికులు మద్యం వాహనం బోల్తా పడిందని తెలియడంతో ఒక్కసారిగా పోటెత్తారు. మద్యం వాహనం నుండి సుమారు రూ.4 లక్షల మద్యం వరకు పూర్తి స్థాయిలో స్థానికులు పట్టుకెళ్ళినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి నుంచి దుర్గమ్మవారి ఆలయంలో యోగా శిక్షణ

**ఇంద్రకీలాద్రి, జూన్ 6, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం నుండి 14 రోజుల పాటు జరిగే యోగా శిక్షణా తరగతులకు ఆలయ పరిపాలనా విభాగం, ఉద్యోగులు తప్పకుండా హాజరవ్వాలని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్, సభ్యులకు సమాచారం తెలిపి వారు పాల్గొనటానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈయోగా శిక్షణకోసం నిపుణులచే శాస్త్రీయపద్ధతిలో యోగాసనాలు, ప్రాణాయామం వంటివి ఉదయం 7 నుండి 8 వరకు మహా మండపం 6వ అంతస్తులో నేర్పించనున్నామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాదం అందిస్తామన్నారు.

## మత్స్యకారుల సమస్యలపై తక్షణమే స్పందించిన విపిఆర్



**నెల్లూరు, జూన్ 6, ప్రభాతవార్త - వైద్యం :** కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం, చాకిచెర్ల పరిధిలోని పెద్దపట్టపుపాళెం గ్రామానికి చెందిన మత్స్యకార సంఘ నూతన పెద్ద కాపులు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న కొన్ని కీలక సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దపట్టపుపాళెం గ్రామ మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం నిత్యం గ్రామ సమీపంలోని సముద్రంలోకి వెళ్లాల్సి ఉంటుందని, అయితే, మార్గమధ్యంలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతిందని పెద్ద కాపులు ఎంపీ గారికి వివరించారు.

దీనిపై తక్షణమే స్పందించిన ఎంపీ గారు, మత్స్యకారుల ప్రయోజనాల దృష్ట్యా తన సొంత నిధులతో ఆ బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా గ్రామంలోని ప్రధాన వీధికి సీసీ రోడ్డును మంజూరు చేస్తానని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు.

## మరో ఐదు సంఘాలకు ఒడి సౌకర్యం

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:**రాష్ట్రంలో మరో ఐదు సంఘాలకు అదర్ డ్యూటీ(ఓడీ) సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జెఎస్‌సీ)లో రొటేషన్ బేసిస్‌లో సభ్యత్వం ఉన్న సంఘాల అధ్యక్షులకు 2026 సంవత్సరానికి అదర్ డ్యూటీ(ఓడీ) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (రాష్ట్ర స్థాయి) లో సభ్యుల అధ్యక్షులకు రొటేషన్ పద్ధతిలో 2026 క్యాలెండర్ సంవత్సరానికి అదర్ డ్యూటీ(ఓడీ) సౌకర్యం కల్పిస్తూ సాధారణ పరిపాలన (సేవలు, సంక్షేమం) శాఖ జి.ఓ.ఆర్.టి.నెం.799ను జారీ చేసింది. గుర్తింపు లభించే వరకు, తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (రాష్ట్ర స్థాయి)లో 2026 క్యాలెండర్ సంవత్సరానికి 5 సంఘాల అధ్యక్షులకు రొటేషన్ పద్ధతిలో ఓడీ సౌకర్యాన్ని కల్పించారు. అందులో డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్ల సంఘం (టిజిటిఏ), తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియుఎస్), పాఠశాల ఉపాధ్యాయుల సమాఖ్య (ఎస్‌టిఎఫ్), ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం(జిజెఎల్ఏ) సంఘాలకు ఓడీ సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## మంత్రుల ప్రాంగణ సముదాయం వద్ద

## పిడిఎస్‌యు ఆందోళన

### మంత్రి తుమ్మల కారును అడ్డగించిన విద్యార్థులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 6, ప్రభాతవార్త:** పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ బంజారాహిల్స్‌లోని మంత్రుల ప్రాంగణ సముదాయం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలోనే అటుగా వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కారును అడ్డగించడం తో ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఫీజుల వ్యవహారంలో పీడీఎస్‌యూ మంత్రుల ప్రాంగణ సముదాయ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే బంజారాహిల్స్ పోలీసులు ముందస్తుగా ఇక్కడ పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి అనీల్ ఆధ్వర్యంలో దాదాపు 40 మందికి ఇక్కడికి చేరుకొని ముట్టడికి యత్నించారు. పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో సముదాయం నుంచి బయటకు వస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కారును అడ్డుకొనేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే పీడీఎస్‌యూ విద్యార్థులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అనీల్‌తోపాటు మరో 38 మందిని అరెస్ట్ చేసి ఫిల్మ్‌నగర్, ఎస్సార్‌నగర్ ఠాణాలకు తరలించారు.



బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌తో సమావేశమైన ఎంపి ఆర్.కృష్ణయ్య

## లోపభూయిష్టమైన రోస్టర్ విధానాన్ని సవరించాలి

### జాతీయ బి.సి. సంక్షేమ సంఘం

### బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌తో బి.సి. నాయకుల చర్చలు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన ఉద్యోగ నియామకాల కోసం ప్రవేశపెట్టిన కొత్త రోస్టర్ విధానం లోపభూయిష్టంగా, అశాస్త్రీయంగా ఉందని, దీనివల్ల వెనుకబడిన తరగతుల (బి.సి) అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ బి.సి. సంక్షేమ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై శనివారం జాతీయ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బి.సి. నాయకుల ప్రతినిధి బృందం బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌ను కలిసి సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ పోస్టులను భర్తీ చేసేటప్పుడు మొదటి 10 పోస్టుల వరకు కేటాయించే రోస్టర్ పాయింట్ల ఫిక్సేషన్ విధానం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. నిబంధనల ప్రకారం బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, మహిళలకు 33 శాతం సమాంతర రిజర్వేషన్లు ఉన్నప్పటికీ.. గ్రూప్1, గ్రూప్2 పోస్టులలో డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ కోటా జోనల్, జిల్లా కేటగిరిలలో విభజించినప్పుడు పోస్టుల సంఖ్య తగ్గిపోతోందని, తద్వారా ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల బీసీలకు దక్కాల్సిన పోస్టులు దక్కడం లేదని పేర్కొన్నారు. రోస్టర్ 1 నుండి 10 వరకు ఫిక్స్ చేసిన విధానంలో 10 పోస్టులు ఉన్నప్పుడు బీసీలకు 3 పోస్టులు రావాల్సి ఉండగా, కేవలం 2 పోస్టులు మాత్రమే వస్తున్నాయని, చివరన 80 నుండి 100 రోస్టర్ పాయింట్లలో బీసీలకు 4 పోస్టులు ఇచ్చి బ్యాలెన్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానంలో ఎలాంటి శాస్త్రీయ బద్ధత లేదని, దీనివల్ల దాదాపు 20 పోస్టుల వరకు బీసీలు నష్టపోయారని, వాటిపై విచారణ జరిపి బ్యాక్‌లాగ్ పోస్టులుగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్, ఎస్సీ/ఎస్టీ కమిషన్ ఛైర్మన్లతో తక్షణమే ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి, లోపాలను సరిదిద్ది నూతన రోస్టర్‌ను తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు.బి.సి. నాయకుల విజ్ఞప్తిపై బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ సానుకూలంగా స్పందించారు.

## ఆర్టీసీలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

### యాజమాన్యం వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి.. ఎండికి ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టీసీ)లో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని టిఎస్ఆర్‌టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్ చేసింది. సమస్య పరిష్కారం కోసం ఆర్‌టీసీ యాజమాన్యం వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌టీసీ ఎండీకి వారు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 22 నుండి 24 వరకు జరిగిన సమ్మె అనంతరం ప్రభుత్వం, యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య కుదిరిన అంగీకారాలను అమలు చేసే దిశగా చర్చలు జరపాలని వీరాంజనేయులు, వి.ఎస్.రావులు డిమాండ్ చేశారు. సమ్మె విరమణ సందర్భంగా కార్మిక సంఘాలు సమర్పించిన వినతిపత్రాలలోని అంశాలను పరిశీలించేందుకు ఆర్‌టీసీ యాజమాన్యం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీతో మే 21న జరిగిన సమావేశంలో కొన్ని అంశాలపై సానుకూల చర్చలు జరిగి, కొన్నింటిపై అంగీకారం కూడా కుదిరిందన్నారు. తదుపరి సమావేశాలు నిర్వహించకుండా ఆలస్యం జరుగుతున్నందున కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. సమ్మె విరమించి ఆరు వారాలు గడుస్తున్నప్పటికీ, అంగీకరించిన అంశాల అమలుపై స్పష్టమైన పురోగతి కనిపించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం ఇచ్చిన హామీలను గౌరవిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే చర్చలు ప్రారంభించి నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగీకరించిన అంశాల అమలులో జాప్యం కొనసాగితే కార్మికుల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని, ఇది సంస్థకు కూడా మంచిది కాదని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సంస్థ అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించేందుకు యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

### త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా

# సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం



### ఏర్పాట్లను సమీక్షించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించనున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ నేపథ్యంలో సనత్‌నగర్‌లో నిర్మించిన అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి శనివారం పరిశీలించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ హాస్పిటల్‌ను ప్రజలకు అంకితం చేయనున్న నేపథ్యంలో హాస్పిటల్ సంసిద్ధతపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. హాస్పిటల్‌లోని ఏ, బి, సి బ్లాకులను మంత్రి పరిశీలించారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డయాగ్నస్టిక్స్, ల్యాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, మెకనైజ్డ్ ల్యాండ్రీ, సెంట్రలైజ్డ్ కిచెన్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు, వైద్య సేవల నిర్వహణ వ్యవస్థలను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్పిటల్ ప్రారంభానికి ముందు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్యం, సెక్యూరిటీ, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను అత్యున్నత ప్రమాణాలతో సిద్ధం చేయాలని సూచించారు.ఓపీ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్కులు, ఫార్మసీ సేవలు, వెయిటింగ్ ఏరియాలను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ఈ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించగల అత్యుత్తమ వైద్య సంస్థగా టిమ్స్ నిలవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వహణ, వైద్య సేవలు, మానవ వనరులు, నాన్ మెడికల్ సర్వీసులు, భద్రత, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చేసిన అప్పుల వడ్డీలకు ప్రభుత్వ ఆదాయం చెల్లు

### నెలకు రూ.6500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం

### బిజెపితో బిఆర్ఎస్ కలవడాన్ని చంద్రబాబు ఒప్పుకోవడంలేదు: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** కెసిఆర్ హయాంలో చేసిన అప్పులకు కూడా డిప్యూటీ సిఎం భట్టి బాధపడుతున్నారనీ నెలకు రూ 6,500 కోట్లను అప్పుల మీద వడ్డీలకు చెల్లిస్తున్నామనీ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఆవేదన చెందారు. సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ చేసిన అప్పులు చెప్పుకోడానికి మోహం లేకనే కెసిఆర్ బయటకు రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకున్నాడనీ విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవుతోందనీ, సొంత ఇంట్లో నుంచి కవిత బయటకు వెళ్లి పార్టీ పెట్టుకుందన్నారు. హరీశ్‌రావు బిజెపి వైపు చేస్తున్నాడనీ ముఖ్యమంత్రి కావాలని ఆయనకు కూడా ఉందని అన్నారు. తానే తరవాత ముఖ్యమంత్రిని అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారం చేయించుకుంటున్నాడనీ, కెటిఆర్ కూడా ముఖ్యమంత్రి అని తన అనుచరులతో అరిపించుకుంటున్నాడనీ చెప్పారు. కెసిఆర్ పోవాలి, మళ్లీ కాంగ్రెస్ రావాలని జనం కోరుకుంటున్నారనీ ఆయన వివరించారు. కెసిఆర్‌ను గతంలో పవన్ కల్యాణ్ చాలాసార్లు పొగిడాడనీ అన్నారు.

మేం ఎన్టీఆర్ విగ్రహం పెడితే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శలు చేస్తున్నాడనీ కెటిఆర్ ఎన్టీఆర్ విగ్రహం పెట్టినప్పుడు ఎందుకు మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు ఒప్పుకుంటే బిఆర్ఎస్‌తో బిజెపి కలుస్తాం అంటున్నారనీ బిజెపితో కలవడానికి చంద్ర బాబు ఒప్పుకోకపోవడం వల్లనే చంద్రబాబును బిఆర్ఎస్ టార్గెట్ చేస్తోందనీ తెలిపారు.. తెలంగాణ సెంటిమెంట్ ఇప్పుడులేదు చంద్రబాబును రేవంత్ రెడ్డికి అంటగట్టాలని చూస్తే ఉపయోగం లేదనీ అన్నారు. దేశవ్యాప్తంగా రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తోందని అన్నారు. కెసిఆర్ కుటుంబం కోసం 30 బుల్లెట్ ప్రూఫ్‌కార్లు తయారు చేయించారనీ రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లడంపైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్కసు వెళ్లగక్కుతున్నాడనీ ఆవేదన చెందారు. పాలమూరు రంగారెడ్డి కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సర్వే నిర్వహించారనీ తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి తన భద్రతను కూడా పక్కన పెట్టారనీ, మూడు వెహికిల్స్ కాన్వాయ్ లో ప్రయాణం చేస్తున్నారనీ తెలిపారు. సింగరేణి బొగ్గు నిల్వలపై హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలనీ కోరారు. బిఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులను అణిచివేశారనీ పదవి పోగానే ఆర్టీసీ, సింగరేణి , కాళేశ్వరం గుర్తుకు వస్తున్నాయనీ ఎద్దేవా చేశారు.

# ఇసుక ఆదాయాన్ని పెంచాలి

### అక్రమ తవ్వకాలు, రవాణాపై పటిష్ట నిఘా ఉండాలి

### టిజిఎండిసి అధికారులతో మంత్రి వివేక్ వెంకటస్వామి సమీక్ష సమావేశం

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇసుక ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఇసుక తవ్వకాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక లభ్యత, ఆదాయం, ఆదాయ వృద్ధికి ఉన్న అవకాశాలు, నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, వ్యవస్థలో తీసుకురావాల్సిన మెరుగుదలలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.అన్ని కార్యకలాపాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. లారీల కదలికలను నిరంతరం పర్యవేక్షించే బలమైన నిఘా వ్యవస్థ ద్వారా అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. టిజిఎండిసి డైరెక్టర్ అనుదీప్ దురిశెట్టి శాఖ చేపడుతున్న ఆదాయ వృద్ధి చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం, అక్రమ మైనింగ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి మంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో శాఖ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా ఆయన వివరించారు.రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కీలక ఖనిజాలు, ఇతర ఖనిజాల అన్వేషణకు సంబంధించి కొనసాగుతున్న కార్యక్రమాలపై అధికారులు మంత్రికి నివేదిక సమర్పించారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రాధాన్యత గల అంశాలపై సమగ్ర నివేదికలను అందజేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.అలాగే సాండ్ బజార్ల పనితీరు, శాఖ నిఘా వ్యవస్థ, సిబ్బంది అవసరాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఖనిజ వనరుల సమర్థ నిర్వహణ కోసం అమలు వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతోపాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచాలని అధికారులకు

## రాకముందే తెరుచుకున్న లిఫ్టు డోరు!

### మహిళ మృతి, మనవడి పరిస్థితి విషమం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 6, ప్రభాతవార్త:** ఖైరతాబాద్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో లిఫ్టు రాకముందే డోరు తెరుచుకోవడంతో గమనించిన ఒక మహిళ కాలు వేసి ప్రాణాలు కోల్పోగా ఆమె మనవడు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఇది. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. ఆనంద్‌నగర్ కాలనీలోని భవానీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న విశాఖపట్నంకు చెందిన కె. రాధ(57) శుక్రవారం సాయంత్రం తన 15 నెలల మనవడు జాయ్‌ని ఎత్తుకొని కిందకు వెళ్లేందుకు లిఫ్టు వద్దకు వెళ్లారు. లిఫ్టు నాల్గో అంతస్థులోనే ఉందని భావించిన రాధ లిఫ్టు డోరు తీయగా అది రావడంతో లిఫ్టు ఉందని భావించిన ఆమె లోపలికి కాలు పెట్టింది. ఒక్కసారిగా మనవడితోపాటు నేరుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్టుపై పడిపోయారు.

విషయం తెలుసుకున్న అగ్నిమాపక, డీఆర్ఎఫ్, ఖైరతాబాద్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. వారిని బయటకు తీసి రాధను నిమ్స్ ఆసుపత్రికి జాయ్‌ను కేర్ ఆసుపత్రికి తరలించారు. కాగా రాధ మృతిచెందినట్లు నిమ్స్ వైద్యులు ధృవీకరించారు. జాయ్‌కు తీవ్ర గాయలవ్వగా ఆసుపత్రిలో చికిత్సనందిస్తున్నారు. ఇదిలా ఉండగా లిఫ్టులో పడే సమయంలో మనవడి ప్రాణాలను కాపాడేందుకు ఆమె తన చేతులతో గట్టిగా పట్టుకొన్నట్లు గుర్తించామని వారిని లిఫ్టు గుంతలో నుంచి తీసిన అధికారులు తెలిపారు.



## యువత నైపుణ్యాభివృద్ధికి న్యాక్ సేవలు భేష్

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌కు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** యువతలో నైపుణ్యాభివృద్ధికి న్యాక్ అధికారగణం చేస్తున్న కృషి సంతృప్తి ఫలితాలు ఇవ్వడమే కాకుండా వారికి అత్యధిక వేతనాలు లభించే విధంగా తోడ్పడుతున్నదని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యా దపూర్వకంగా కలిసి ఆర్‌అండ్‌బి ఇంజినీర్లు విజయాలను పంచుకున్నారు. ఆర్ అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌కు నిర్మాణ రంగంలో 'ఉత్తమ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం' విభాగంలో ప్రతిష్ఠాత్మక ప్లాటినం అవార్డు లభించిన సందర్భంగా అధికారులను ప్రశంసించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాక్ డైరెక్టర్ జనరల్, సిఇ ఆర్‌అండ్‌బి క్యాసి ఎం. శ్రీనివాసరెడ్డికి ఐఎస్‌డిఏ ఇన్‌ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ లో ప్రభుత్వం సేవలో ఆర్ అండ్ బివిభాగంలో అత్యుత్తమ ప్రదర్శనకు గోల్డ్ అవార్డు రావడం గొప్పగా ఉందని అన్నారు..ఎన్ ఏసి బృందాన్ని, ఎం. శ్రీనివాస రెడ్డిని అభినందిస్తూ, నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, నాణ్యమైన శిక్షణ కార్యక్రమాల అమలులో ఎన్ ఎం సి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంలో న్యాక్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. 2025-26 సంవత్సరంలో 21,016 మందికి వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని దీనితో వారికి మంచి వేతనాలు వస్తోందని మంత్రి అన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర యువతకు మరింత మెరుగైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా న్యాక్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.న్యూఢిల్లీలో జూన్ 5న ప్రదానం చేసిన ఈ అవార్డులు తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి రంగానికి దక్కిన గౌరవంగా మంత్రి పేర్కొన్నారు.

## మర్పల్లిలో హోటల్ భవనం పైకప్పు కూలి నలుగురికి గాయాలు

### విచారం వ్యక్తం చేసిన మంత్రి రాజనర్సింహ

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** మర్పల్లిలో హోటల్ భవనం పైకప్పు కూలి నలుగురు గాయపడిన ఘటనపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న హోటల్ భవనం పైకప్పు కూలి నలుగురు గాయపడిన ఘటనలో క్షతగాత్రులను సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు స్థానిక ప్రవేట్ ఆసుపత్రికి వెళ్లగా, మిగిలిన ఇద్దరు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితిపై డిఎంహెచ్‌వోను అడిగి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాశనమవుతోన్న విద్యావ్యవస్థ

### రూ.14వేల కోట్లు విడుదల కావాల్సి ఉంది

### ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరక్షయ్యంతో విద్యావ్యవస్థ నాశనమవుతుందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి మండిపడ్డారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఇప్పటివరకు విడుదల చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా, గత ప్రభుత్వానికి సంబంధించిన రెండు సంవత్సరాల బకాయిలు, ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించిన మూడు సంవత్సరాల బకాయిలు కలిపి 2022-23, 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించిన సుమారు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటికీ విద్యార్థులకు విడుదల కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నా, గత ప్రభుత్వానికి సంబంధించిన రెండు సంవత్సరాల బకాయిలు, ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించిన మూడు సంవత్సరాల బకాయిలు కలిపి 2022-23, 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించి సుమారు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సిన అవసరం ఉంది. కానీ గత మూడు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదన్నారు. పేద విద్యార్థులు చదువుకోవడం సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి పెట్టుబడి. బియ్యం, గ్యాస్, ఇతర సంక్షేమ పథకాలు ఒకరోజు ప్రయోజనం ఇస్తాయి, కానీ విద్యపై పెట్టుబడి పెడితే ఆ విద్యార్థి భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదుగుతాడు. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో అనేక ఇంటర్మీడియట్, డిగ్రీ, ఉన్నత విద్యా కళాశాలలు సగానికి సగం మూతపడే పరిస్థితి వచ్చిందని, డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయన్నారు. రాబోయే 10-15 రోజుల్లో ప్రభుత్వం ఫీ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం ఉధృతమయ్యే అవకాశం ఉంది. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మోడీ ప్రభుత్వ అసమర్థతతోనే నీట్-2026 పేపర్ లీక్

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలి

### ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి దినేష్ సి రంగరాజ్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:**కేంద్రంలో కొనసాగుతున్న నరేంద్రమోడీ ప్రభుత్వ అసమర్థతతోనే నీట్-2026 పేపర్ లీకేజీ అయిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సి రంగరాజ్ విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం నీట్, సిబిఎస్ఈ పేపర్ లీకేజి ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సి రంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్ లు మాట్లాడుతూ.. మే 3న నిర్వహించిన నీట్-2026 పరీక్షలో దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారని, నీట్ పేపర్ లీకేజీ, భారీ అక్రమాలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది కేవలం ఒక పరీక్ష వైఫల్యం కాదని, మోడీ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. పారదర్శకత, డిజిటల్, ఇండియా, అమృత కాలం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, విద్యార్థులకు కనీస భద్రతతో పరీక్ష కూడా నిర్వహించలేకపోయిందని విమర్శించారు. పరీక్ష రద్దుతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, పేద, మధ్యతరగతి కుటుంబాలు కోచింగ్, హాస్టల్, ప్రయాణ ఖర్చులతో ఆర్థికంగా కుదేలయ్యారన్నారు. 2024లో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైనప్పటికీ, అప్పట్లో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. అదే నిరక్షయ్యం ఇప్పుడు మరింత పెద్ద స్కాంగా మారిందని, ఇది యాదృచ్ఛికం కాదని, పరీక్షా వ్యవస్థను కోచింగ్ మాఫియా, అవినీతివలయం, కార్పొరేట్ ప్రయోజనాలకు అప్పగించిన కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితమన్నారు. దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)ను పూర్తిగా ప్రక్షాళన చేసి, అవినీతికి పాల్పడిన అధికారులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్-2026 పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ జరపాలని, కోచింగ్ మాఫియా, అధికారుల, రాజకీయ సంబంధాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వ విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని

# తొలి రోజే టీమిండియా సెంచరీల షో

ఐపీఎల్‌లో విడివిడిగా ఎవరికి వారుగా సత్తా చాటిన ఆటగాళ్లు.. ఒక్కటిగా ఆడితే ఎలా రెచ్చిపోతారో ముల్లాన్‌పూర్ వేదికగా సాక్షాత్కారమైంది. అందరూ కలిసికట్టుగా ఊచకోత కోస్తుంటే అఫ్గాన్ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. రాహుల్ క్లాస్, గిల్ మాస్ సెంచరీలకు సుదర్శన్, రిషబ్ పంత్ మెరుపు హాఫ్ సెంచరీలు తోడవడంతో తొలి రోజే భారత్ 350 ప్లస్ రన్స్ చేసి క్రికెట్ కూనపై పూర్తి ఆధిక్యం ప్రదర్శించింది.







**న్యూచండీఘర్, మే 6:** క్రికెట్ కూన అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో తొలి రోజే టీమిండియా బ్యాట్స్‌మెన్ దుమ్మురేపారు. న్యూ చండీఘర్‌లోని ముల్లాన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఈ టెస్ట్‌లో కేఎల్ రాహుల్(165 బంతుల్లో 100; 11 ఫోర్లు) క్లాస్, శుభ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103నాటౌట్; 11 ఫోర్లు, ఒ సిక్స్) మాస్ సెంచరీలతో విరుచుకుపడ్డారు. ఈ శతకాలకు సాయి సుదర్శన్ (104 బంతుల్లో 81; 13 ఫోర్లు), రిషబ్ పంత్(70 బంతుల్లో 50నాటౌట్;2 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్ సెంచరీలు తోడవడంతో తొలి రోజు ఆటముగిసేసరికి భారత తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 368 పరుగుల భారీ స్కోరు చేసింది.

**దూకుడుగా ఆరంభం**

టాస్ గెలిచి టీమిండియా మొదట బ్యాటింగ్ ఎంచుకుంది.భారత్ తొలి ఇన్నింగ్స్‌ను యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్ ధాటిగా ఆరంభించారు. ముఖ్యంగా ప్రారంభం నుంచే దూకుడుగా ఆడుతూ, బౌండరీలతో అఫ్గానిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచిన యశస్వీ జైస్వాల్ ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు. ఆయన 24రన్స్ మాత్రమే చేసి సలీం సఫీ బౌలింగ్‌లో అవుటయ్యాడు.ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన సాయి సుదర్శన్‌తో కలిసి కేఎల్ రాహుల్... అద్భుతంగా ఆడాడు. లంచ్ సమయానికి భారత్ ఒక వికెట్ నష్టానికి 96 రన్స్ చేసింది.

**లంచ్ తర్వాత మరింత జోరు**

లంచ్,టీ మధ్యలో మరింతగా సుదర్శన్, రాహుల్ విరుచుకుపడ్డారు. రాహుల్ 86 బంతుల్లో, సాయి సుదర్శన్ 67 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేశారు. స్కోరును 150 మార్కు దాటించారు. కీలక హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని శతకం వైపు దూసుకెళ్తున్న సాయి సుదర్శన్ జోరుకు మరోసారి సలీం సఫీ బ్రేక్ వేశాడు. 139 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. టీ విరామానికి భారత్ 2 వికెట్లు కోల్పోయి 209 రన్స్ చేసింది.

**రాహుల్, గిల్ సెంచరీల మోత**

చివరి సెషన్‌లో టీమిండియా ట్వంటీ ట్వంటీ స్టయిల్‌లో పరుగులు రాబట్టింది. నిలకడగా ఆడిన కేఎల్ రాహుల్... గ్రౌండ్‌లో క్లాస్ షాట్లతో అలరిస్తూ 164 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. రాహుల్‌కు ఇది టెస్ట్‌ల్లో 12వ శతకం. అయితే సెంచరీ మార్కు రీచ్ అయిన తర్వాతి బంతికే రెహమాన్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. దీంతో 247 పరుగుల వద్ద టీమిండియా మూడో వికెట్ కోల్పోయింది. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వచ్చి రావడంతోనే బౌండరీలతో అఫ్గానిస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 68 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన గిల్... మరో 59 బంతుల్లో సెంచరీ మార్కు అందుకున్నాడు. కెప్టెన్‌గా గిల్‌కిది 6వది కాగా, వ్యక్తిగతంగా 11వ శతకం.

**రిషభ్ పంత్ విజృంభణ**

గిల్‌కు తోడుగా వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ సైతం గ్రౌండ్ నలుమూలలా భారీ సిక్సర్లు కొడుతూ.. భారత జట్టు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలోనే కేవలం 70 బంతులు ఆడి 50 పరుగులు పూర్తి చేశాడు. ఈ హాఫ్ సెంచరీతో పంత్ .. 19 టెస్ట్ అర్ధ శతకం నమోదుచేశాడు. వీరిద్దరి జోరుకు చివరి సెషన్‌లో భారత్ ఖాతాలో ఏకంగా 159 పరుగులు చేరాయి. తొలి రోజే 368 రన్స్ కొట్టి అఫ్గాన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టించిన టీమిండియా.. 600 ప్లస్ స్కోర్‌పై కన్నేసింది.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 368/3(85 ఓవర్లలో)** (జైస్వాల్ 24, కేఎల్ రాహుల్ 100, సాయి సుదర్శన్81, శుభ్‌మన్ గిల్ 103 నాటౌట్, రిషబ్ పంత్ 50 నాటౌట్, సలీం సూఫి 2/67, రహమాన్ 1/61)



# ఆంద్రీవాదే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ విజేతగా రష్యా టీనేజ్ సంచలనం మిరా ఆంద్రీవా ఆవిర్భవించింది. 19 ఏళ్ల ఆంద్రీవా తొలిసారి గ్రాండ్ స్లామ్ టైటిల్ అందుకుంది. రోలాండ్ గారోస్‌లో జరిగిన మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ మిరా ఆంద్రీవా... 6-3, 6-2తో వరుస సెట్లలో పోలెండ్ ప్లేయర్ చ్వాలిన్‌స్కా పై విజయం సాధించింది. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా.. రెండు వరుస సెట్లలో ఆంద్రీవా ఆధిక్యం ప్రదర్శించింది. 2014లో మరియా షరపోవా తర్వాత.. ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన రష్యా అమ్మాయిగా ఆంద్రీవా రికార్డ్ సృష్టించింది. అలాగే మోనికా సెలెస్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన రెండో అతిపిన్న క్రీడాకారిణిగా నిలిచింది. 1992లో మోనికా సెలెస్ ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గినపుడు ఆమె వయస్సు 18 ఏళ్లు.

తొలి సెట్ ఆరంభంలో ఇద్దరూ పోటీపోటీగా తలపడ్డారు. క్వాలిఫయర్‌గా ఫైనల్ వరకు వచ్చిన చ్వాలిన్‌స్కా తన సర్వీసులను నెలబెట్టుకోవడంతో తొలి సెట్ 3-3తో సమంగా కొనసాగింది. ఈ దశలో ఏస్‌లతో విజృంభించిన ఆంద్రీవా...చ్వాలిన్ స్కా సర్వీసును బ్రేక్ 6-3 తో కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో ఆంద్రీవా తన ఆటలో మరింత స్పీడ్ పెంచింది. వరుస అద్భుతమైన విన్నర్లతో 5-0తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. అయితే, పోలిష్ స్టార్ చివరి నిమిషాల్లో పుంజుకుని, ఆధిక్యాన్ని 5-2కు తగ్గించింది. తర్వాతి గేమ్‌లో ఆంద్రీవా ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ఫైనల్ ముగించి తొలి గ్రాండ్ స్లామ్ విజేతగా నిలిచింది.



## కెప్టెన్‌గా శ్రేయాస్
## తిలక్‌కు ప్రమోషన్
## సూర్యకు డబుల్ షాక్
## వైభవ్, ప్రిన్స్ ఇన్

# బేబీ బాస్ ఆగయా




ఐపీఎల్‌లో ఇరగదీసిన యూనివర్సల్ బేబీ బాస్.. మెన్ ఇన్ బ్లూలోకి ఎంట్రీ ఇచ్చాడు. వస్తూనే రికార్డు బద్దలు కొట్టాడు. అదీ క్రికెట్ దేవుడు సచిన్ తెండూల్కర్‌ది. అతిపిన్న వయస్సులో టీమిండియాకు ఎంపికై నయా హిస్టరీ క్రికెట్ చేశాడు. సచిన్ 16 ఏళ్ల 205 రోజుల వయసులో భారత్ తరపున ఆడితే.. అతని కంటే ఏడాదిన్నర ముందే ఈ ఫీట్ అందుకోబోతున్నాడు. వైభవ్ కేవలం 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే టీమిండియాకు ఎంపికయ్యాడు. బుడ్డోడి విధ్వంసాన్ని బ్లూ జెర్సీలో చూడాలని ఉవ్విళ్లూరుతున్న ఫ్యాన్స్ కలలు కొద్ది రోజుల్లోనే సాకారం కానుంది.

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనలకు.. ఆసియా క్రీడలకు భారత టీ20 జట్టును బీసీసీఐ ప్రకటించింది. మెన్ ఇన్ బ్లూకు కొత్త కెప్టెన్ వచ్చాడు. సూర్యకుమార్ యాదవ్ స్థానంలో స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ గా ఎంపిక అయ్యాడు. తెలుగు తేజం తిలక్ వర్మకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీలకు చోటు కల్పించారు. సూర్య కుమార్‌కు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఆసియా క్రీడల కోసం బుమ్రా జట్టులోకి రాగా.. సిరాజ్, ప్రిన్స్ యాదవ్‌లకు విశ్రాంతి ఇచ్చారు.

**వైభవ్‌కు చోటు :** ఐపీఎల్ 2026లో పరుగుల వరద పారించిన యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు దక్కింది. ఐపీఎల్2026లో బౌలర్లను ఊచకోత కోస్తూ 16 మ్యాచ్‌ల్లో 237.31 స్ట్రైక్ రేట్ తో 72 సిక్సర్లు, 63 ఫోర్లతో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ విజేతగా నిలిచాడు. అలాగే ఒకే సీజన్ లో అత్యధిక సిక్సర్లు క్రిస్ గేల్ రికార్డును కూడా బద్దలుకొట్టాడు.దీంతో ఇదే సరైన సమయమని భావించిన సెలెక్టర్లు.. జాతీయ జట్టులో చోటు కల్పించారు. జూన్ ఆఖర్లో ఐర్లాండ్‌తో 2 టీ20లు, జులై ఆరంభంలో ఇంగ్లాండ్‌తో 5 టీ20లు ఆడనుంది. సెప్టెంబర్‌లో ఆసియా గేమ్స్ ఉన్నాయి.

**కఠిన నిర్ణయమైనా తప్పలేదు: అగార్కర్**

రాబోయే రెండేళ్ల వరల్డ్ కప్ సైకిల్‌ను దృష్టిలో పెట్టుకునే జట్టును ఎంపికచేసినట్లు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించారు. టీమ్ ప్రయోజనాల కోసమే సూర్యతో వ్యక్తిగతంగా మాట్లాడి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. మేం మంచి జట్లను ఎంపిక చేశామని భావిస్తున్నట్లు అగార్కర్ వివరించారు.

**ఇంగ్లాండ్, ఐర్లాండ్ సిరీస్‌లకు జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్‌రెడ్డి, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్

**ఆసియా క్రీడల కోసం జట్టు:** శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే, వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి

# యెస్‌బ్యాంకుపై రూ.63 కోట్లకుపైగా జిఎస్టీ డిమాండ్ నోటీసు




**ముంబయి, జూన్ 6:** ప్రైవేటురంగంలోని ఎస్‌బ్యాంకుకు మహారాష్ట్ర జిఎస్టీ విభాగం రూ.63 కోట్లకుపైగా చెల్లించాలని నోటీసులు జారీచేసింది. జిఎస్టీ అప్పీళ్ల విభాగం కమిషనర్‌నుంచి తమకు ఉత్తర్వులు వచ్చాయని యెస్‌బ్యాంకు వెల్లడించింది. జరిమానాతో సహా మొత్తం పన్ను డిమాండ్ రూ.63 కోట్ల 26,98,888లు చెల్లించాలని నోటీసులో తెలిపింది. అయితే తాము న్యాయపరంగా ముందుకు వెళతామని బ్యాంకు ప్రకటించింది. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని చెప్పిన డిమాండ్ నోటీసులో జరిమానాతోపాటు వడ్డీని కూడా అధికంగా ఉందని ఎక్స్ఛేంజి ఫైలింగ్‌లోవివరించింది. ఈ ఉత్తర్వుల వల్ల బ్యాంకు ఇతర లావాదేవీలు, కార్యకలాపాలకు ఎలాంటి నష్టం జరగదని యెస్‌బ్యాంకు వెల్లడించింది. బ్యాంకు ఈ నోటీసుపై విధిగా న్యాయపరమైన చర్యలకు వెళుతుందని, అప్పీలుతో సహా అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటుందని బ్యాంకు ప్రకటించింది. అయితే ఈనోటీసులో పన్ను ఎగవేతలా, లేక పన్ను చెల్లించకపోవడమా, పన్ను బకాయిలా అన్నది జిఎస్టీ కమిషనరేట్ స్పష్టంచేయలేదు.

# 26కోట్లకు పెరిగిన ఎన్ఎస్ఇ ఇన్వెస్టర్ ఖాతాలు




**న్యూఢిల్లీ, జూన్ 6:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలో ఇన్వెస్టర్ ఖాతాలు ఏటికేడాది పెరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 26కోట్లమంది ఇన్వెస్టర్ ఖాతాలున్నట్లు సమాచారం. గడచిన 4 నెలల్లోనే కోటి ఖాతాలు తెరిచారు. గత ఏడాదికాలంగా చూస్తే 4.3 కోట్ల ఖాతాలు కొత్తగా తెరిచారు. ఈ ఏడాది మేనెలనాటికి ఎన్ఎస్ఇలో 13.1 కోట్ల ఇన్వెస్టర్‌ఖాతాలు రిజిస్టర్ అయి ఉన్నాయి. ఏప్రిల్‌లోనే 13 కోట్ల మార్కును బ్రేక్‌చేసింది. అయితే ఒక ఇన్వెస్టర్ ఎన్ని ఖాతాలయినా తెరుచుకునే సౌలభ్యంఉంది. మహారాష్ట్ర అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ నమోదుచేసింది.మొత్తం ఖాతాల్లో 17శాతం అంటే 4.4 కోట్లమంది ఖాతాలున్నాయి. ఆ తర్వాత యుపి మూడు కోట్లు, గుజరాత్‌నుంచి 2.2కోట్లు, పశ్చిమబెంగాల్; రాజస్థాన్ రాష్ట్రాలనుంచి 1.5 కోట్లచొప్పున ఇన్వెస్టర్ల ఖాతాలున్నాయి. టాప్ ఐదు రాష్ట్రాలే మొత్తం 49శాతం ఇన్వెస్టర్‌ఖాతాలతో ఉన్నాయి. ఈశాన్యరాష్ట్రాలపరంగా మిజోరమ్, సిక్కిమ్, మేఘాలయ రాష్ట్రాలు 32.3శాతం, 30శాతం, 29.2శాతంగా ఉన్నట్లు ఎన్ఎస్ఇ ప్రకటించింది.ఇక ఎన్ఎస్ఇ50,ఎన్ఎస్ఇ 500 సూచీలు 7.1శాతం, 9.8శాతం చొప్పున రిటర్నులతో ఉన్నాయి. ఎన్ఎస్ఇ జాబితా అయిన కంపెనీల విలువలు 12.6శాతంపెరిగింది. ఐదేళ్లలో 462.2 లక్షలకోట్లుగా ఉందని తేలింది. వ్యక్తిగత ఇన్వెస్టర్లు 18.7శాతం మంది ఉన్నారు. మ్యూచువల్‌ఫండ్స్‌ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. సిప్‌లలో పెట్టుబడులు అధికంగా ఉన్నాయి. ఏడాదికాలంలోనే 7.2 కోట్ల సిప్ ఖాతాలు తెరిచారు. నెలవారీ సగటు సిప్ ఫ్లో ఎనిమిదిరెట్లుపెరిగింది. 3660 కోట్ల నుంచి 29,132 కోట్లకు పెరిగినట్లు ఎన్ఎస్ఇ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీరామ్‌కృష్ణన్ చెప్పారు. రెండు, మూడు, నాలుగో శ్రేణి నగరాలనుంచి కూడా ఇన్వెస్టర్లు ఎక్కువమంది ఈక్విటీలు, ఈటిఎఫ్‌లు, రీట్స్, ఇన్విట్స్, ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడులు పెడుతున్నారు. ఇటీవలిఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్స్ కూడా మరిన్ని పెరిగాయి. ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచేందుకు ఎన్ఎస్ఇ తరచూ చైతన్య సదస్సులు నిర్వహించింది. ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్‌పేరిట మొత్తం 9.4 లక్షలమందికి అవగాహణ కల్పించింది. అలాగే ఇన్వెస్టర్ పరిరక్షణ నిధి కూడా 2890 కోట్లుగా ఉందని ఎన్ఎస్ఇ సిబిడివో తెలిపారు.

# ఐదు నెలల్లోనే లక్షకు పైగా టెక్కీలకు లేఆఫ్




**న్యూఢిల్లీ, జూన్ 6:** టెక్నాలజీరంగంలో లేఆఫ్‌లు భారీ ఎత్తున కొనసాగుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో ఉద్యోగులపై కోతకే కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కేవలం ఐదునెలల్లోనే లక్షమందికిపైగా టెక్ ఉద్యోగులు ఇంటిబాట పట్టారు.అనేక పెద్ద కంపెనీలు, బహుళజాతి కంపెనీలు కూడా ఉద్యోగాలపై కోతను ప్రకటించాయి.గడచిన రెండునెలల్లోనే మరింతగా పెరిగాయి. వాటిలో ఉబేర్, మెటా, క్లౌడ్‌ఫ్లేర్, ఇన్‌ట్యూట్ వంటి కంపెనీలున్నాయి. మేనెలలో 28 వేల ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించారు. నేఆఫ్ డాట్ ఎఫ్‌వైఐ పోర్టల్ అంచనాలను చూస్తే ఈ ట్రాకర్ గత ఏడాది మేనెలలో 10,577 ఉద్యోగాలపై కోత పడితే ఈ ఏడాది ఏకంగా 28,889 మందికి ఉద్వాసన ప్రకటించినట్లుతేలింది. లేఆఫ్ ట్రాకర్ పోర్టల్‌ను చూస్తే మొత్తం 1,16,739 మంది ఉద్యోగులు ఇళ్లకుపోయినట్లు తేలింది. మార్చి నెలలో అత్యధికంగా 46వేలకు పైగా ఉద్యోగాలపై కంపెనీలు కోత విధించాయి.వీటిలో పేపాల్, సిస్కో, మెటా, ఇన్‌ట్యూట్ వేలాది మందిని ఇళ్లకు పంపించాయి. ఉబేర్ 23శాతం మందికి లేఆఫ్ ప్రకటించింది. కంపెనీకి మంత్తం 34 వేల మంది గ్లోబల్‌స్థాయిలో ఉద్యోగులుంటే వారిలో ఒకటిశాతం మందికి లేఆఫ్ తప్పలేదు. ఇక సిస్కో అయితే నాలుగేవలమందిని ఇళ్లకు పంపించింది. గతనెలలో పేపాల్‌కూడా 20శాతం వర్క్‌ఫోర్స్‌ను తొలగించాలనినిర్ణయించింది.వచ్చే రెండుమూడేళ్లలో 4760 మందికిపైగా లేఆఫ్‌లు ప్రకటిస్తామని ముందే వెల్లడించింది. ఇక మెటా అయితే మొత్తం వర్క్‌ఫోర్స్‌లో ఏడువేలమందికి ప్రకటించింది. క్రెడిట్ కర్మ మాతృసంస్థ ఇన్‌ట్యూట్, టర్బోట్యాక్స్,క్విక్ బుక్స్ సంస్థలు తమ కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునేందుకు మూడు వేలమందికి లే ఆఫ్ ప్రకటించామని చెప్పాయి. క్వోరా, కాయన్‌బేస్, క్లౌడ్‌ఫ్లేర్‌లు కూడా జాబ్‌కట్స్ ప్రకటించాయి. సుమారుగా 40 కంపెనీలు ఒకనెలలోనే లేఆఫ్‌లు ప్రకటించడంతో టెక్కీల్లో ఉద్యోగభద్రతపై ఆందోళన పెరిగింది.

# రూ.3వేల కోట్లకు ట్రూహోమ్ ఫైనాన్స్ ఐపిఒ

**ముంబయి,జూన్ 6:** వార్‌బర్గ్ పిన్‌కస్ అనుబంధ సంస్థల అయిన ట్రూహోమ్ ఫైనాన్స్ కంపెనీ సెబీవద్ద ఐపిఒకు దరఖాస్తుచేసింది. ఐపిఒ ద్వారా రూ.3వేల కోట్ల నిధులు సమీకరించే లక్ష్యంతో ఉంది. తాజాగా ఈక్విటీషేర్లు రూ.1500 కోట్ల మేర విడుదలచేస్తే ఆఫర్ ఫర్‌సేల్ కింద మరో రూ.1500 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. ఒఎఫ్ఎస్‌లో ప్రమోటర్ మ్యాంగో క్రెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కూడా పాల్గొంటుంది. ప్రమోటర్ వాటాలపరంగాచూస్తే




మ్యాంగోక్రెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ రూ.10 విలువకలిగిన రూ.1500 కోట్ల విలువైన వాటాలను విక్రయిస్తున్నది. పూర్వపు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ అయిన ఈ సంస్థ అగ్రగామి హౌసింగ్ ఫైనాన్స్‌సంస్థగా కొనసాగుతోంది. గత మార్చి 9వ తేదీనే డిఆర్‌హెచ్‌పిని సెబీకి దాఖలుచేసింది. జెఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, జెఫరీస్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్, కోటక్ మహీంద్ర క్యాపిటల్ కంపెనీలు ఈ ఇష్యూకు బ్యాంకర్లుగా వ్యవహరిస్తున్నాయి. ఐపిఒద్వారా సమకూరిన నిధులు కంపెనీ మూలధన బేస్‌ను పెంచుకునేందుకు వినియోగిస్తుంది.

ప్రస్తుత రుణపరపతి, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వీటిని పంపిస్తుంది. రిజర్వుబ్యాంకు నిర్దేశించిన క్యాపిటల్ అడక్వెసీ నిష్పత్తి ఆధారంగానే సంస్థ కొనసాగుతోంది. 2010లో స్థాపించిన ట్రూహోమ్ ఫైనాన్స్ అందుబాటుధరల్లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా కొనసాగుతోంది. అంతకుముందు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా కొనసాగింది. ఈ కంపెనీని వార్‌బర్గ్ పిన్‌కస్ 2024 డిసెంబరులో కొనుగోలుచేసింది.

స్థిరాస్థి తనఖా రుణాలు, ఇతర రుణపరపతి స్కీంలు అమలుచేస్తుంది. సగటు టికెట్‌సైజు రూ.20.13 లక్షల రూపాయలుగా ఉంది. ఒక్కోశాఖకు రూ.107.230 కోట్ల రూపాయలుగా నిర్వహణ ఆస్తులున్నట్లు అంచనా. ఎస్‌బిఐ మాజీ ఛైర్మన్ దినేష్‌కుమార్ ఖారాను ఛైర్మన్‌గాను, సుబ్రహ్మణియన్ జంబునాథన్‌ను ఎండిసిఇఒగాను నియమించుకుంది.

# ఆటోమొబైల్ సేల్స్‌లో మారుతి టాప్‌గేర్

**న్యూఢిల్లీ,జూన్ 6:** భారత ప్యాసింజర్ వాహనాల మార్కెట్ 2026 మే నెలలో అమ్మకాల పరంగా పటిష్టమైన వృద్ధి నమోదు చేసింది. గత సంవత్సరం మే నెలతో పోలిస్తే ఈసారి అమ్మకాలు 26.05 పెరిగి, మొత్తం 4,40,808 యూనిట్లుగా ఉన్నాయి. ఈసారి అమ్మకాల్లో దేశీయ ఆటో దిగ్గజం మహీంద్రాను వెనక్కి నెట్టి, టాటా మోటార్స్ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.ఎప్పటిలాగే, మారుతీ సుజుకీ 1,90,337 యూనిట్ల అమ్మకాలతో అగ్రస్థానంలో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. గతేడాదితో పోలిస్తే కంపెనీ అమ్మకాల్లో ఏకంగా 39.99 వృద్ధి కనిపించింది. దీంతో మారుతీ మార్కెట్ వాటా 43.18 శాతానికి పెరిగింది. రెండో స్థానం కోసం జరిగిన తీవ్రమైన పోటీలో టాటా మోటార్స్ విజయం సాధించింది. టాటా 59,090 వాహనాలను విక్రయించగా, మూడో స్థానానికి పడిపోయిన మహీంద్రా 58,021 యూనిట్లను అమ్మింది. ఈ రెండు కంపెనీల మధ్య అమ్మకాల వ్యత్యాసం కేవలం 1,069 యూనిట్లు మాత్రమే. గతేడాది ఇదే సమయంతో పోల్చితే టాటా 42.19 వృద్ధి సాధించగా, మహీంద్రా వృద్ధి 10.66 వద్దే నిలిచింది. ఇక హ్యుందాయ్ 47,837 యూనిట్లతో నాలుగో స్థానంలో, టయోటా 30,574 యూనిట్లతో ఐదో స్థానంలో ఉన్నాయి. కియా 27,586 యూనిట్లతో ఆరో స్థానాన్ని దక్కించుకుంది. ఈ టాప్ 6 కంపెనీల వాటానే మొత్తం మార్కెట్లో దాదాపు 94 ఉండటం గమనార్హం. టాటా పంచ్, నెక్సాన్, మారుతీ బ్రెజా, మహీంద్రా స్కార్పియో వంటి ఎస్ యూవీ మోడళ్లు ఈ అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి.



# నిర్దిష్టమైన ప్యాకేజి సైజుల్లోనే వంటనూనెల సరఫరా

**న్యూఢిల్లీ, జూన్ 6:** వంటనూనెలకు సంబంధించి నిర్దిష్టమైన ప్యాకేజి సైజులు ఉండాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ సూచించింది. లీగల్‌మెట్రాలజీ పరిధిలో ఇకపై వంటనూనెల కంపెనీలన్నీ కూడా నిర్దిష్టమైన ప్యాకింగ్‌సైజుల్లోనే సరఫరాచేయాలని ఆదేశించింది. ప్రామాణిక నిర్వహణ విధానం ఎస్‌వోపిని సవరించిన కేంద్రం తూనికలు కొలతల శాఖ సూచించిన విధానం అనుసరించాలనిసూచించింది. సైజులతోపాటు తమ నూనెల స్పష్టమైన వివరాలు ఇవ్వాలి. ఇందుకు మూడునెలల గడువు విధించింది. ఉత్పత్తిదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులు ఈ గడువులోపు సూచించిన సైజుల్లో అమలుచేయాలని కోరింది. 200ఎంఎల్, 500 ఎంఎల్, లీటరు, 2 లీటర్లు, 3 లీటర్లు, నాలుగు, ఐదు 15 లీటర్లతోపాటు 20 లీటర్లు అత్యధిక సైజులో ఈ వంటనూనెలు ఉండాలి.

పామాయిల్, సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆముదం, వేరుసెనగ, నువ్వుల నూనె, రైస్‌బ్రాన్,పత్తిగింజలు, జొన్న గింజలు వంటి వాటినుంచి తీసి బ్లెండింగ్‌చేసిన వంటనూనెలన్నింటికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. వంట నూనెల రంగానికి సంబంధించిన అందరు ప్రతినిధులతో విస్తృత స్థాయి



చర్చలుజరిపిన తర్వాత ఈ కొత్తనిబంధనలు అమలుచేస్తోంది. దేశీయంగా ఉత్పత్తిచేసే నూనెలు, దిగుమతి చేసుకుంటున్న వంటనూనెలకు కూడా ఈ ప్యాకింగ్ సైజులు వర్తిస్తాయి. 200ఎంఎల్, లేదా 200 గ్రాములకు లోబడిన వంటనూనెలను మాత్రం మినహాయించారు. భారత వంటనూనెల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌దేశాయి ఈ ప్రతిపాదనను స్వాగతించారు. అయితే ఇందుకు మూడు సంవత్సరాలు గడువు ఇస్తే వంటనూనెల రంగంలో ఉన్న అనుబంధరంగాలకు పూర్తి అవగాహన కలుగుతుందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

## టేస్టీ టేస్టీ టిక్కాలు

రుచి

చిట్టి బొజ్జ నింపడానికి... రకరకాల స్నాక్స్ అందివ్వొచ్చు. మురుకులు, చెగోడీలు, అప్పాలు.. ఎప్పుడూ ఇవేనా అనే చిచ్చర పిడుగులకు టేస్టీ టేస్టీ వెరైటీ టిక్కాలను చేసి పెట్టండి ఇష్టంగా తింటాం..

### పనీర్‌తో..



**కావాల్సినవి :** పనీర్-200 గ్రా. పెరుగు-400 గ్రా. పసుపు-అర చెంచా, కారం-రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, అల్లం వెల్లుల్లి ముద్ద, జీలకర్ర పొడి, ధనియాల పొడి- చెంచాన్నర చొప్పున, గరంమసాలా, చాట్ మసాలా- చెంచా చొప్పున, నిమ్మకాయ-ఒకటి (రసం తీసి పెట్టుకోవాలి), కసూరీ మేథీ- చెంచా, శనగపిండి- రెండు చెంచాలు (ఇష్టమైతే), కార్న్‌ఫ్లోర్-చెంచా, క్యాప్సికమ్ (పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లో) కొన్ని ముక్కలు (పెద్దగా), ఉల్లిపాయ-ఒకటి (పెద్ద ముక్కలుగా), నూనె-తగినంత. **తయారీ :** పెద్ద గిన్నెలో పెరుగు, కారం, పసుపు మిరియాల పొడి తగినంత ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, చాట్ మసాలా, అల్లంవెల్లుల్లి ముద్ద, నిమ్మరసం, కసూరీ మేథీ వేసి కలపాలి. ఆ తర్వాత పదార్థాలు కలిసిపోయేలా బాగా గిలక్కొట్టాలి. దాంతో చిక్కటి క్రీమ్‌లా తయారవుతుంది. కావాలనుకుంటే శనగ పిండి కల పొచ్చు. కార్న్‌ఫ్లోర్‌నూ జత చేయాలి. బెల్‌పెప్పర్ లను విత్తనాలను తీసేసి పెద్ద ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలను కూడా. పెద్ద పాత్రలో కూరగాయ ముక్కలతో పాటు పన్నీర్ ముక్కలనూ జత చేయాలి. బెల్‌పెప్పర్‌లను విత్తనాలను తీసేసి పెద్ద ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలను కూడా. పెద్ద పాత్రలో కూరగాయ ముక్కలతోపాటు పన్నీర్ ముక్క లనూ జత చేయాలి. వీటిపై మారినేట్ చేసిన ద్రవం పోసి ముక్కలకు పట్టేలా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఓ మూడు గంటలు నాననివ్వాలి. ఆ తర్వాత పన్నీర్, క్యాప్సికమ్స్, ఉల్లిపాయ ముక్కలను స్టిక్‌కు గుచ్చాలి. పొయ్యి మీద గ్రిల్ పాన్ పెట్టి నూనె రాసి పనీర్ గుచ్చిన పుల్లలను పెట్టాలి. రెండు నిమిషాలు మూత పెడితే చక్కగా మగ్గుతాయి. ఇప్పుడు మరో వైపు తిప్పాలి. అవసర మైతే కాస్త నూనె రాయొచ్చు. అన్ని వైపులా చక్కగా కాలే వరకు తిప్పుతూ ఉండాలి. గ్రిల్ పాన్ లేనివారు సాధారణ పాన్ పై కూడా చేసుకోవచ్చు. చివరగా చక్కగా వేగిన పనీర్ టిక్కాలను ఆమ్‌చూర్ చల్లి తింటే చాలా బాగుంటాయి.



### గోబీతో..

**కావాల్సినవి :** కాలీఫ్లవర్ ముక్కలు-20, ఉప్పు- తగినంత, వేడినీళ్లు- మూడు కప్పులు. **మారినేషన్ కోసం :** పెరుగు-అర కప్పు, కారం, కసూరీ మేథీ-చెంచా చొప్పున, పసుపు- పావు చెంచా, ధని యాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా- అర చెంచా చొప్పున, ఉప్పు- తగినంత, నిమ్మరసం, వేయించిన శనగపిండి- రెండు చెంచాల చొప్పున, నూనె-తగినంత, అల్లం వెల్లుల్లి ముద్ద- చెంచా.

**తయారీ :** పెద్ద గిన్నెలో కాలీఫ్లవర్ ముక్కలు, ఉప్పు, వేడినీళ్లు పోసి కలిపి అయిదు నిమిషాలు పక్కన పెట్టాలి. ఆ తర్వాత నీళ్లని పారబోసి పక్కన పెట్టాలి. మరో గిన్నెలో పెరుగు, కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, కసూరీ మేథీ, ఉప్పు, నిమ్మరసం, అల్లంవెల్లుల్లి ముద్ద,శనగపిండి.. ఇలా అన్నింటినీ ఒకదాని తర్వాత మరొకటి వేసి బాగా కలపాలి. ఆ తర్వాత కాలీఫ్లవర్ ముక్కలు, కాస్తంత నూనెను చేర్చిబాగా కలియ బెట్టాలి. ఈ పూర్తి మిశ్రమాన్ని అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టి రెండు చెంచాల నూనె వేసు కోవాలి. అది కాగిన తర్వాత మారినేట్ చేసి గోబీ మిశ్రమాన్ని పాన్‌లో సమంగా పరిచి మంటను మధ్యస్థంగా పెట్టి ముక్కలు పూర్తిగా ముదురు గోధుమ రంగులోకి వచ్చే వరకు ఫ్రై చేయాలి. ఇప్పుడు వీటిని పొడవైన పుల్లలకు గుచ్చాలి. మరో పొయ్యి మీద గ్రిల్ పాన్ పెట్టి ఈ పుల్లలను దానిమీద పెట్టి కాస్తంత నూనె రాస్తూ అన్ని వైపులా వేగేలా చక్కగా వేయించాలి.



### మష్రూమ్‌తో..

**కావాల్సినవి :** పుట్టగొడుగులు-పది, ఉల్లిపాయ-సగం (పెద్ద ముక్కలుగా), ఆకుపచ్చ, ఎరుపు క్యాప్సికమ్-పావు ముక్క (పెద్ద ముక్కలుగా) చొప్పున, గడ్డపెరుగు-అర కప్పు, శనపిండి-రెండు చెంఆచలు, పసుపు, జీలకర్ర పొడి, వాము-పావు చెంచా చొప్పున, కారం - చెంచా, అల్లం వెల్లుల్లి ముద్ద, ధనియాల పొడి, గరంమసాలా, కసూరీ మేథీ-అర చెంచా చొప్పున, నిమ్మరసం -రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నూనె-అయిదు చెంచాలు, చాట్ మసాలా-చిటికెడు.



**తయారీ :** పుట్టగొడుగులు, కూరగాయ ముక్కలు, రోస్టింగ్ కోసం నూనె, చాట్ మసాలా తప్పించి మిగతా పదార్థాల న్నింటినీ పెద్ద పాత్రలో వేసి బాగా కలపాలి. చిక్కటి మిశ్రమం వచ్చేవరకు కలుపుతూ ఉండాలి. దీంట్లో పుట్టగొడుగులు, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అరగంట లేదా రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టాలి. మారినేషన్ పూర్తయిన తర్వాత పుట్టగొడుగులు క్యాప్సికమ్, ఉల్లిపాయ ముక్కలను పుల్లలకు గుచ్చాలి. పొయ్యి మీద పాన్/గ్రిల్ పాన్ పెట్టి నూనె వేసి వీటిని వేయించాలి. టిక్కాపై నూనె వేస్తూ అన్ని వైపులా దొర్లించాలి. మంటను మధ్యస్థంగా పెట్టి అన్నివైపులా బాగా కాలేలా చూడాలి. అయితే మాడకుండా జాగ్రత్త పడాలి. చివరగా చాట్ మసాలా చల్లితే మష్రూమ్ టిక్కా తినడానికి రెడీ

### చికెన్ చీజ్‌తో...

**కావాల్సినవి :** చికెన్ బ్రెస్ట్-రెండు, మొజరెల్లా చీజ్-కప్పు, చీజ్ స్లైస్‌లు- రెండు, అల్లంవెల్లుల్లి ముద్ద, పచ్చి మిర్చి, కొత్తిమీర తురుము-రెండు చెంచాలచొప్పున, నూనె-తగినంత, నిమ్మరసం- పావు కప్పు, జాజికాయ పొడి- పావు చెంచా, జీలకర్ర-అర చెంచా, జాపత్రి- ఒకటి, యాలకులు- నాలుగు, శనగపిండి, పెరుగు- పావు కప్పు చొప్పున, సన్నగా కోసిన ఉల్లిపాయ- ఒకటి, ఉప్పు సరిపడా, గరం మసాలా- పావు చెంచా, నల్లుప్పు- చిటికెడు. **తయారీ :** పలుచటి, వెడల్పాటిం పెద్ద చికెన్ ముక్కలను కత్తి మొనదేలిన భాగం వైపు నుంచి కాకుండా మరోవైపు నుంచి మెల్లిగా బీట్ చేయాలి. ఈ ముక్కలను ప్లేట్‌లోకి తీసు కోవాలి. వీటికి రెండు వైపులా నిమ్మరసం, ఉప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద, నూనె వేసి రాసి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి మీద పాన్ పెట్టి అది వేడయ్యాక జాజికాయ, జీలకర్ర, జాపత్రి, యాలకుల వేసి వేయించి రోట్లో వేసి కాస్త ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని

## వాళ్లకు ఒంటరితనం లేకుండా!



**ఇంట్లో నానమ్మను ఉపయోగపడని సామానుగా పోలుస్తూ.. పిల్లలు హేళన చేస్తుంటారు. అలాగే భావిస్తూ వాళ్లకు పలక రింపు కరవైతే ఇంటిల్లిపాదీ మధ్య ఉంటూనే వృద్ధులు ఒంటరి తనాన్ని అనుభవిస్తారు. గతకాలానికి సంబంధించిన వివేసాలను మనకు అందించే వారధుల్లాంటి పెద్ద వాళ్లను సంరక్షించాలి. అప్పుడే మరింత కాలం వాళ్లు సంతోషంగా జీవిస్తారు.**

ఏదైనా ప్రత్యేకదినం లేదా నూతన సంవత్సరం అంటూ జీవితంలో తీర్మానాల పట్టిక తయారు చేస్తుంటాం. కెరియర్, ఆరోగ్యం కోసం ఇకపై ఎలా ఉండాలో ప్రణాళికలు వేసు కుంటాం. అలాగే ఇంట్లో వృద్ధుల సంరక్షణ కోసంకూడా మనకు మనం కొన్ని తీర్మానాలు చేసుకోవాలి. ఇంటిల్లిపాది ఉండగా, ఎవరో ఒకరే కాకుండా ప్రతి ఒక్కరూ వాళ్లతో ఆత్మీయంగా ఉండాలి. ముఖకవళికలను బట్టి వారి మనసులో ఏముందో గుర్తించడం పిల్లలకూ నేర్పించాలి. శారీరక, మానసికారోగ్యానికి సంబంధించి వారిలో కలిగే చిన్న మార్పును కూడా కనిపెట్టాలి. రోజులో వాళ్ల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని తీర్మానం చేసుకుంటే, ఆ సంభాషణలో వారి మనసు అర్థమవుతుంది. పలకరించి కాసేపు మాట్లాడితే చాలు. వారి మనసులో గూడుకట్టుకున్న ఒంటరితనం క్షణాల్లో దూరమవుతుంది.

**అనుభవాలను చెప్పిస్తే..** రోజు వారి నుంచి ఒక జీవితానుభవాన్ని అడిగి తెలుసుకోవాని మనకు మనమే తీర్మానం చేసుకోవాలి. కనీసం వారికి తెలిసిన వ్యక్తుల గురించి వాట్లాడమనడం లేదా ఏదైనా పౌరాణికగాథను చెప్పమనడం.. వంటివన్నీ వారిని మానసికంగా ఉత్తేజితులను చేస్తాయి. ఉత్సాహంగా గతకాలాన్ని నెమరువేసు కుంటారు. అప్పటి అనుభవాలను పంచుకుంటారు. అది వారిని సంతోషంగా ఉంచి ఆరోగ్యాన్ని పెంచుతుంది.

**కాసేపు నడిస్తే...** ఇంటి వరండా లేదా గార్డెన్‌లో పది నిమిషాలు వారిని నడిపించా లనే తీర్మానం తీసుకోవడం కూడా మంచిది. అది వారికి వ్యాయామం అవుతుంది. చెట్ల మధ్య నడిచేటప్పుడు వాళ్ల మనసంతా తేలికగా మారుతుంది. గతంలో వారు చేపట్టిన బాధ్యతలు, పిల్లల పెంపకంలో వాళ్లు తీసుకున్న జాగ్రత్తలను ప్రశంసిస్తూ, ప్రస్తుతకాలంలో వారు గుర్తించిన మార్పులను చెప్పమనాలి. ఇప్పటి పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు సలహాలు, సూచనలూ తీసుకోవాలి. ఇవన్నీ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి. తామెందుకూ పనికిరావడంలేనే ఆత్మన్యూనత ఉంటే దాన్నుంచి బయటపడతారు.

**స్నేహం చేయాలి..** వాళ్ళను స్నేహితులుగా స్వీకరించాలి. ప్రేమించాలి. కెరియర్ లేదా నిత్యజీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలను వారితో పంచుకోవచ్చు. సమస్య వివరించి పరిష్కారాన్ని చెప్పమంటే చాలు. అనుభవంతో వాళ్లందించే సలహాలూ ఎంతో ఉపయోగపడతాయి. జీవితంలో లక్ష్యాలను చేరుకునేలా చేస్తాయి. వారిని అనుభవాలు పాఠాలై ముందుకు నడిపిస్తాయి. వారి నుంచి దొరికే నిస్వార్థమైన ప్రేమతో మనకూ కష్టం వస్తే చెప్పడానికి ఒకరున్నారనే భరోసావస్తుంది.

## ఏ పదమెప్పుడో అప్పుడే !

అంతర్వాణి

డానీ అనే ఒక వ్యక్తి ఓ గుర్రాన్ని కొనేందుకు మార్కెటు వెళ్లాడు. తనకు మంచి గుర్రం కావాలని అడిగాడు. అందుకు సదరు అమ్మే వ్యక్తి 'నావద్ద మంచి గుర్రం ఉంది, అదికూడా మంచి ఆధ్యాత్మిక గుర్రం' అని చెప్పాడు. దానికి ఏమీ అర్థం కాక 'ఆధ్యాత్మిక గుర్రం' అంటే ఏమిటి అని అడిగాడు. అందుకు ఆ వ్యక్తి ఒక గుర్రాన్ని చూపుతూ.. ఈ గుర్రం 'ప్రైజ్ ద లార్డ్' అంటే వెంటనే పరుగెత్తుకుని వెళ్తుంది..'ఆమెన్' అంటే ఆగిపోతుంది అన్నాడు. డానికి ఆ గుర్రం చాలాబాగా నచ్చి, డబ్బు లిచ్చి దాన్ని కొన్నాడు. ఆ గుర్రంపై ఎక్కి, సంతోషంతో 'ప్రైజ్ ద లార్డ్' అన్నాడు. వెంటనే ఆ గుర్రం పరిగెత్తడం మొదలెట్టింది. డానీ మాత్రం చాలా సంతోషంతో పరవశిస్తూ, గుర్రంపై ప్రయాణం చేస్తు న్నాడు. హఠాత్తుగా ఆయన తేరుకునేలోగా గుర్రం ఒక ఎత్తైన పర్వతం అంచువద్ద పరుగెత్తుతున్నది. దానికి కంగారు ఎక్కువైపోయి, గుర్రం ఆగిపోవాలంటేఏం చెప్పాలి అనే మాటను మర్చి పోయాడు. ఇక తనకు మరణం తప్పదని భావించాడు. కానీ తనకి తన తల్లినేర్పించిన ప్రార్థన గుర్తుకు వచ్చి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా.. 'దేవా! నన్ను కాపాడు' అంటూ 'ఆమెన్' అన్నాడు. వెంటనే గుర్రం ఆగిపోయింది. డానీ హమ్మయ్య అనుకుని, విపరీతమైన సంతోషంలో 'ప్రైజ్ ద లార్డ్' అన్నాడు. ఆ తర్వాత ఏం జరిగి ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. చాలామంది దేవుడి నామాన్ని అర్థం పర్థంలేకుండా వాడేస్తుంటారు. 'నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు, యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపువానిని నిర్దోషిగా ఎంచడు' (నిర్గమ 20:7) అని ఉంది. ప్రతిమాటకు పదాలకు అర్థంపర్థం అనేవి ఉన్నాయి. దేవుడి వాక్యాన్ని ఎలా పడితే అలా వాడకూడదు. ఇతరుల క్షేమాన్ని కోరుతూ, దేవుడికి మహిమకరంగా ఆయన వాక్యాన్ని ప్రకటించాలి. కొందరు ప్రతిసారీ 'హల్లేలూయ.. స్తోత్రం' అంటూ ఉంటారు. ఆ పదాలు ఎప్పుడు ఎలా వాడాలో గ్రహింపులేకుండానే వాడుతుంటారు. ఇకనైనా దేవుడి వాక్యాన్ని అజ్ఞానంతో కాక జ్ఞానంతో మాట్లాడుదాం.

- పి.వాణిపుష్ప

తెర

## 'సింగ్ గీతం' తో పని చేయడం అదృష్టం: దేవిశ్రీ



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం'తో ముందుకు వస్తున్నారు. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

**సింగీతం శ్రీనివాసరావుతో సినిమా అనగానే మీ ఫీలింగ్ ఏంటి?**

నేను సింగీతం గారికి వీరాభిమానిని. ఆయన లెజెండ్. నాన్నని కలవడానికి వచ్చేటప్పుడు వాళ్లు మాట్లాడుకుం టుంటే నేను ఆరాధనగా చూసేవాడిని. చాలా ఏళ్ల క్రితం పవన్ కళ్యాణ్‌తో జీసస్‌పై ఒక సినిమా అనుకున్నాం. సింగీతం చేసిన ప్రయోగాలు మరెవ్వరూ చేసి ఉండరు. పుష్పక విమానం, భైరవద్వీపం, ఆదిత్య 369 వంటి చిత్రాలు నాకు చాలా ఇష్టం. మూడేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ చేస్తున్నామని ఆయన నుంచి ఫోన్ వచ్చింది. అప్పుడు నాకు చాలా ఆనందంగా అనిపించింది.

**ఇప్పటికీ ఈ కథ ఎంత రిలెవెంట్‌గా ఉంటుంది?**

సింగీతం ఎప్పుడూ ట్రెండ్‌కి తగ్గట్టు కథలు ఆలోచించలేదు. ఆయనకు ఒక ఆలోచన వచ్చిందంటే అది ఇంతకుముందు రానిది, తర్వాత కూడా రానిదిగా ఉంటుంది.'సింగ్ గీతం' ఐడియా కూడా అంతే కొత్తగా ఉంటుంది. కళ, సంగీతానికి సంబంధించిన అంశాలు ఎప్పటికీ పాతబడవు. ఉదాహరణకు విశ్వనాథ్ సాగర సంగమం ఎప్పటికీ పాతబడదు. 50 ఏళ్ల తర్వాత చూసినా కొత్తగానే అనిపిస్తుంది.

**మాటలన్నీ పాటలుగా చేశారు కదా... ఆ అనుభవం చెప్పండి?**

నిజంగా ఇది నా కెరీర్‌లో అత్యంత ఛాలెంజింగ్ సినిమా. నాకు స్క్రిప్ట్ ఇచ్చారు. ఆ స్క్రిప్ట్ మొత్తం చదివి ప్రతి డైలాగ్‌ను సంగీతంగా మార్చాల్సి వచ్చింది. ఇలాంటి సినిమాలకు భాషపై మంచి పట్టు ఉండాలి. నాకు చిన్నప్పటి నుంచి మైకేల్ జాక్సన్, ఇళయరాజా లాంటి సంగీతం చేయాలనే కోరిక ఉండేది. ట్యూన్స్ కట్టడం వచ్చేది. కానీ లిరిక్స్ ఉండేవి కావు. అప్పుడు న్యూస్‌పేపర్ తీసుకుని అందులో ఉన్న వార్తలనే ట్యూన్స్‌గా మార్చుకునేవాడిని. మా నాన్న చూసి నవ్వేవారు. చిన్నప్పటి నుంచి ప్రతి అక్షరాన్ని సంగీతంగా మార్చే అలవాటు నాకు ఉండేది. తెలిసో తెలియకో అదే ఈ సినిమాకు ఉపయోగపడింది. ఒక సీన్ తీసుకుని మ్యూజికల్‌గా చేసి వినిపించాను. అది విని సింగీతం చాలా సంతోషించారు. మిగతా సినిమాలకు ఒక ఫార్మాట్ ఉంటుంది. కానీ ఈ సినిమాకు అలాంటి ఫార్మాట్ లేదు. నేనే కొత్త ఫార్మాట్ కనిపెట్టు కోవాల్సి వచ్చింది. 24 గంటలూ డ్యూటీలో ఉండేవాడని చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. జీవితంలో ఇలాంటి అవకాశం మళ్లీ రాదు.

**సినిమా చూసుకున్నాక మీకు ఎలా అనిపించింది?**

మేమంతా నిన్ననే స్టూడియోలో కూర్చుని సినిమా చూశాం. సినిమా చూస్తున్న ప్పుడు మళ్లీ సింగీతం విజన్‌కి ముగ్ధులమైపోయాం. ఆయన ఆలోచనల గొప్పతనం మరో సారి అర్థమైంది.


**ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుంది?**

అన్నిటికంటే ముఖ్యంగా 94 ఏళ్ల వయసులో కూడా ఇంత కొత్త ఆలోచనతో, ఇంత ఉత్సాహంగా సినిమా చేసిన సింగీతం నుంచి ప్రేక్షకులు స్ఫూర్తి పొందుతారు.

**'ఎల్లమ్మ' గురించి?**

చాలా పని పూర్తయింది. కొన్ని పాటలు చేశాను. ఒక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌కు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా కంపోజ్ చేశాను.

## 'స్లమ్ డాగ్' టీజర్ జూన్ 8న రిలీజ్



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్‌డ్రామా 'స్లమ్ డాగ్' ఈ చిత్రం ప్రొడక్షన్ విజయవంతంగా పూర్తయింది. అన్ని భాషా వెర్షన్లలో పోస్ట్‌ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. '33 టెంపుల్ రోడ్' అనే ఆసక్తికరమైన ట్యాగ్ లైన్ తో ఈ ప్రాజెక్ట్ దాని టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్‌లుక్ విడుదల నుండి హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'స్లమ్ డాగ్' చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జె.బి. నారాయణరావు కొండ్రోల్లా జె.బి. మోషన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను జూన్ 8న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. టీజర్ పోస్టర్‌లో కనిపించిన విజువల్ ఎంతో డార్క్ అండ్ ఇంటెన్స్‌గా ఆకట్టుకుంటోంది. కళ్లకు గంతలు కట్టుకున్న ఓ వ్యక్తి మెడపై రక్తంతో తడిసిన కట్టి ఉంచిన దృశ్యం కథలోని బ్రూటల్ ప్రపంచాన్ని సూచించేలా కనిపి స్తోంది. విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్త నటిస్తుండగా, టబు, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తు న్నారు. అర్జున్ రెడ్డి, 'యానిమల్' చిత్రాలతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న జాతీయ అవార్డువిజేత హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.



## 'పెద్ది' రికార్డ్ కలెక్షన్ల


మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శ కత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. 'పెద్ది' చిత్రం అద్భుతంగా దూసుకు పోతోంది. తొలి రోజే ..135 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రేక్షకుల నుంచి, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న స్పందన చాలా అద్భుతంగా ఉంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ: ఇన్నాళ్లు మనం ఎదురుచూసిన 'పెద్ది' వచ్చేసింది. మనం ఊహించినట్లుగానే ఇది ఒక సైక్లోన్ క్రియేట్ చేసింది. ప్రీమియర్స్ నుంచే అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రీమియర్స్, ఫస్ట్ డే కలిపి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించింది. డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ సినిమా విడుదలైనప్పటి నుంచి నా ఫోన్ రింగ్ అవడం ఆగలేదు. 'ఉప్పెన' సమయంలో కూడా ఇదే జరిగింది. అయితే 'ఉప్పెన' కంటే పది రెట్లు ఎక్కువ రెస్పాన్స్ ఇప్పుడు వస్తోంది. అందరూ ఫోన్ చేసి సినిమా పెద్ద హిట్ అయ్యిందని చెబుతున్నారు. సినిమా చూసి చాలా ఇన్‌స్పైర్ అయ్యామని అంటున్నారు.

## 'సుధీర్స్ జోకర్' హీరోయిన్ అయేషా బర్త్ డే స్పెషల్ పోస్టర్



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "సుధీర్స్ జోకర్". బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించ నున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తు న్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తు న్నారు.ఈ రోజు హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. "సుధీర్స్ జోకర్" చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అల రించబోతోంది. రీసెంట్‌గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భం గా రిలీజ్ చేసిన "సుధీర్స్ జోకర్" మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

## RAPO23కి డీవోపీగా నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరు



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లో మరో కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. RAPO23 చిత్రంతో ఆయన దర్శకుడిగా ఆరంగేట్రం చేస్తున్నారు. రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే సినీ వర్గాలు, అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన 'వీర' ఫస్ట్ గ్లింప్స్‌తో అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పుడు ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరునావుకరసు (తిరు) ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా జాయిన్ అయ్యారు. RAPO23 చిత్రంతో రామ్ రచయిత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు, అలాగే ఇందులో ఆయనే హీరో పాత్రలో నటిస్తున్నారు. కొత్తగా ప్రారంభించిన రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ చిత్రం The Story of a Lone Wolf అనే ట్యాగ్‌లైన్‌తో నియోనాయర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా భారీ స్థాయిలో రూపొందుతోంది. ఎప్పుడూ కొత్త సవాళ్లను స్వీకరిస్తూ తనను తాను కొత్త కోణాల్లో ఆవిష్కరించుకునే రామ్ పోతినేని, RAPO23 ను కూడా తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌గా తీర్చిదిద్దుతు న్నారు. కథ, దర్శకత్వం, నటనతో పాటు సినిమా వరల్డ్ బిల్డింగ్ వరకు ప్రతి అంశంలోనూ ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.భారతీయ సినీ పరిశ్రమలో తన అద్భుతమైన విజువల్ స్టైల్, ఫ్రేమింగ్, లైటింగ్, కథనానికి ప్రాణం పోసే సినిమాటోగ్రఫీతో తిరు ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. జాతీయ అవార్డు అందుకున్న ఆయన అనుభవం, మూడ్, లైట్, సినిమాటిక్ టెక్స్చర్‌పై ఉన్న పట్టు RAPO23 కి మరింత బలాన్ని చేకూర్చనుంది. తొలిసారి దర్శకత్వం వహిస్తున్న రామ్ పోతినేని, డీవోపీ తిరు కాంబినేషన్‌తో RAPO23 అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టులలో ఒకటిగా మారింది.

## 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిసు న్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘట నల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. తాజాగా 'రణబాలి' సినిమా సక్సెస్ ఫుల్‌గా వంద రోజుల షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇటీవలే గండికోటలో షెడ్యూల్ చిత్రీకరణ జరిపారు. వారం రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్ లో విజయ్ దేవరకొండ, రశ్మిక మధ్య వచ్చే ఎమోషనల్ సీన్స్ రూపొందిం చారు. ఇప్పటిదాకా ఈ చిత్రానికి సంబంధించిన 90 పర్సెంట్ షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ఔట్ పుట్ పూర్తి సంతృప్తికరంగా వచ్చిందని మేకర్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

# భారత్ విదేశాంగ విధానానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు

**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 6:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ఇండియాతో బంధాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు.

రష్యాతో బంధం అంశంపై భారత్‌పై అమెరికా వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించిందని, కానీ ఆ ప్రయత్నాల్లో అమెరికా విఫలమైనట్లు పుతిన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలను అమెరికా బలహీనపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మేటి న్యూస్ ఏజెన్సీలతో పుతిన్ మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వృద్ధిని ఆయన ప్రశంసించారు. భారత్ వ్యక్తిగత విదేశాంగ విధానాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు. భారత్‌తో ఆర్థిక సంబంధాన్ని కొనసాగించేందుకు దృఢనిశ్చయంతో ఉన్నట్లు పుతిన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని, ఆ దేశంలో ప్రస్తుతం ఆర్థిక వృద్ధి ఆకట్టుకునేలా ఉందని పుతిన్ అన్నారు. రాబోయే రోజుల్లో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు వంద బిలియన్ల డాలర్లకు చేరుకోనున్నట్లు ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భారత్‌పై పశ్చిమ దేశాలు వత్తిడి తేవాలని ప్రయత్నిస్తే అది ఆ దేశాలకు బ్యాక్‌ఫైర్ అవుతుందని బ్యాక్‌ఫైర్ అవుతుందని పుతిన్ అన్నారు. ఇండియాపై ఒత్తిడి పెట్టాలని అమెరికా ప్రయత్నిస్తోందని, కానీ అత్యధిక జనాభా గల భారత్‌పై కానీ, మోడీపై కానీ వత్తిడి తెస్తే, అది అంతర్జాతీయ సంబంధాలకు, ద్వైపాక్షిక బంధాలకు విఘాతం అవుతుందని పుతిన్ తెలిపారు.

## జలమండలి ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ ఘన విజయం

**హైదరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త:** 717 ఓట్ల మెజారిటీతో ఎం. రాజిరెడ్డి విజయం జలమండలి ఉద్యోగుల సంఘం ఎన్నికల ఓట్ల లెక్కింపు శనివారం రాత్రి పూర్తయింది. మొత్తం 22 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించగా, మొత్తం 2,900 మంది ఓటర్లలో 2,761 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ తరఫున పోటీ చేసిన ఎం. రాజిరెడ్డి 1,739 ఓట్లు సాధించి విజయం సాధించారు. ప్రత్యర్థి హైదరాబాద్ వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ కామ్‌గార్ యూనియన్ అభ్యర్థి రాంబాబు యాదవ్ 983 ఓట్లు పొందారు. ఈ ఎన్నికల్లో ఎం. రాజిరెడ్డి 717 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 39 ఓట్లు చెల్లనివిగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. త్రిశూలం గుర్తుపై పోటీ చేసిన తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ విజయంతో యూని యన్ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, పదోన్నతులు, సేవా భద్రత, పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామన్నారు.

## విజయ్‌పార్టీలో చేరిన నలుగురు అన్నాడిఎంకె మాజీ మంత్రులు!

**చెన్నై,జూన్ 6:** తమిళనాడులో తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన అన్నాడీఎంకేకు వరుస షాకులు తప్పడం లేదు. ఇప్పటికే పార్టీని వీడి పలువురు ఎమ్మెల్యేలు అధికార టీవీకేలోకి ఫిరాయించగా ఇప్పుడు మాజీ మంత్రులు సైతం షాకులిస్తున్నారు. ఇవాళ చెన్నైలోని టీవీకే పార్టీ ప్రధాన కార్యాలయంలో అన్నాడీఎంకేకు చెందిన నలుగురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ప్రత్యక్షమై కండువాలు మార్చేసుకున్నారు. అన్నాడీఎంకేకు గుడ్ బై చెప్పిన వారిలో ఉడుమలై కె రాధాకృష్ణన్, ఎంసి సంపత్, కడంబూర్ సి రాజు, ఎన్ ఆర్ శివపతి ఉన్నారు. వీరిని టీవీకే ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున తమ పార్టీలోకి ఆహ్వానించారు. వాస్తవానికి ఎన్నికల్లో ఓటమి తర్వాత 25 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేల బృందం పార్టీ విప్‌ను ధిక్కరించి, అసెంబ్లీలో సీఎం విజయ్ విశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చింది. ఆ తిరుగుబాటు ఎమ్మెల్యేల్లో నలుగురు ఆ తర్వాత అసెంబ్లీకి రాజీనామా చేసి టీవీకేలో చేరారు. చివరకు ఆ తిరుగుబాటు వర్గం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామితో రాజీ చేసుకుంది. ఆ తర్వాత కూడా పలువురు అన్నాడీఎంకే కార్యకర్తలు, నేతలు పార్టీని వీడి



అధికార పార్టీలో చేరారు. ఇలా ప్రతిపక్ష పార్టీ నుండి జరుగుతున్న వరుస ఫిరాయింపులలో ఈ నలుగురు మాజీ మంత్రుల చేరిక కూడా చేరిపోయింది. టీవీకేలో చేరిన అన్నాడీఎంకే మాజీ మంత్రుల్లో రాధాకృష్ణన్ ఉడుమల్‌పేట నుంచి పోటీ చేసి ఓడిపోగా, సంపత్ కడలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మూడో స్థానంలో నిలిచారు. కోవిల్‌పట్టిలో కడంబూర్ రాజు ఓటమి పాలయ్యారు. మరోవైపు టీవీకేలో చేరిన తొలితరం ప్రముఖ అన్నాడీఎంకే నేతల్లో సెంగోట్టయ్యన్ ఒకరు. ఆయన ఎన్నికలకు చాలా కాలం ముందే విజయ్‌కు బహిరంగంగా మద్దతు తెలిపారు. ఆ తర్వాత ఆయన ఎన్నికల్లో గెలిచి మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు.

# సాహితీవేత్త వాసాప్రభావతిశాస్త్రి రచనలు అజరామరం

### న- తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి.రమణాచారి




డా. వాసాప్రభావతి జీవితసాఫల్య ప్రతిభాపురస్కారంతో నిత్యానందరావును సత్కరిస్తున్న రమణాచారి, సుధామ, రఘురామ్, గుడిపాటి, పొత్తూరి

**నాంపల్లి, జూన్ 6 ప్రభాతవార్త :** ప్రముఖ తెలుగు రచయిత్రి, కవయిత్రి, సాహితీవేత్త డా. వాసా ప్రభావతిశాస్త్రి రచనలు అద్భుతం, అజరామరం అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలిగా, తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలైన కవితలు, వ్యాసాలు, కథలు విస్తృతంగా రచించారని, ముఖ్యంగా మహిళా రచయితలను ప్రోత్సహించడానికి విశేష కృషిచేశారని తెలిపారు. అమ్మని తలచుకోవడం ఎంతో పవిత్రమైన కార్యక్రమం. కనిపించే తల్లిదండ్రులే కనిపించే దేవతలని పునరుద్ఘాటించారు. వాళ్లని కొలుచుకున్నవారే జీవితంలో సఫలీకృతమౌతారని స్పష్టం చేశారు. 40కిపైగా పుస్తకాలను ప్రచురించిన ఆమె వ్రాసిన మొదటి కవితా సంకలనం ఆలాపన, తన తల్లిపై రచించిన అమ్మ కవితా సంకలనం మరువలేనివన్నారు. ఆమె ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు, రివార్డులు అందుకున్నారని తెలిపారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, వాసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ప్రముఖ కవి సుధామ సభాధ్యక్షతన జరిగిన ప్రముఖ రచయిత్రి డా. వాసా ప్రభావతిశాస్త్రి జయంతికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి గౌరవ అతిథులు శైలజామిత్ర, గుడిపాటి వెంకటేశ్వర్లు, పొత్తూరి సుబ్బారావు, కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, వాసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. వాసాప్రకాశ్, మీనాక్షి తదితరులతో కలిసి ముందుగా జ్యోతిప్రకాసనంచేసి వాసా ప్రభావతి చిత్రపటానికి పూలమాలతో ఘననివాళులర్పించి ప్రముఖ సాహితీవేత్త, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావును ఘనంగా సత్కరించి డా. వాసా ప్రభావతి జీవితసాఫల్య ప్రతిభా పురస్కారం; ప్రముఖ సాహితీవేత్త డా. ముదిగంటి సుజాతారెడ్డిని ఘనంగా సన్మానించి డా. వాసా ప్రభావతి గురుదేవోభయ గురుపురస్కారం ప్రాదానం చేసి శుభాభినందనలు తెలిపారు. సభకు మద్దాళి రఘురామ్ స్వాగతం పలికారు. పురస్కార గ్రహీతలు తమ స్పందనను తెలియజేశారు. అనంతరం వాసా ప్రభావతి స్మారక కవితల, కథల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానంచేసి శుభాశీస్సులందజేశారు. సభకుముందు కెఎస్ఆర్.మూర్తి సమర్పణలో వాసా ప్రభావతి రచించిన లలితగీతాల సంగీత విభావరి ఆహుతులకు వీనులవిందు కావించి సంగీతలోకంలో విహరింపజేసింది.

# సింగరేణిలో 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

### మెడికల్ బోర్డు కేసులో ఇద్దరి అరెస్ట్ :సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త** సింగరేణిలో ప్రస్తుతం 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలిపారు. అయితే ఇది గత పదేళ్ల స్టాక్ చరిత్రలో అత్యల్పమన్నారు. గతంలో సగటున 50 లక్షల నిల్వలు ఉండేవని చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం ఒక ప్రకటనలో ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా జరిగే నవంబరు నుంచి మే మాసాల మధ్య బొగ్గు నిల్వలు పేరుకుపోతూ ఉంటాయన్నారు. 2015 -16లో 70 లక్షల టన్నులు, 2016-17 లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు రికార్డు అయిందని వివరించారు. ఈ విధంగా 2014 నుంచి 2024 వరకు సగటును 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు గనులు, సీహెచ్పీల వద్ద ఉన్నట్లు వెల్లడించారు. ఇక వర్షాకాలం థర్మల్ విద్యుత్ అవసరాల కోసం బొగ్గు నిల్వలు ఉండటం అత్యవసరమన్నారు. లేని పక్షంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గును రవాణా చేయలేని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. థర్మల్ పవర్ స్టేషన్ల అవసరాలకు 15 రోజులపాటు సరిపడేలా కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలను సిద్ధంగా ఉంచడం జరుగుతుందన్నారు. తద్వారా వర్షాకాలంలో విద్యుత్ కేంద్రాలకు నిరాటంకంగా బొగ్గు సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. దేశంలో ప్రతీ బొగ్గు కంపెనీ వద్ద కూడా ఇలాంటి నిల్వలు ఉండటం అత్యంత సహజమని పేర్కొన్నారు. 39 గనులు ఉన్న సింగరేణిలో నిత్యం బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో కొంత మొత్తంలో బొగ్గు స్టాక్ గా ఉండటం అత్యంత సహజమన్నారు. అలాగే సింగరేణి కాలరీస్‌లో ఓవర్ బర్డెన్ తొలగింపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అతి కీలకమైనదిగా వెల్లడించారు. సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే బొగ్గు పొరలపై ఉండే పై మట్టి (ఓవర్ బర్డెన్) ను సకాలంలో తొలగించాల్సి ఉంటుందని, దీని తొలగింపు పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. సింగరేణికి సంబంధించిన కాంట్రాక్టులను బహిరంగ టెండర్ల ద్వారానే అప్పగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులపై అవగాహన, అంచనా లేక కొందరు కాంట్రాక్టర్లు ఓవర్ బర్డెన్ పనులను ఆపివేయడం లేదా మందకొడిగా నిర్వహించడం వంటివి చేశారన్నారు. దీని ఫలితంగా పనితీరు దెబ్బతిని, సింగరేణికి బొగ్గు ఉత్పత్తిలో నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సైట్ విజిట్ ముఖ్యమని స్పష్టం చేశారు. ఇక సింగరేణిలో డిపెండెంట్, కారుణ్య ఉద్యోగాల నియామకాల కోసం మెడికల్ బోర్డును కొనసాగించడం జరుగుతోందని, అయితే ఈ ఉద్యోగ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్నారు.

# నేడు మల్కాజ్‌గిరిలో రూ.1,474 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న రూ.1,474 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ఫేజ్3లో నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా ఏటీసీ సెంటర్ చుట్టూ రూ.960 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రత్యామ్నాయ రహదారుల పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే టీకేఆర్ కాలేజ్ జంక్షన్ - గాయత్రినగర్ జంక్షన్ - మందా మల్లమ్మ జంక్షన్ల మధ్య రూ.416 కోట్లతో నిర్మించనున్న ఆరు లేన్ల ద్విముఖ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ఫేజ్3లో రూ.98 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవనానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ భవనం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన మున్సిపల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అదే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "క్యూర్1" మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ యాప్ ద్వారా ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు, నీటి చార్జీలు, ట్రాఫిక్ చలానాలు తదితర ప్రభుత్వ సేవలకు సంబంధించిన చెల్లింపులను ఒకే వేదికపై సులభంగా నిర్వహించే అవకాశం కల్పించబడనుంది. అలాగే ఉప్పల్‌లో రూ.27.17 కోట్ల వ్యయంతో 0.97 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణంతో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంత అభివృద్ధికి ఊతమిచ్చే ఈ భారీ ప్రాజెక్టులు రవాణా, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవల రంగాల్లో కీలక మార్పులు.




ప్రదర్శనలో పాల్గొన్న మహేష్‌కుమార్‌గౌడ్, పొన్నం ప్రభాకర్, అనిల్‌కుమార్‌యాదవ్. సచిన్ సావంత్ తదితరులు

## నీట్ పేపరు లీకేజీకి వ్యతిరేకంగా నగరంలో కాంగ్రెస్ పార్టీ నిరసన

### కేంద్ర మంత్రి చేతగాని తనం వల్లే పేపర్ లీకేజీ: మహేష్‌కుమార్‌గౌడ్

**సైఫాబాద్, జూన్ 6 ప్రభాతవార్త:** నీట్ పేపరు లీకేజీ, పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు పెంపు, సిబిఎస్ఇ వైఫల్యం, రూపాయి పతనంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు శనివారం నగరంలో భారీగా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ప్రారంభమై ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి. ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు మోత రోహిత్‌ముదిరాజ్ తదతరులు పాల్గొన్నారు. ప్రదర్శన అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ చేతగాని తనం వల్లేనే నీట్ పేపర్ లీకేజీ అయిందని, లక్షలాది విద్యార్థుల భవిషత్తుకు అన్యాయం జరిగిందన్నారు. దీనికి కేంద్ర మంత్రి బాధ్యత వహించి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు నెలలు తరబడి రాత్రిభవళ్ళు ఎంతో కష్టపడి చదువుకున్నారని ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృదా అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రభుత్వం విద్యా వైద్యంపై ప్రత్యేకంగా దృష్టి చూపుతుందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు కాగానే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలను పెంచిందని, దీంతో అన్ని ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రజలు ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ విద్యలో నవశకం

**- మూలా పేటలో 20 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో డీఎస్ఆర్ హైస్కూల్ - ప్రభుత్వ స్కూల్‌లో రోబోటిక్ ల్యాబ్ - అంతర్జాతీయ ప్రమాణాలతో ముస్తాబౌతున్న పారశాల - 8 నెలల కాలంలో అంతర్జాతీయ స్థాయి స్కూల్ సిద్ధం : మంత్రి నారాయణ**

**నెల్లూరు, జూన్ 6, ప్రభాతవార్త-వైద్యం** విద్యావ్యవస్థలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ నెల్లూరులో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొస్తున్న విప్లవాత్మక సంస్కరణల్లో భాగంగా, నెల్లూరు 39వ డివిజన్ మూలాపేటలో దాదాపు 20 కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమౌతున్న డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. గత ప్రభుత్వం మూసివేసిన విఆర్ హైస్కూల్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో పునఃప్రారంభించారు. అదే స్ఫూర్తితో, ఇప్పుడు మూలపేటలో ఒక కోటలాంటి అద్భుతమైన స్కూల్ బిల్డింగ్‌ను డిఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. పనులను శనివారం మంత్రి నారాయణ పర్యవేక్షించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త ప్రాంగణంలో, 24,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 హైటెక్ క్లాస్‌రూమ్‌లను కేవలం ఎనిమిది నెలల రికార్డు కాలపరిమితిలో పూర్తి చేసి ఫర్నిచర్‌ను సిద్ధం చేశారన్నారు. ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు రాష్ట్రంలోనే అత్యంత ఆధునికమైన రోబోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం అన్నారు. కేవలం చదువే కాకుండా, పిల్లల ఆటల కోసం బెంగళూరు నిపుణులతో ప్రత్యేకంగా సింథటిక్ ఎనామిల్ కోటింగ్ వేయించిన కబడ్డీ కోర్ట్, క్రికెట్ నెట్, హాఫ్ బాస్కెట్‌బాల్, రెండు బాడ్మింటన్ కోర్టులు మరియు చిల్డ్రన్ ప్లే ఏరియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. సురక్షితమైన ఆర్వో ప్లాంట్ తాగునీరు, ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక సిక్ రూమ్ కూడా ఇక్కడ అందుబాటులోకి వచ్చాయన్నారు. స్కూల్ ఆధునీకరణకు ముందుకొచ్చి శరవేగంగా పనులు పూర్తి చేసిన సుధాకర్ రెడ్డిని ,వారి కుటుంబ సభ్యులను మంత్రి నారాయణ అభినందించారు. డిఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో మంత్రి నారాయణ హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా ఫోన్ చేసి నెల్లూరు మున్సిపల్ స్కూల్స్ డెవలప్‌మెంట్ ప్రపోజల్ పెట్టారన్నారు. ఆయనపై గౌరవంతో మూలాపేట హైస్కూల్‌ను 8 నెలల్లో కార్పొరేట్ స్థాయిలో నిర్మించడానికి అంగీకరించానని తెలిపారు. 2.5 ఎకరాల స్థలంలో, మొదటి ఫేస్ కింద 24,000 చదరపు అడుగుల్లో 14 క్లాస్‌రూమ్‌లు, అధునాతన ల్యాబ్స్, ఆర్ఓ ప్లాంట్, సిక్ రూమ్‌లతో పాటు బెంగళూరు నిపుణులతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కబడ్డీ, క్రికెట్, బాస్కెట్‌బాల్, బాడ్మింటన్ కోర్టులను సిద్ధం చేశామన్నారు. ఈ నిర్మాణానికి సహకరించిన మూలాపేట ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, నెల్లూరులో ఎంతోమంది ఉన్నా తనను నమ్మి ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన మంత్రి నారాయణకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత అశోక్, 39వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ అన్నంగి ప్రసాద్ ,అధ్యక్షుడు మనోహర్, జనరల్ సెక్రటరీ మధురెడ్డి, ఉపాధ్యక్షుడు మురళి, దీనదయాళ్, విజయ్, నాని స్థానిక ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్తరహిత ఎపి కోసం విజన్‌తో ముందడుగు

**- జూలై నెలాఖరుకు 107 ప్రాసెసింగ్ ప్లాంట్లు పూర్తి - రెండేళ్లలో దొంతాలి వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ అందుబాటులోకి న: ఎపిమంత్రి నారాయణ**



**నెల్లూరు, జూన్ 6, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తో ప్రజారోగ్య పరిరక్షణ దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. దొంతాళి డంపింగ్ యార్డ్‌లోని ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను శనివారం స్వయంగా పర్యవేక్షించిన ఆయన, పనులు శరవేగంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దొంతాళిలో ఉన్న లక్ష టన్నుల చెత్తను ఈ నెలాఖరుకల్లా పూర్తిగా తొలగిస్తామని, అక్కడ జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను రెండేళ్లలో అందుబాటులోకి తెచ్చి ప్లాంట్‌కు 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెత్తను ఏ రోజుకారోజు బర్న్ చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం అవగాహన, విజన్ లేక చెత్త పరిపాలన చేసిందని, ప్రజలపై చెత్తపన్ను వేయడమే కాకుండా రాష్ట్రంపై 153 లక్షల టన్నుల చెత్తను వదిలివెళ్లిందని విమర్శించారు. 2014లో తాము శాంక్షన్ చేసిన ప్లాంట్లను గత పాలకులు రద్దు చేశారని, అవి పూర్తయి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు వచ్చే 7 వేల టన్నుల చెత్త ఆ రోజే బర్న్ అయిపోయేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 130 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, మిగిలిన 23 లక్షల టన్నుల చెత్తను జూలై ఆఖరుకల్లా ప్రాసెస్ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖల్లోని ప్లాంట్ల ద్వారా రోజుకు 2,800 టన్నుల చెత్తతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, తమ ప్రభుత్వం వచ్చాక మరో 6 వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం అనుమతిచ్చారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం రూ.300 కోట్లతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, జూలై నెలాఖరు నాటికి ఏపీలోని 107 ప్రాసెసింగ్ ప్లాంట్లను ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్,

ఎస్ ఈ జానీ, జిందాల్ కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, జిగ్మా కంపెనీ ప్రతినిధులు, నారాయణ విద్యాసమస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 47వ డివిజన్‌లో జరుగుతున్న సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, బిఎల్ఏ, బిఎల్ఓలతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

# నకిలీ, కల్తీ విత్తుల జోరు

### వరి, మిర్చి, పత్తి ప్రముఖ బ్రాండ్‌ల పేరుతో అమ్మకాలు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త** వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణలో నకిలీ విత్తనాల వ్యాపారం జోరుగా సాగుతోంది. నరాష్ట్రంలో ప్రతీ ఏటా నకిలీ, నాసికరం మిర్చి, పత్తి, వరి తదితర విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోతుండడం సర్వసాధారణమైంది. నాసిరకం, నకిలీ వవరి, మిర్చి, పత్తి, కూరగాయలు ముఖ్యంగా టమాటా, బెండ, వంకాయ, క్యాప్సికం నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు నాణ్యత కలిగినవని చెప్పి అమాయక రైతులతో వాటిని కొనుగోలు చేయిస్తున్నట్లు తెలియవచ్చింది. అనుమతి లేని హైబ్రీడ్ మిర్చి విత్తనాలను బహిరంగంగా అమ్మి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల్లో బెంగుళూరు నుండి వీటిని తెస్తున్న దళారులు కొన్ని షాపుల ద్వారా రైతులకు అమ్ముతున్నట్లు చెబుతున్నారు. ఈ విత్తనాలను పది గ్రాములు చొప్పున ప్యాకెట్లను తయారు చేస్తున్నారు. 341 హైబ్రీడ్ మిర్చి, 5531 బాడిగ రకం, ఎండామ్5 రకాలను అనుమతి లేకుండానే ఇటీవల కొందరు వ్యాపారులు రైతులకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఎవరికి అనుమానం రాకుండా వ్యాపారులు మిర్చి విత్తనాలను గిఫ్ట్ ప్యాక్‌ల్లో అమ్మినట్లు పలువురు చెబుతున్నారు. రాష్ట్రంలోని ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్, జగిత్యాల, సిద్దిపేట్, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్ తదితర జిల్లాల్లో నకిలీ విత్తనాల అమ్మకం జరుగుతునట్లు తెలుస్తోంది. ప్రైవేట్ మార్కెట్‌లో ఐఆర్ 64 పేరుతో వరి విత్తనాలను అమ్ముతున్నారు. 30 కేజీల బ్యాగుల్లో అమ్ముతున్న ఈ విత్తనాలు నాసికరం కావడంతో ఇది తెలియక కొనుగోలు చేసిన రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. ఒక్క బ్యాగు వరి విత్తనాల ద్వారా ఎకరంన్నర పొలంలో సాగు చేయవచ్చని, అయితే ఈ బ్యాగులను కొనుగోలు చేసి వేస్తే అవి అర ఎకరాకు కూడా సరిపోయే పరిస్థిది లేదని అంటున్నారు. మరోవైపు కాగా గ్రామీణ ప్రాంతాల్లో విత్తనాల దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. లైసెన్సులు లేకున్నా పలువురు దళారులు గోదాముల్లో క్వింటాళ్ల కొద్ది విత్తనాలను నిల్వలు పెట్టుకుని విక్రయాలు జరుపుతున్నారు. కొందరు రంగ ప్రవేశం చేసి నకిలీ, నాసికరం విత్తనాలకు తెరతీశారు. రైతుల నుండి డిమాండ్ రావడంతో వారి అవసరాల దృష్ట్యా దళారులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో తెచ్చి నిల్వ చేస్తున్నారు. ప్రధాన కంపెనీలకు చెందిన బ్రాండ్ల పేరుతో నకిలీ విత్తనాలను తయారు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిని తమకు అనుకూలంగా ఉన్న డీలర్ల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నారు.

## సింగపూర్ విమానంలో సాంకేతికలోపం

**గన్నవరం, జూన్ 6, ప్రభాతవార్త :** గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి సింగపూర్ వెళ్ళాల్సిన ఇండిగో విమానంలో సాంకేతికలోపం తలెత్తటంతో రెండు గంటలపాటు గన్నవరం విమానాశ్రయంలో నిలిచిపోయింది. శనివారం ఉదయం 9.35గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి సింగపూర్ వెళ్ళేందుకు 133 మంది ప్రయాణికులతో బయలుదేరిన విమానం రన్‌వేపైకి వెళ్ళేందుకు సిద్ధమైన సమయంలో ఇంజన్‌లో సాంకేతికలోపాన్ని గుర్తించిన పైలట్ విమానాన్ని నిలిపివేసి ఏటిసికి సమాచారం అందించాడు. వెంటనే రంగంలోకి దిగిన సాంకేతిక నిపుణులు దాదాపు రెండు గంటలపాటు శ్రమించి సాంకేతికలోపాన్ని సరిచేసారు. దీంతో ఉదయం 11.40గంటలకు ఈవిమానం గన్నవరం నుండి బయలుదేరి సింగపూర్‌కు వెళ్ళింది. పదిరోజుల అమెరికా పర్యటనకు కుటుంబసభ్యులతో కలిసి వెళుతున్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఇదే విమానంలో ఉండటంతో ఆయన అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఇతర ప్రయాణికులు, వారి కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. విమానం క్షేమంగా సింగపూర్ చేరుకోవటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



## గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దాం : ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టత్మకంగా. అద్భుతంగా నిర్వహించాలని, ఆ దిశలో చర్యలుండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలు -2027 సందర్భంగా మోడల్ పుష్కర పంచాయతీ ప్రణాళికపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం జరిగిన సమీక్షలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఇతర అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. మునికూడలిని గోదావరి మోడల్ పుష్కర పంచాయతీగా అభివృద్ధి చేయాలని ఇటీవల పవన్ ఆదేశించారు. ఈ క్రమంలో అక్కడ జరుగుతున్న ప్రగతి పనులపై ఆరా తీశారు. ఘాట్లకు వెళ్లేందుకు రహదారులు, భక్తులకు కల్పించే సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణపై అధికారులు వివరించారు.

ఈనెల 18 తర్వాత తాను స్వయంగా మునికూడలికి వస్తానని పవన్‌అన్నారు. మునికూడలిని నమూనాగా తీసుకోవాలని మిగతా చోట్ల పుష్కరఘాట్ల అభివృద్ధి చేయాలని సూచించారు. పది, పదహారోను రోజుల్లో ఎలాంటి అభివృద్ధి జరుగుతుందో చెప్పాలని అధికారులను అడిగారు.